# నినాదం

నిఖార్సైన జర్నలిజం


శనివారం, మే 3, 2025 | సంపుటి - 20 | సంచిక 111 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## పాక్ ఆక్రమిత కాశ్మీర్ అప్రమత్తం

### యుద్ధం వస్తుందన్న భయంలో పాలకులు

### 2నెలలకు సరకులు సిద్ధం చేసుకోవాలని ఆదేశం



న్యూఢిల్లీ : పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త వాతావరణ నెలకొన్న వేళ యుద్ధం తప్పదన్న ఆందోళన ఇరు దేశాల్లోనూ ఉంది. పాక్ ఇప్పటికే యుద్ధ సన్నద్ధతకు దిగింది. కశ్మీర్ వివాదాన్ని పూర్తిగా రూపుమాపాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు సూచనలు వినిపిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ఆహారం నిల్వ చేసుకోవాలంటూ స్థానికులను పీఓకే యంత్రాంగం అప్రమత్తం చేసింది. రెండు నెలలకు సరిపడా ఆహారాన్ని నిల్వ చేసుకోవాలని వాస్తవాధీన రేఖకు సమీపంలో ఉన్న 13 నియోజకవర్గాల ప్రజలకు సూచనలు చేశాం అని చౌద్రీ అన్వర్ ఉల్‌హక్ స్థానిక అసెంబ్లీలో శుక్రవారం వెల్లడించారు. 2లో

## చరిత్రలో లిఖించదగ్గ పునర్నిర్మాణ రోజు

### గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది

### అధికారం చేపట్టాక..అంధకారం నుంచి పట్టాలకెక్కిస్తున్నాం

### డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఇక అభివృద్దిని పరుగులు పెట్టిస్తా

### రైతుల త్యాగాలు..వారి ఉద్యమాలు చారిత్రాత్మకం

### మోడీ డైనమిక్ లీడర్‌షిప్‌తో ఐదోస్థానానికి దేశ ఆర్థిక వ్యవస్థ

### అమరావతి పునర్నిర్మాణ సభలో సిఎం చంద్రబాబు



అమరావతి : అమరావతి రాజధాని పున:ప్రారంభోత్సవం జరిగిన రోజు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే రోజని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గత ఐదు సంవత్సరాలు రాజధాని పనులు ఆగిపోయాయని, విధ్వంసం జరిగిందని అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని పున:ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ' ఈ రోజు చాలా గొప్ప రోజు. చరిత్రలో శాశ్వతంగా లిఖించదగ్గ రోజు. ఆ రోజు అమరావతి పనులకు ప్రధాని మోదీ గారు శంకుస్థాపన చేశారు. ఐదు సంవత్సరాలు విధ్వంసం జరిగింది. పనులు నిలిచిపోయాయి. మళ్లీ ప్రధాని మోదీ గారే పున:ప్రారంభం చేస్తున్నారంటే.. దీనికంటే మంచి రోజు చరిత్రలో ఇంకోటి లేదని అన్నారు. ఉగ్రవాదం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ.. ' ముందుగా మీ అందరికీ ఓ విషయం చెప్పాలి. 2లో

## సోనియా రాహుల్‌లకు ఢిల్లీ కోర్టు నోటీసులు


### నేషనల్ హెరాల్డ్ కేసులో నోటీసులు జారీ



న్యూఢిల్లీ : నేషనల్ హెరాల్డ్ కేసులో మనీ లాండరింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలకు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఈడీ దాఖలు చేసిన కేసులో వీరిద్దరికీ కోర్టు నోటీసులు పంపింది. ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీటుకు సమాధానం ఇవ్వాలని వారిద్దరికి కోర్టు జారీ చేసిన నోటీసుల్లో స్పష్టం చేసింది. ఈ కేసు తదుపరి విచారణ మే 7వ తేదీకి వాయిదా వేసింది. అయితే ఈడీ ఇటీవల దాఖలు చేసిన ఛార్జిషీట్ విచారణ సమయంలో ప్రతివాదుల వాదనలు వింటామని ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే స్పష్టం చేశారు. కొత్త చట్ట నిబంధనల ప్రకారం నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో నిందితులను విచారించకుండా ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోలేమని..

మిగతా 2లో

## పాక్ ప్రధాని యూట్యూబ్‌పైనా వేటు



### ప్రసారాలు నిలిపివేసిన భారత ప్రభుత్వం

న్యూఢిల్లీ : పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాక్ సంబంధాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్న వేళ అనేక చర్యలు తీసుకుంటున్న భారత్ పలు పాక్ యూట్యూబ్ ఛానళ్లను నిషేదించింది.. ఆ ఘటన తర్వాత భారత ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ 2లో

## కులగణన సర్వేలో రేవంత్ విజయం సాధించారు

### దీనిని జీర్ణించుకోలేకే కిషన్ రెడ్డి విమర్శలు: జగ్గారెడ్డి



హైదరాబాద్ : కులగణన విషయంలో తెలంగాణ బీజేపీ నేతలకు నిద్ర పట్టడం లేదని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. అసెంబ్లీలో జరిగిన చర్చలో బీజేపీ, సీపీఐ, బీఆర్ఎస్ కూడా పాల్గొన్నట్లు- తెలిపారు. క్షేత్ర స్థాయికి సర్వే వెళ్ళిందని.. కిషన్ రెడ్డి ఈ విషయం తెలుసుకోవాలన్నారు. ఇంటింటికి అధికారులు వెళ్లి సర్వే చేశారన్నారు. కుల గణనపై కిషన్ రెడ్డి విమర్శలపై స్పందిస్తూ..దీనిపై చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. కులగణనలో రేవంత్ సక్సెస్ అయ్యాడు కాబట్టి డైవర్ట్ చేసి బురద జల్లే ప్రయత్నం చేయకండన్నారు. 100 శాతం సర్వే సక్సెస్ ఫుల్‌గా జరిగిందని.. గవర్నర్ కూడా ఆమోదముద్ర వేశారన్నారు. అంటే సర్వే సరిగా జరిగింది అనే కదా..? అని అన్నారు. సర్వే జరిగిన నెల రోజుకు కిషన్ రెడ్డి తెలంగాణలో లేరని అనుకుంటా అన్నారు. అందుకే ఆయనకు కుల గణన మీద పూర్తిస్థాయిలో అవగాహన లేదని జగ్గారెడ్డి అన్నారు. 2లో




## చిరకాల స్వప్నం అమరావతి సాకారం కాబోతోంది

### స్వర్ణాంధ్ర నిర్మాణానికి అమరావతి ఎంతో కీలకం

### అమరావతి అంటే ఒకనగరం కాదు...ఒక శక్తి

### 60వేలకోట్ల పనులకు శంకుస్థాపనలు

### ఇవన్నీ ఎపి ప్రగతికి..వికసిత్ భారత్‌కు పునాదులు

### అన్ని రంగాల్లో అమరావతి అద్భుత నరగంగా ఆవిర్భవిస్తుంది

### చంద్రబాబు విజనరీ నేత..ఉమ్మడి ఎపిలో ఐటికి పెద్దపీట

### అమరావతికి అన్ని విధాలా అండగా ఉంటానని హామీ

### అమరావతి పునర్నిర్మాణ సభలో మోడీ ప్రసంగం



ఏపీ ప్రజల చిరకాల స్వప్నం అమరావతి సాకారం కాబోతుందని ప్రధాని మోడీ అన్నారు. అమరావతి ఒక పుణ్య భూమి అని.. నేను ఈ పుణ్యభూమిపై నిలబడి మీ అందరితో మాట్లాడటం ఆనందంగా ఉందన్నారు. అమరావతి అంటే సాంప్రదాయం, పురోగతి అని.. స్వర్ణాంధ్ర నిర్మాణానికి అమరావతి ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. అమరావతి అంటే కేవలం ఒక నగరమే కాదని.. ఒక శక్తి అని అభివర్ణించారు. అమరావతి నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరిస్తామన్న ప్రధాని.. రాష్ట్రంలో కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలవుతుందని వ్యాఖ్యానించారు.

అమరావతి : అమరావతి పునః నిర్మాణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు. తన ప్రసంగాన్ని తెలుగులో మొదలు పెట్టిన ఆయన.. దుర్గాభవానీ కొలువైన ఈ పుణ్య భూమిలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉందని అన్నారు. తన ప్రసంగం మధ్యమధ్యలో తెలుగులో మాట్లాడుతూ ఆకట్టుకున్నారు. ఇవాళ దాదాపు రూ.60 వేల కోట్ల పనులకు శంఖుస్థాపనలు చేశా.. అయితే ఇవి కేవలం శంఖుస్థాపనలే కాదు.. ఏపీ ప్రగతికి, వికసిత్ భారత్‌కు బలమైన పునాదులని పేర్కొన్నారు. శుక్రవారం వెలగపూడిలో అమరావతి పునర్నిర్మాణ పనులను మోడీ ప్రారంభించారు. మొత్తం 18 ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. మోడీ చేతుల మీదుగా అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మోడీ మాట్లాడుతూ.. ఏఐ, ఐటీ, ఎడ్యుకేషన్, హెల్త్ ఇలా అన్ని రంగాల్లో అమరావతి కీలకంగా మారబోతుందని అన్నారు. అమరావతి ప్రతి వ్యక్తి కలల నిర్మాణమని.. త్వరలోనే వారి స్వప్నం సాకారం కాబోతుందని చెప్పారు. ఉమ్మడి ఏపీలో చంద్రబాబు ఐటీ విజన్ అద్భుతమని.. ఆయన ఐటీ విజన్ ను నేను అప్పుడు గుజరాత్ సీఎంగా ఉండి పరిశీలించానని తెలిపారు. నాణ్యమైన ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేయాలంటే చంద్రబాబు తర్వాతే ఎవరైనా అని ప్రశంసించారు. 2015లో అమరావతి నిర్మాణానికి నేనే శంఖుస్థాపన చేశా.. పదేండ్లు ఏపీ అభివృద్ధి కోసం సహకరించామని పేర్కొన్నారు. 2లో




## నత్తనడకన ఉప్పల్ ఫ్లై ఓవర్

### భూసేకరణలో ఆలస్యంతో పనుల్లో జాప్యం

### అధికారులను మందలించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

ఉప్పల్ నుంచి ఘట్ కేసర్ వైపు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించిన భూ సేకరణ పక్రియలో ఎదురవుతున్న సమస్యలపై కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి అధికారులను ఆరా తీశారు. ప్రజల ప్రయాణ సౌలభ్యం కోసం ప్రాధాన్యతతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉప్పల్-ఘట్ కేసర్ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం భూమి సేకరణలో ఆలస్యం పట్ల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సీరియస్ అయ్యారు. లక్షలాది ప్రయాణికుల రాకపోకలకు ఉపయోగపడే ఉప్పల్ నుంచి ఘట్ కేసర్ వైపు నిర్మిస్తున్న పైవంతెన కోసం భూమి సేకరణ పక్రియలో జాప్యం అవుతున్న విషయాన్ని కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి అధికారులను ప్రశ్నించారు.

హైదరాబాద్ : ప్రాజెక్టు వేగవంతంగా పూర్తయ్యేలా వెంటనే భూమి సేకరణ పూర్తిచేయాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సుమారు రూ. 400 కోట్ల వ్యయంతో నిర్మితమైన అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను మే 5న కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రారంభించ నున్నారు. ఈ సందర్భంగా వంతెన కింద రోడ్డుపై ప్రజలకు అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు- చేయాలని సంబంధిత అధికారులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆదేశించారు. కాగా.. మరోవైపు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధిలో మొదట ప్రతిబింబించేది హైదరాబాద్ అని.. అభివృద్ధి అంటే కేవలం హై-టె-క్ సిటీ- కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. 2లో

## హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు

### 8న ప్రారంభించనున్న సిఎం రేవంత్



హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో భారీ స్పందన పొందిన హైడ్రా ఇప్పుడు ఇతర జిల్లాలకు కూడా విస్తరించేందుకు సన్నద్ధమవుతోంది. అక్రమ నిర్మాణాల కూల్చివేత, చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్న ఈ ప్రత్యేక విభాగానికి ఇటీవల ప్రభుత్వం మరిన్ని అధికారాలు అప్పగించింది. ఈ నేపథ్యంలో, హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించినట్లుగా, త్వరలో ప్రత్యేక హైడ్రా పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అనుగుణంగా 8వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా పోలీస్ స్టేషన్‌ను అధికారికంగా ప్రారంభించనున్నారు.

మిగతా 2లో

# పాక్ ఆక్రమిత కాశ్మీర్ అప్రమత్తం

అలాగే స్థానిక ప్రభుత్వం రూ.100 కోట్లతో ఎమర్జెన్సీ ఫండ్‌ను ఏర్పాటు- చేసింది. ఆహారం, ఔషధాలు, ఇతర కనీస అవసరాల సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకుంటున్నట్లు ఈ మొత్తాన్ని కేటాయించినట్లు- ఉల్‌హక్ తెలిపారు.స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలోనే దొంగదెబ్బతో పీఓకేను తన నియంత్రణలోకి తీసుకున్న పాకిస్థాన్- ఆ ప్రాంత అభివృద్ధిని గాలికొదిలేసింది. ఇండియాపై విద్రోహచర్యలకు పాల్పడేందుకు ఉపయోగపడే ప్రదేశంగానే పీఓకేను పాక్ చూస్తోంది. పీఓకే ప్రధానమంత్రి పీఠం అధిరోహించినవారు ఇస్లామాబాద్ సర్కారు చేతుల్లో కీలుబొమ్మగానే మిగిలిపోతున్నారు. ఫలితంగా స్థానికుల హక్కులకు రక్షణ కరవవుతోంది. దివాళ అంచున ఉన్న పాకిస్థాన్‌ను స్థానిక తిరుగుబాట్లు-, వరుస ఉగ్రదాడులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అక్కడ భారత్ అనుకూలవాదం వినిపిస్తోంది. భారత సంతతికి చెందిన బ్రిటిష్ ఎంపీ లార్డ్ మేఘనాథ్ ఇటీవల మాట్లాడుతూ.. కశ్మీర్ వివాదాన్ని పూర్తిగా రూపుమాపాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని భారత ప్రభుత్వానికి సూచించారు. అదొక్కటే అన్ని సమస్యలకు పరిష్కారమన్నారు. ఉగ్రవాదులను శిక్షించడానికి, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే.. భారత్ కఠినంగా జవాబివ్వాలని కోరారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి చాలా క్రూరమైనదని ఆవేదన వ్యక్తంచేశారు. కశ్మీర్ వివాదంలో ఈ ఘటనే చివరిది కావాలని ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని విశ్వాసం వ్యక్తంచేశారు.

# పాక్ ప్రధాని యూట్యూబ్‌పైనా వేటు

యూట్యూబ్ ఛానల్ స్ట్రీమింగ్‌ను మనదేశంలో నిలిపివేసింది. జాతీయ భద్రతకు సంబంధించి భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ కంటెంట్ ప్రస్తుతం ఈ దేశంలో అందుబాటులో లేదని ఆ ఛానల్ క్లిక్ చేసిన వారికి ఒక సందేశం దర్శనమిస్తోంది. ఉద్రిక్తతలు భగ్గుమంటోన్న వేళ.. పాకిస్థాన్ కేంద్రంగా నిర్వహిస్తున్న పలు యూట్యూబ్ ఛానళ్ల ప్రసారాలు, సామాజిక మాధ్యమ ఖాతాలను భారత్‌లో నిలిపివేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. పాక్ న్యూస్, ఎంటర్టైన్‌మెంట్ మీడియాకు చెందిన పలు ఛానళ్లపై వేటు పడింది. పాక్ మాజీ ఆటగాళ్లు షోయబ్ అక్తర్, బాసిత్ అలీ, షాహిద్ అఫ్రిది ఛానళ్లకు కూడా అందులో ఉన్నాయి. ఆ దేశ రక్షణ మంత్రి ఎక్స్ ఖాతాను బ్లాక్ చేసింది. పాకిస్థాన్ క్రికెటర్లు బాబర్ అజామ్, మహ్మద్ రిజ్వాన్, షహీన్ అఫ్రిదీ ఇన్‌స్టా ఖాతాలను తాజాగా సస్పెండ్ అయ్యాయి. పాకిస్థాన్ జావెలిన్ త్రోయర్, ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్షద్ నదీమ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను ఇప్పటికే బ్లాక్ చేసిన సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత చట్టపరమైన చర్యల్లో భాగంగా భారత్‌లో అతని ఖాతాను నిలిపివేశారు. భారత్‌లో నదీమ్ ఖాతా అందుబాటులో లేదు. ఖాతాలోని సమాచారాన్ని నియంత్రించాలన్న చట్టపరమైన అభ్యర్థనను పాటిస్తున్నామని భారత్‌లో నదీమ్ ఇన్‌స్టా ఖాతా తెరిచిన వాళ్లకు ఈ సందేశం కనిపిస్తోంది.

# యూఎస్ వీసా కోసం కాన్సులేట్‌కు కెసిఆర్

హైదరాబాద్ : యూఎస వీసా కోసం మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ గచ్చిబౌలిలోని అమెరికన్ కాన్సులేట్ కార్యాలయానికి వచ్చారు. అమెరికా వీసా కోసం కాన్సులేట్ కార్యాలయానికి వచ్చారని సన్నిహితులు తెలిపారు. ఇప్పటికే సికింద్రాబాద్ పాస్ పోర్ట్ కార్యాలయంలో పాస్‌పోర్ట్ రెన్యువల్ కోసం పత్రాలు సమర్పించారు.. ఎర్రవల్లి ఫామ్ హౌస్ నుంచి నేరుగా అమెరికన్ కాన్సులేట్ కి చేరుకున్న కేసీఆర్ తో పాటు జోగినపల్లి సంతోష్, జీవన్ రెడ్డి ఉన్నారు.. ఈ ఏడాది ఫిబ్రవరి 19 కేసీఆర్ సికింద్రాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయానికి వచ్చిన విషయం తెలిసిందే. పాస్ పోర్ట్ రెన్యువల్ కోసం ఆయన కార్యాలయానికి వచ్చారు. ఆయన తన డిప్లమాటిక్ పాస్‌పోర్ట్ ను సబ్మిట్ చేసి సాధారణ పాస్‌పోర్ట్ ను తీసుకున్నారు. ఇప్పుడుగచ్చిబౌలిలోని అమెరికన్ కాన్సులేట్ కార్యాలయానికి వచ్చారు. అమెరికాకు కెసిఆర్ దరఖాస్తు చేశారని సమాచారం.

# అన్ని వర్గాలను ఆదుకున్న కెసిఆర్

## అభివృద్ధి బిఆర్ఎస్‌తోనే సాధ్యం

నిజామాబాద్ : బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలను ఆదుకున్న ఘనత నాటి సిఎం కెసిఆర్‌దని నిజామాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. కానీ పద్నాలుగు నెలలకే కాంగ్రెస్ మడత చుట్టేసిందని, అభివృద్ధి వెనక్కి పోయిందని అన్నారు. నీళ్లు, కరెంట్ ఇవ్వలేని దుస్థితిలో ఉందన్నారు. తెలంగాణ సమాజంలో అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి చేస్తున్న ఘనత కేసీఆర్‌దని వేముల అన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత తెలంగాణలో మాత్రమే అన్నారు. గత పాలకులు 70 ఏళ్లలో చేయని అభివృద్ధిని సీఎం కేసీఆర్ తొమ్మిళ్లలో చేసి చూపించారని పేర్కొన్నారు. తెలంగాణలో కరువును పారదోలేందుకు కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును చేపట్టారని అన్నారు. దీంతో పాటు మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ వంటి ఆధునిక జలాశయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అలాగే భూగర్భ జలాలలు పెరిగాయన్నారు. రైతులకునీరు, రైతుబంధు సాయం వంటివి అందడం,ధాన్యం కొనుగోళ్లు చేపట్టడంతో వారు సుఖంగా ఉన్నారని అన్నారు. కేంద్రం ధాన్యం కొనుగోళ్లకు ముందుకు రాకున్నా కెసిఆర్ ముందుకు వచ్చి ధాన్యం కొనుగోళ్లను చేపట్టారని అన్నారు. దిగుబడి పెంచేందుకు రైతులు ఆధునిక పద్ధతులు అవలంబిం చేలా చేశారని అన్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వీటిని కొనసాగించడం లేదన్నారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందని, ఆ పార్టీ నాయకుల మోసపూరిత మాటలను నమ్మవద్దని ఆయన ప్రజలకు సూచించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినట్లు తెలిపారు. పేదలు, రైతులకు సంక్షేమ పథకాలు పక్కాగా అందాయని గుర్తుచేశారు. రైతులకు వరికి రూ.500 బోనస్ ఇస్తానని చెప్పిన కాంగ్రెస్ పార్టీ..ఇప్పుడు నోరెత్తడం లేదని విమర్శించారు. ప్రజలను అబద్దాలతో ఆగంచేసే కాంగ్రెస్, బీజేపీ కావాలా.. అభివృద్ధి చేసే బీఆర్ఎస్ కావాలో ప్రజలు నిర్ణయించు కోవాలని సూచించారు.

# అమరావతికి వస్తున్న ప్రధానికి స్వాగతం

## ఎక్స్ వేదికగా పోస్ట్ చేసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణ పనుల పున: ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ కి మన: పూర్వకంగా స్వాగతం పలుకుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. రాష్ట్ర ప్రజల కలల రాజధాని నిర్మాణాన్ని సాకారం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ఎపిలో ప్రతి పౌరుడికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించే ప్రజా రాజధానిగా అమరావతి ఆవిష్కృతం అవుతుందని, సంపద సృష్టితో రాష్ట్రానికి ఒక చోదక శక్తిగా నిలబడుతుందని పేర్కొన్నారు.
అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ పనులను పున: ప్రారంభించేందుకు రాష్ట్రానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నట్లు- డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపంగా రూపుదిద్దుకుంటున్న ప్రజా రాజధాని పునర్నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# చిరకాల స్వప్నం అమరావతి సాకారం కాబోతోంది

ఏపీని వికసిత్ భారత్‌కు గ్రోత్ ఇంజిన్‌గా తయారు చేయాలని కోరారు. ఏపీలో కనెక్టివిటీ-కి కొత్త అధ్యాయం మొదలైందన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్‌కు ఇది శుభ సంకేతమని చెప్పారు. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలని ప్రధాని ఆకాంక్షించారు. టెక్నాలజీ నాతో మొదలైనట్లు- చంద్రబాబు ప్రశంసించారు. నేను గుజరాత్ సీఎం అయ్యాక హైదరాబాద్‌లో ఐటీని ఎలా అభివృద్ధి చేశారో తెలుసుకున్నా. అధికారుల్ని పంపించి హైదరాబాద్ ఐటీ- అభివృద్ధిని అధ్యయనం చేయించా. పెద్ద ప్రాజెక్టులు చేపట్టాలన్నా.. త్వరగా పూర్తి చేయాలన్నా చంద్రబాబుకే సాధ్యం. పెద్ద పెద్ద పనుల్ని చేపట్టి పూర్తి చేయడంలో చంద్రబాబును మించిన నేత దేశంలో లేరు. 2015లో ప్రజా రాజధానిగా అమరావతికి శంకుస్థాపన చేశా. గత పదేళ్లలో అమరావతికి కేంద్రం మద్దతుగా నిలిచింది. అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరించింది. ఇప్పుడూ అమరావతి అభివృద్ధికి కేంద్రం సహకారం కొనసాగుతుంది. అమరావతిలో అన్ని రకాల నిర్మాణాలకు కేంద్రం తోడ్పాటు- అందిస్తుందని అన్నారు.ఎన్టీఆర్.. వికసిత ఏపీ కోసం కలలుగన్నారు. మనందరం కలిసి ఆయన కలల్ని నిజం చేయాలి. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలి. పవన్ కల్యాణ్ గారూ ఇది మనం చేయాలి. మనమే చేయాలి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలిచింది. ఏపీలో రైలు, రోడ్డు ప్రాజెక్టులకు కేంద్రం రూ.వేల కోట్లు సాయం చేస్తోంది. ఇప్పుడు నేను పుణ్యభూమి అమరావతిపై నిలబడి ఉన్నప్పుడు నాకు కనబడుతున్నది ఒక్క నగరం మాత్రమే కాదు.. ఒక స్వప్నం సాకారాం కాబోతోందనే భావన కలుగుతోంది. దాదాపు రూ.60వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశా. ఇవి కేవలం కాంక్రీటు నిర్మాణాలు కాదు.. ఏపీ ప్రగతి, ఆశలు, వికసిత్ భారత్ ఆశయాలకు బలమైన పునాదులు. వీరభద్ర స్వామి, అమరలింగేశ్వరస్వామి, తిరుపతి వెంకటేశ్వరస్వామికి పాదాలకు నమస్కరిస్తూ ఏపీ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. చంద్రబాబు, పవన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నానని అన్నారు. ఇంద్రలోకం రాజధాని అమరావతి. ఇప్పుడు ఏపీ రాజధాని పేరు కూడా అమరావతే. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభ సంకేతం. ఏపీని ఆధునిక ప్రదేశ్, అధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతి. అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి. యువత కలలు సాకారమయ్యే రాజధానిగా ఈ నగరం ఎదుగుతుంది. ఐటీ-, ఏఐ సహా అన్ని రంగాలకూ అమరావతి గమ్య స్థానంగా మారుతుంది. హరితశక్తి, స్వచ్ఛ పరిశ్రమలు, విద్య, వైద్య కేంద్రంగా అమరావతి మారుతుంది. అమరావతిలో మౌలికవసతుల కల్పనకు కేంద్ర సహకరిస్తుందని చెప్పారు. ఏపీలో కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలవుతుంది. రైల్వే ప్రాజెక్టులతో ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు, మరో రాష్ట్రానికి అనుసంధానం పెరుగుతుంది. ఈ అనుసంధానం తీర్థయాత్రలకు పర్యాటకాభివృద్ధికి ఉపయోగపడుతుంది. ఒకప్పుడు తెలుగు రాష్ట్రాలకు రైల్వే బడ్జెట్ రూ.900 కోట్ల లోపే ఉండేది. ఇప్పుడు కేవలం ఏపీకే రూ.9వేల కోట్ల రైల్వే నిధులు ఇచ్చాం. ఏపీకి గతం కంటే పది రెట్లు- అధికంగా నిధులు కేటాయించాం. గత పదేళ్లలో ఏపీలో 750 రైల్వే బ్రిడ్జులు, అండర్‌పాస్‌లు నిర్మించాం. వందేభారత్, అమృత్ భారత్ రైళ్లు కేటాయించాం. ఏపీలో 70కి పైగా రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ ప్రాజెక్టు కింద అభివృద్ధి చేస్తున్నాం. మౌలిక వసతుల కల్పనతో ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. సిమెంట్, స్టీల్, రవాణా రంగాలు అభివృద్ధి చెందుతాయి. ఈ ప్రాజెక్టుల వల్ల వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. రైతు వికాసానికి కేంద్రం ప్రత్యేకంగా కృషిచేస్తోంది. రైతులకు పథకాలు, పరిహారం కింద రూ.17వేల కోట్లు- సాయం చేశాం. పోలవరం త్వరగా పూర్తి చేసేందుకు కలిసి పనిచేస్తాం. ప్రతి ఎకరానికీ నీరు ఇచ్చేందుకు కృషిచేస్తాం. వికసిత్ భారత్ నిర్మాణం కావాలంటే మహిళలు, కార్మికులు అభివృద్ధి చెందాలి. ఈ నాలుగు వర్గాలు నాలుగు స్తంభాలు లాంటివారు. రక్షణ రంగాన్ని బలోపేతం చేస్తున్నాం. నాగాయలంకలో టెస్టింగ్ రేంజ్.. దుర్గామాత లాగా భారత రక్షణ రంగానికి శక్తినిస్తుంది. శ్రీహరికోట నుంచి ప్రయోగించే ప్రతి రాకెట్ కోట్లాది భారతీయులకు గర్వకారణం. భారత శక్తి అంటే కేవలం మన ఆయుధాలే కాదు.. మన ఐక్యత కూడా. విశాఖలో యునిటీ-మాల్ అభివృద్ధి చేస్తున్నాం అని అన్నారు. విశాఖలో జూన్ 21న జరగనున్న యోగా డేలో పాల్గొంటాను. నన్ను ఆహ్వానించినందుకు ప్రభుత్వానికి థ్యాంక్స్. మన యోగాకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంది. వచ్చే 50 రోజులూ ఏపీలో యోగాకు అనుకూల వాతావరణం కల్పించాలి. ఏపీలో కలలు కనేవాళ్ల సంఖ్య తక్కువేం కాదు.. ఆ కలల్ని నిజం చేసేవారి సంఖ్యా తక్కువకాదు. ఏపీ సరైన మార్గంలో నడుస్తోంది. సరైన వేగంతో ముందుకెళ్తోంది. దీన్ని కొనసాగించాలి. మూడేళ్లలో అమరావతి పనుల్ని పూర్తి చేస్తామని సీఎం అన్నారు. ఆ పనులు పూర్తయ్యాక ఏపీ జీడీపీ ఏ స్థాయికి వెళ్తుందో నేను ఊహించగలను. అది ఏపీ రాష్ట్రం చరిత్ర గతిని మార్చబోతోంది. ఏపీ అభివృద్ధిలో మీ భుజంతో కలిపి నా భుజం కలిపి పనిచేస్తాను. అందరికీ హృదయ పూర్వక శుభాకాంక్షలు అని ప్రధాని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదికపై కేంద్రమంత్రులు వర్మ, చంద్రశేఖర్, రామ్మోమన్ నాయుడు, గవర్నర్ నజీబ్, సిఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్,మంత్రులు లోకేశ్, కేశవ్,నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రలో లిఖించదగ్గ పునర్నిర్మాణ రోజు

గతంలో మోదీ గారిని ఎప్పుడు కలిసినా.. చాలా ఆహ్లాదకరంగా ఉండేవారు. కానీ, మొన్న అమరావతి కార్యక్రమానికి పిలవడానికి వెళ్లాను. ఆ మీటింగ్ చాలా గంభీరంగా సాగింది. దీనికి కారణం.. ' నా దేశ ప్రజలు ఉగ్రవాదుల దాడిలో చనిపోయారు' అన్న ఆవేదన మోదీ గారిలో చూశాను. ఈ సందర్భంగా మీ అందరి తరపునా ఆయనకు నేనో విజ్ఞప్తి చేస్తున్నాను. ఉగ్రవాదాన్ని అణిచివేయడానికి మోదీ, కేంద్రం తీసుకునే నిర్ణయాలకు మేము అండగా ఉంటాం' స్పష్టం చేశారు. నరేంద్ర మోదీ నాయకత్వం గురించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ' రైట్ -టైం .. రైట్ లీడర్ ఫర్ ది నేషన్.. దట్ ఈజ్.. నరేంద్ర మోదీజీ. చాలా దృఢమైన నాయకుడు.. బ్యాలెన్స్ కలిగిన నాయకుడు. ప్రపంచం నలుమూలలా ఉన్న ప్రజలందరూ మోదీ నాయకత్వాన్ని మెచ్చుకుంటున్నారు. నరేంద్ర మోదీ తన 11 ఏళ్ల పాలనలో ప్రపంచ ఎకానమీలో దేశాన్ని 10 స్థానం నుంచి 5వ స్థానానికి తీసుకువచ్చారు. ఈ సంవత్సరం జపాన్‌ను వెనక్కు నెట్టి 4వ స్థానంలోకి రాబోతోందని అన్నారు. ఈ సందర్భంగా వందేమాతరం అంటూ ప్రజలను ఉత్తేజితులను చేయగా మోడీ కూడా వంత కలిపారు. వందేమాతరం.. భారత్ మాతాకీ జై అంటూ చంద్రబాబు నినాదాలు చేశారు. ప్రజలతోనూ సీఎం నినాదాలు చేయించారు. ఏపీ కలల రాజధాని అమరావతి కేవలం ఒక నగరం మాత్రమే కాదు.. ఐదు కోట్ల మంది ప్రజల సెంటిమెంట్ అని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, ఆశలు, ఆకాంక్షలకు ఈ నగరమే ప్రతిరూపమన్నారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా 29 వేల మంది రైతులు ఏకంగా 34వేల ఎకరాల భూమిని రాజధానికి పూలింగ్ కింద ఇచ్చారంటే.. దేశానికే కాదు.. ప్రపంచానికే ఇదో చరిత్ర అన్నారు. అలాంటి అమరావతి నగర నిర్మాణం తలపెడితే.. గత ఐదేళ్లలో ఎలాంటి విధ్వంసం జరిగిందో చూశామన్నారు.సరైన సమయంలో.. సరైన నేత దేశాన్ని పాలిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మోదీ నాయకత్వాన్ని ఆమోదిస్తున్నారు. మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ పదో స్థానంలో ఉండేది. ప్రస్తుతం ఐదో స్థానానికి ఎదిగింది. త్వరలోనే మూడో స్థానానికి చేరుతుంది. 2047 నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతుంది. ఒకవైపు అభివృద్ధి మరోవైపు పేదరిక నిర్మూలనకు మోదీ కృషి చేస్తున్నారు. కులగణన చేయాలని ఇటీవల మోదీ నిర్ణయం తీసుకున్నారు. ఇదో గొప్ప నిర్ణయం అని ప్రశంసించారు. గత ఎన్నికల్లో ప్రజలంతా ఓట్లేసి గెలిపించారు. మోదీపై నమ్మకం, తెదేపా, జనసేన కలిసి పనిచేస్తే రాష్ట్రం మొత్తం తిరగబడింది. 93శాతం హిట్‌రేట్ వచ్చింది. మేం అధికారంలోకి వచ్చేసరికి ఆర్థిక వ్యవస్థ అగమ్య గోచరం. ఏం చేయాలో తెలియని పరిస్థితి. నేను నాలుగోసారి సీఎం.. కానీ, ఎటు- చూసినా అగాథమే. అలాంటి సమయంలో వెంటిలేటర్‌పై ఉన్న ఆర్థిక వ్యవస్థకు కేంద్రం, వ్యక్తిగతంగా ప్రధాని మోదీ ఆక్సిజన్ ఇచ్చారు. ఇప్పుడిప్పుడే రికవరీ అవుతున్నాం. వెంటిలేటర్ నుంచి బయటకు వచ్చాం.. ఇంకా కొన్నిరోజుల పాటు- సహకారం వస్తే ఒక బలమైన ఆర్థిక వ్యవస్థగా ఏపీని రూపకల్పన చేస్తామని హామీ ఇస్తున్నా అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఎపిని అగ్రగామిగా నిలుపుతామని అన్నారు. అమరావతి కోసం రైతులు వీరోచితంగా పోరాడారు. మీ పోరాటం వల్లే అమరావతి పునః ప్రారంభమైంది. ఇది మీ అందరి విజయం. బాధలు, అవమానాలు, లాఠీ దెబ్బలు తిన్నారు, జైళ్లకు వెళ్లారు. అయినా వెనకడుగు వేయలేదు.. హ్యాట్సాఫ్. ఇలాంటి ఉద్యమాన్ని నా చరిత్రలో ఎన్నడూ చూడలేదు. మళ్లీ చూస్తానని కూడా నమ్మకంలేదు. అలాంటి ఉద్యమం చేసిన ఉద్యమకారు లందరికీ సెల్యూట్ చేస్తున్నా. 2024 ఎన్నికల్లో ఏకపక్షంగా ఇచ్చిన ప్రజాతీర్పుతో అమరావతి మళ్లీ ఊపిరి పోసుకుంది. పది నెలల్లో సవాళ్లను అధిగమించి కేంద్రం సహకారం, మోదీ ఆశీస్సులతో అమరావతి నిర్మాణాన్ని పట్టాలెక్కించాం. ఐదు కోట్ల మంది ప్రజలు నా రాజధాని అమరావతి అని చెప్పుకొనేలా నిర్మిస్తాం అని సీఎం చంద్రబాబు అన్నారు.

# కేరళలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

## డీప్ వాటర్ సీపోర్టురు ప్రారంభించిన ప్రధాని

## మోడీకి స్వాగతం పలికిన కాంగ్రెస్ నేత శశిథరూర్

తిరువనంతపురం : కాంగ్రెస్ నేత శశిథరూర్ కేరళలో ప్రధాని మోడీ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనిపై మోడీ సెటైర్లు వేసారు. ఇది చూసి కొందరికి నిద్రపట్టదని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం కేరళలో పర్యటించారు. తిరువనంతపురం సమీపంలో రూ.8,900 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన విఝింజమ్ ఇంటర్నేషనల్ డీప్‌వాటర్ మల్టీపర్పస్ సీపోర్టును ప్రధాని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తిరువనంతపురం ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ హాజరయ్యారు. దీనిపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. ప్రతిపక్ష పార్టీపై వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. ఈ ఫొటో చూసి కొందరికి నిద్ర పట్టదని ఎద్దేవా చేశారు.ఈ రోజు శశిథరూర్ ఇక్కడ ఉన్నారు. ఈ ప్రోగ్రామ్ కొందమందికి నిద్ర లేని రాత్రిని మిగులుస్తుంది. ఈ సందేశం ఎక్కడికి వెళ్లాలో అక్కడికి వెళ్లిపోయిందని మోదీ చమత్కరించారు. కాగా.. గురువారం రాత్రి కేరళ చేరుకున్న ప్రధానిని థరూర్ వ్యక్తిగతంగా వెళ్లి స్వాగతించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. దిల్లీ ఎయిర్‌పోర్టులో విమానాల ఆలస్యం ఉన్నప్పటికీ.. సమయానికి తిరువనంతపురం చేరుకోగలిగా. నా నియోజకవర్గానికి వచ్చిన మోదీని సాదరంగా స్వాగతించానని థరూర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ అధినాయత్వంతో శశిథరూర్ బంధం బీటలు వారుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే.ఇక, భారత విదేశాంగ విధానాన్ని ప్రశంసిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ పరిణామాల వేళ ఆయన మోదీతో వేదిక పంచుకోవడం చర్చనీయాంశమైంది. తిరువనంతపురం నుంచి నాలుగు సార్లు ఎంపీగా గెలిచిన శశి థరూర్ గురించి ప్రధాని నేరుగా ప్రస్తావించడం అరుదైన విషయమని చెప్పవచ్చు. అంతేకాదు ఇప్పుడు శశి థరూర్ బీజేపీలో చేరారా అనే గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలు కేరళలోని కాంగ్రెస్ పార్టీలో థరూర్ స్థానం గురించి జరుగుతున్న చర్చల నేపథ్యంలో వచ్చాయి. ఇదే సమయంలో థరూర్ తన వ్యక్తిగత ఇమేజ్‌ను పార్టీ రాష్ట్ర నాయకత్వం నుంచి వేరుగా ప్రొజెక్ట్ చేస్తున్నారనే అభిప్రాయం బలంగా వినపడుతోంది.

# సోనియా రాహుల్‌లకు ఢిల్లీ కోర్టు నోటీసులు

ఈ నేపథ్యంలో విచారణకు హాజరయ్యేలా వారికి నోటీ-సులు ఇవ్వాలని ఈడీ ఇటీవల దిల్లీ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. గతవారం ఈ కేసును విచారించిన న్యాయస్థానం ఈడీ సమర్పించిన ఛార్జిషీట్‌లో సరైన పత్రాలు లేని కారణంగా రాహుల్, సోనియా గాంధీలకు నోటీసులు ఇచ్చేందుకు నిరాకరించింది. తాజాగా దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ చర్యలు తీసుకుంది. బిజెపి నేత సుబ్రమణ్య స్వామి జూన్ 2014లో దాఖలు చేసిన ప్రైవేట్ క్రిమినల్ ఫిర్యాదును మేజిస్ట్రేట్ కోర్టు స్వీకరించింది. ఆ తర్వాత ఈ కేసులో 2021లో ఈడీ దర్యాప్తు అధికారికంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఛార్జిషీట్‌పై న్యాయబద్ధమైన విచారణ జరిగే సమయంలో ఎప్పుడైనా అవతలి పక్షంవారు తమ వాదనలు వినిపించే హక్కు ఉంటుందని ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ విశాల్ గోగ్నే అన్నారు. దీనిపై తదుపరి విచారణను మే8కి వాయిదా వేస్తున్నట్లు- పేర్కొన్నారు. మనీలాండరింగ్ కేసులో నిందితులను విచారించకుండా ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోలేమని.. కాబట్టి విచారణకు హాజరయ్యేలా వారికి నోటీసులు ఇవ్వాలని ఈడీ ఇటీవల దిల్లీ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. గతవారం ఈ కేసును విచారించిన న్యాయస్థానం ఈడీ సమర్పించిన ఛార్జిషీట్‌లో సరైన పత్రాలు లేని కారణంగా రాహుల్, సోనియా గాంధీలకు నోటీసులు ఇచ్చేందుకు నిరాకరించింది. తాజాగా దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ చర్యలు తీసుకుంది. నేషనల్ హెరాల్డ్' మనీలాండరింగ్ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ (ఊ÷ఎస-।ప।ష ఉస।-షుసశష।).. అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ(÷ఎశ ఏశర), రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఇటీవల ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఆస్తులున్న ప్రాంతాల్లో (దిల్లీ, ముంబయి, లఖ్‌నవూ) భవనాలకు నోటీసులు అంటించినట్లు వెల్లడించింది.

# హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు

ఇకపై చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూములపై జరిగే అక్రమ ఆక్రమణలపై స్థానికులు లేదా అధికారులు ఫిర్యాదు చేస్తే, హైడ్రా పోలీస్ స్టేషన్లలోనే కేసులు నమోదు అవుతాయి. ఇప్పటివరకు సాధారణ పోలీస్ స్టేషన్లలో నమోదైన భూకబ్జా కేసులపై హైడ్రా దాడులు జరుపుతూ వస్తోంది. అయితే త్వరలోనే ఈ కేసులు సాధారణ స్టేషన్ల నుంచి హైడ్రా స్టేషన్లకు బదిలీ అయ్యే అవకాశం ఉంది.

# నత్తనడకన ఉప్పల్ ఫ్లై ఓవర్

ఓల్డ్ సిటీ-, గౌలిగూడ, అంబర్ పేట్, సనత్ నగర్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాలూ కీలకమని తెలిపారు. నిధుల కొరత లేకుండా చూసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రింకింగ్ వాటర్, డ్రైనేజీ వంటి సమస్యలు బస్తీల్లో రొటీన్ అయ్యాయన్నారు. నగరంలో అవసరమైన ప్రతిచోట స్ట్రీట్ లైట్స్, రీస్టోరేషన్ తక్షణ చర్యలు అవసరమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైటెక్ సిటీతో పాటు ఓల్డ్ సిటీ అభివృద్ధిపై సమాన దృష్టితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మెట్రో రైలు ప్రాజెక్టులో అఫ్జల్‌గంజ్ వరకే పరిమితమైన ఫస్ట్ ఫేజ్‌ను విస్తరించాలన్నారు. సెకండ్, థర్డ్, ఫోర్త్ ఫేజ్‌ల కోసం ప్రతిపాదనలు వెంటనే కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం పంపించాలన్నారు.

# కులగణన సర్వేలో రేవంత్ విజయం సాధించారు

అసెంబ్లీలో మీ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారని.. వాళ్ళు కూడా మద్దతు ఇచ్చినట్లు- తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యేల మీద కూడా అనుమానం ఉందా..? అని ప్రశ్నించారు. సర్వేలో పాల్గొనని వాళ్ళ కోసం మళ్ళీ సమయం పొడిగించారు కదా..? అన్నారు. కిషన్ రెడ్డి మాటలు నమ్మకండని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కిషన్ రెడ్డికి సెంట్రల్ పార్టీ మొట్టికాయలు వేసిందని.. అందుకే ఈ మధ్య తరచూ ప్రకటనలు ఇస్తున్నారన్నారు. కేంద్రం నిర్ణయం తీసుకునే సమయంలో ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పారు. రాజకీయ విమర్శలు మానుకోండన్నారు.

# టిటిడి వినూత్న ప్రయోగం

## ప్రజల నుంచి వాట్సాప్ ద్వారా ఫీడ్‌బ్యాక్

తిరుమల : భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు టిటిడి ఓ కొత్త ఫీడ్‌బ్యాక్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇకపై భక్తులు తమ అభిప్రాయాన్ని వాట్సాప్ ద్వారా సులభంగా తెలియజేయవచ్చు. తిరుమల, తిరుపతిలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌లను మొబైల్‌తో స్కాన్ చేస్తే వాట్సాప్‌లో టిటిడి అభిప్రాయ సేకరణ పేజీ ఓపెన్ అవుతుంది. ఇక్కడ భక్తులు తమ పేరు, విభాగం (అన్నప్రసాదం, శుభ్రత, కల్యాణకట్ట, లడ్డూ ప్రసాదం, లగేజీ, దర్శన అనుభవం, క్యూలైన్, గదులు మొదలైన వాటిని ఎంచుకోవాలి. అనంతరం, అభిప్రాయం తెలిపేందుకు టెక్స్ట్ లేదా వీడియో ఫార్మాట్ ను ఎంచుకోవచ్చు. సేవా ప్రమాణాన్ని ఉత్తమం, సగటు-మరింత మెరుగుదల అవసరం, లేదా బాగాలేదుగా రేట్ చేయాల్సి ఉంటుంది. భక్తులు తమ అభిప్రాయాన్ని గరిష్టంగా 600 అక్షరాల పరిమితిలో టైప్ చేయవచ్చు లేదా వీడియోగా అప్‌లోడ్ చేయవచ్చు. అభిప్రాయం సమర్పించిన వెంటనే, మీ అభిప్రాయం విజయవంతం గా నమోదు చేయబడింది. మీ విలువైన ఫీడ్‌బ్యాక్‌కు ధన్యవాదాలు అనే ధృవీకరణ సందేశం వస్తుంది. భక్తుల నుండి అందిన అభిప్రాయాలను టిటిడి యాజమాన్యం పరిగణనలోకి తీసుకుని సేవల ప్రమాణాన్ని పెంచేందుకు తగిన చర్యలు తీసుకుంటుంది.

# బెట్టింగ్ యాప్‌ల మోజులో పడి ఆత్మహత్య

విశాఖపట్టణం :బెట్టింగ్ యాప్‌లు ప్రాణాలు తీస్తూనే ఉన్నాయి.. బెట్టింగ్ యాప్‌లలో డబ్బులు పెట్టి సంపాదిస్తామన్న ఆశతో వాటి మోజులో పడి.. ఉన్న డబ్బునంతా పోగొట్టు-కోవడమే కాదు.. అప్పులు చేసి మరి బెట్టింగ్‌లు పెట్టి.. చివరకు లక్షల్లో అప్పులు కావడం.. తీర్చే స్తోమత కూడా లేకుపోవడంతో.. ప్రాణాలు తీసుకుంటున్నారు ఎంతో మంది యువకులు.. తాజాగా, బెట్టింగ్ యాప్ లకు విశాఖపట్నంలో మరో యువకుడు బలి అయ్యాడు..ద్వారక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే.. స్థానికంగా లాడ్జిలో పనిచేస్తున్న పవన్ అనే యువకుడు.. బెట్టింగ్ కి బానిసగా మారిపోయాడు.. బెట్టింగ్‌తో డబ్బులు సంపాదించవచ్చు అనే ఆశతో.. ఉన్న డబ్బులు పెట్టడమే కాదు.. తన దగ్గర సొమ్ము అంతా అయిపోయిన తర్వాత.. అనేక చోట్ల అప్పులు చేసి మరీ బెట్టింగ్ వేశాడు.. అప్పులు ఇచ్చినవారి నుంచి ఒత్తిళ్లు ఓవైపు.. బెట్టింగ్‌లో డబ్బులు అన్నీ పోవడం మరోవైపు.. తీవ్రమనస్తాపానికి గురైన పవన్.. చివరకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకి పాల్పడ్డాడు.. కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ చేపట్టారు.. అయితే, బెట్టింగ్ లో డబ్బులు పోగొట్టు-కుని అప్పులు పాలైన యువకుడు.. మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్టుగా పోలీసులు చెబుతున్నారు.. బెట్టింగ్ యాప్స్ జోలికి పోవద్దు.. మీ జీవితాన్ని, కుటుంబాన్ని నాశనం చేసుకోవద్దు.. ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు అని పోలీసులు సూచిస్తున్నారు.

# కాంగ్రెస్ రంగు తేలిపోయింది

### ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం
### బిజెపితో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు
### హరీష్ సమక్షంలో పలువురు బిజెపి కార్యకర్తల చేరిక




సంగారెడ్డి : పాలనా వైఫల్యం, కాంగ్రెస్ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారిందని మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు చెప్పారు. ప్రజలకు కాంగ్రెస్ మోసం తెలిసిపోయిందని, రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం అవుతుందని చెప్పారు. ఇకపోతే భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణను పూర్తిగా విస్మరించిందని హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాన అభివృద్ధిని ఆ పార్టీ పూర్తిగా విస్మరించిందన్నారు. ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా తెలంగాణకు ఒరిగిందేమీ లేదన్నారు. జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు భాజపా నేతలు, కార్యకర్తలు ఆయన సమక్షంలో భారాసలో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణకు భాజపా అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపైనా విమర్శలు గుప్పించారు. భారాస మొదలుపెట్టిన బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టుల నిర్మాణాలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పక్కనపెట్టి జహీరాబాద్ నియోజకవర్గానికి అన్యాయం చేసిందన్నారు. ప్రాజెక్టులు పూర్తయితే జిల్లా మొత్తం సాగునీటితో సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులు పూర్తి చేయడానికి భారాస పోరాటం చేస్తుంది. తాగు, సాగునీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారాస హయాంలో వచ్చిన నీళ్లు ఇప్పుడు ఎందుకు రావడం లేదు? పాలనా వైఫల్యం, కాంగ్రెస్ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. వాళ్ల మోసం ప్రజలకు తెలిసిపోయింది. మళ్లీ వచ్చేది భారాస ప్రభుత్వమే. తెలంగాణ అభివృద్ధి మాతోనే సాధ్యమవుతుందని హరీశ్ రావు తెలిపారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్ మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జహీరాబాద్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందన్నారు. సంగారెడ్డి జిల్లా అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. సంగమేశ్వర ప్రాజెక్టు పూర్తయితే జిల్లా మొత్తం సాగు నీటితో సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. బసవేశ్వర ప్రాజెక్టు పూర్తి చేయడానికి బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని వెల్లడించారు. తాగు, సాగు నీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బీఆర్ఎస్ ఉన్నపుడు వచ్చిన నీళ్ళు ఇప్పుడు ఎందుకు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో చేరినవారిలో మాజీ ఎంపీటీ-సీ దేశీటి పటేల్, రవి కుమార్, మాజీ సర్పంచ్ తుకారాం, భాస్కరం, సంగశీటి, సంజీవ్, అమృత్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదులకు ఊతమిస్తున్నది నిజమే

### రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ వ్యాఖ్యలకు భుట్టో సమర్థన

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషించింది నిజమేనంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాద గ్రూపులకు మద్దతు ఇవ్వడం, నిధులు సమకూర్చడంలో పాకిస్తాన్ ప్రమేయం ఉందంటూ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై స్పందించిన భుట్టో ఈమేరకు సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్ చరిత్ర తీవ్రవాదంతో ముడిపడి ఉందన్నది నిజమేనని అన్నారు. దాని ఫలితంగా దేశం నష్టపోయిందని.. ఆ తర్వాత పలు సంస్కరణలు చేపట్టామని భుట్టో అన్నారు. పాకిస్తాన్ కు ఉగ్రవాదంతో సంబంధాలు ఉన్నాయన్నది రహస్యంగా భావించట్లేదని.. ఉగ్రదానికి మద్దతు ఇవ్వడం ద్వారా పాకిస్తాన్ తీవ్రంగా నష్టపోయిందని అన్నారు భుట్టో. ఉగ్రవాదం తాలూకు ప్రభావాన్ని ఇప్పటికీ అనుభవిస్తున్నామని అన్నారు. చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకున్నామని.. ఫలితంగా సంస్కరణలు చేపట్టామని అన్నారు. ప్రస్తుతం పాకిస్తాన్ శాంతి కోరుకుంటు-ందని.. భారత్ రెచ్చగొడితే యుద్ధానికి సిద్ధమేనని అన్నారు భుట్టో. పాకిస్తాన్ శాంతియుత దేశమని, ఇస్లాం శాంతియుత మతమని అన్నారు భుట్టో... తాము యుద్ధం కోరుకోవడం లేదని.. కానీ ఎవరైనా సింధుపై దాడి చేస్తే, వారు యుద్ధానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. మేము యుద్ధ ధంకా మోగించము కానీ.. రెచ్చగొడితె మాత్రం పాకిస్తాన్ గర్జన భయంకరంగా ఉంటుందని అన్నారు.

## ఎసిబి అదుపులో గొర్రెల స్కామ్ నిదింతుడు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా మారిన గొర్రెల పంపిణీ స్కాం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో మొదటి నుంచి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటు-న్న ఏ1 నిందితుడు మొయినుద్దీన్‌ను శుక్రవారం ఉదయం ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. గతంలో మొయినుద్దీన్‌పై పోలీసులు ఎల్‌వోసీ జారీ చేశారు. మొయినుద్దీన్ కొడుకు ఈక్రముద్దీన్ ఇద్దరి పాస్ పోర్టును అధికారులు సస్పెండ్ చేశారు. ఈ క్రమంలోనే మొయినుద్దీన్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

## కటుఉంబ సభ్యులను కలసి ఓదార్పు

### పిల్లల చదువు బాధ్యతలు తీసుకుంటానని వెల్లడి

నెల్లూరు : నెల్లూరు జిల్లా కావలిలోని కుమ్మరి వీధికి చెందిన సోమిశెట్టి మధుసూదన్ రావు, ఇటీవల పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో దురదృష్టవశాత్తూ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ విషాద సంఘటన తర్వాత, మధుసూదన్ కుటుంబానికి అండగా నిలవడానికి సినీ హీరో మంచు విష్ణు ముందుకొచ్చారు. కావలిలోని మధుసూదన్ నివాసానికి చేరుకున్న విష్ణు, కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. మధుసూదన్ సతీమణి కామాక్షి, వారి ఇద్దరు పిల్లలను కలిసిన మంచు విష్ణు, దాడి జరిగిన తీరును గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. మధుసూదన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన విష్ణు, కుటుంబ సభ్యులకు తన పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంచు విష్ణు మాట్లాడుతూ, ఈ విషాదం తనను ఎంతగానో కలిచివేసిందని, మధుసూదన్ పిల్లల బాధ్యతను తాను స్వీకరిస్తానని ప్రకటించారు. మధుసూదన్ ఇక లేరనే నిజాన్ని ఒప్పుకోవడం కష్టంగా ఉన్నా, వారి పిల్లల భవిష్యత్తు కోసం నేను అండగా ఉంటాను. వారిని దత్తత తీసుకొని, వారి విద్యాభ్యాసం మరియు ఇతర అవసరాల కోసం నేను బాధ్యత వహిస్తానని విష్ణు హామీ ఇచ్చారు. మధుసూదన్ గత 12 సంవత్సరాలుగా బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆయన తల్లిదండ్రులు తిరుపాలు మరియు పద్మావతి, కావలిలో అరటి పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ దాడి సమాచారం వారి వృద్ధ తల్లిదండ్రులకు తెలియజేయడం కూడా కుటు-ంబ సభ్యులకు పెద్ద సవాలుగా మారింది.

## బిసిల గురించి కిషన్ రెడ్డికేం తెలుసు

### మాపై విమర్శలు చేస్తే సహించం
### విమర్శలు గుప్పించిన ఎమ్మెల్యే దానం
### తెలంగాణ ముమ్మాటికీ రోల్ మోడల్ అన్న బీర్ల అయిలయ్య

హైదరాబాద్ : కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి బీసీల గురించి ఏమి తెలుసని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో దానం నాగేందర్ మాట్లాడారు. బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు కిషన్‌రెడ్డికి లేదని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కులగణన ఎక్కడ చేయలేదని చెప్పారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణని రోల్ మోడల్‌గా తీసుకొమ్మన్నారని చెప్పారు. బీసీలం అల్ప సంతోషులమని అన్నారు. విమర్శలు ప్రతి విమర్శలు వల్ల సాధించేది ఏమీ లేదని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. ఇకపోతే దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో కులగణన చేసి రోల్ మోడల్‌గా నిలిచామని తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. సీఎల్పీ మీడియా పాయింట్‌లో బీర్ల ఐలయ్య మాట్లాడారు. సాహోసోపేత నిర్ణయాలతో దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. జనగణనలో కులగణన చేస్తామన్న మోదీ కేబినెట్‌కి ధన్యవాదాలు తెలిపారు. దేశం అంత బీసీలకి న్యాయం జరగాలని అన్నారు. ఇక్కడ ఉన్న బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారని అన్నారు. గతంలో రాహుల్ గాంధీ పాదయాత్రలో ప్రజల సమస్యలు చూసి కులగణన జరగాలని పోరాడారని చెప్పారు. తెలంగాణలో కులగణన రాహుల్ గాంధీ విజన్ అని చెప్పారు. కేంద్రమంత్రి అయ్యి ఉండి కిషన్‌రెడ్డి ఆలోచించి మాట్లాడాలని అన్నారు. ఏ లెక్కల ప్రకారం తమ కులగణన తప్పని కిషన్ రెడ్డి అంటున్నారని నిలదీశారు. రేపు కేంద్రం కులగణన చేసిన తర్వాత ఆ లెక్కలు చూసి చెప్పాలని సవాల్ విసిరారు. తెలంగాణని కేంద్రం రోల్ మోడల్‌గా తీసుకున్నందుకు రాష్ట్ర బీజేపీ నేతలకి దిమ్మ తిరిగిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి భారత్‌లో హీరోగా నిలబడటం కేంద్ర మంత్రులు జీర్ణించుకోలేక పోతున్నారని బీర్ల ఐలయ్య అన్నారు. కార్మిక దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత నిన్న నిజాలు మాట్లాడారని తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని గత పదేళ్లలో అభివృద్ధి చేయలేదని అన్న కవిత మాటలను స్వాగతిస్తున్నామని చెప్పారు. ఇప్పుడు కవితకి తలసరి ఆదాయం గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో కొండలు, గుట్టలు, వెంచర్లకు రైతు రైతుబంధు ఇచ్చారని గుర్తుచేశారు. కేసీఆర్ కులగణనలో పాల్గొనలేదని.. అప్పుడు కవితకి సామాజిక న్యాయం ఎందుకు గుర్తుకు రాలేదని నిలదీశారు. కేసీఆర్ హయాంలో ఆర్టీసీ కార్మికులు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేసినప్పుడు కవిత ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నపుడు కవితకి ఏం గుర్తుకురాదని విమర్శించారు. అధికారం పోయాక సామాజిక న్యాయమని కవిత అంటు-న్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ పేదల నాయకుడని అభివర్ణించారు. ఇచ్చిన హామీలని ఒక్కొక్కటి అమలు చేస్తూ బీఆర్ఎస్ కంటే రేవంత్ ప్రభుత్వంలో మంచి పాలన అందిస్తున్నామని చెప్పారు. వరి ఏస్తే ఉరే అని చెప్పి కేసీఆర్ ఫాంహౌస్‌లో వరి పండిచినప్పుడు కవితకి రైతులు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఎక్కడ ఎన్నికలు ఉంటే అక్కడ సంక్షేమ పథకాలు వచ్చేవని అన్నారు. గత పదేళ్లు ప్రశ్నించని కవిత తన పార్టీలో ప్రాధాన్యత తగ్గగానే ప్రశ్నించటం ప్రారంభించిందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు.

మధుసూధన్ కుటుంబానికి మంచు విష్ణు బాసట

## పాలమూరుకు ద్రోహం చేస్తున్న రేవంత్

### పాలమూరు-రంగారెడ్డిపై అడ్గు ముందు పడదే
### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శలు

హైదరాబాద్ : పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న వైఖరిని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై ఒక్క అడుగు ముందుకు వేయకపోవడం మాతృద్రోహం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఏడాదిన్నర కాలంగా తట్టె-డు మన్ను కూడా ఎత్తని ప్రభుత్వం ప్రాజెక్టుపై ప్రాధాన్యం లేకుండా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్యాకేజీ 3లో కేవలం 8 కిలోమీటర్ల కాలువ మాత్రమే మిగిలి ఉండగా, దానికి సంబంధించిన కాంట్రాక్ట్‌ను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీ-డీపీ నేతకు అప్పగించడం అనుమానాస్పదమని నిరంజన్ రెడ్డి ఆరోపించారు. ఆ కాంట్రాక్టును ప్రారంభించకపోవడానికి అక్కడి రాజకీయ నాయకుల ఒత్తిడి ఉందేమో అనిపిస్తోందని అన్నారు. ప్రాజెక్టు కోసం 27,000 ఎకరాల భూసేకరణ జరగగా, కేవలం 100 ఎకరాలు మాత్రమే మిగిలివున్నాయని తెలిపారు. ప్రజలకు పాలమూరు ప్రయోజనాలు త్వరగా అందకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ పనులను నిర్లక్ష్యం చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుత పరిస్థితిని సమీక్షించేందుకు నిపుణుల కమిటీ-ని ఏర్పాటు- చేయాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. డిండి పనులను హడావిడిగా ప్రారంభించడం అనవసరం. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టును నీటి పారుదల శాఖ మంత్రి ఎందుకు సమీక్షించడం లేదని నిలదీశారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు చేపట్టాల్సిన సమయంలో, జూరాల నుంచి కొడంగల్ ఎత్తిపోతల చేపట్టడం అనేది కక్షసాధింపు చర్య అని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం జూరాలలో నీరు వదులుకోవడం వల్ల ప్రాజెక్టు డిజైన్ ప్రమాదంలో పడుతుందని, అల్మట్టిలో నీళ్లు నిలుపుకునే అవకాశం తక్కువ అని అన్నారు. ప్రాజెక్టుపై ఇప్పటివరకు రూ.32 వేల కోట్ల వ్యయం జరిగిందని, 90 శాతం పనులు పూర్తయ్యాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా అంగీకరించారని గుర్తు చేశారు. జరిగిన పనులకు అభినందనలు చెప్పే ముందు, మిగిలిన వాటిని పూర్తిచేసి ప్రజలకు ఫలితాలు అందించాలంటూ డిమాండ్ చేశారు. సాగునీళ్లు ఇవ్వడం లేదు, పంటలు కొనడం లేదు. రైతులకు బోనస్ ఇవ్వలేదు. రుణమాఫీ సగం కూడా కాలేదని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రూ.లక్షా 70 వేల కోట్ల అప్పులు చేసిన ఈ ప్రభుత్వం ఇప్పుడు అప్పుల గురించి మాట్లాడడం ఆక్షేపణీయమైనదని నిరంజన్ రెడ్డి వ్యాఖ్యానించారు. మూసీ ప్రాజెక్టు, హైడ్రా వంటి మంచి అవకాశాలను ధ్వంసం చేశారు. అన్ని రంగాల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారు అని ఆయన విమర్శలు గుప్పించారు.




## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కాంగ్రెస్ నేతల భేటీ

### బిసి బిల్లు ఆమోదించినందుకు పొన్నం తదితరలు కృతజ్ఞతలు

హైదరాబాద్ : కాంగ్రెస్ బీసీ నేతలు శుక్రవారం ఉదయం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిసి కృతజ్ఞతలు తెలియచేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, కేకే, మధుయాష్కీ నేతృత్వంలో గవర్నర్‌ను కలిశారు. బీసీలకు రాజకీయ, విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ ఉభయ సభల్లో చేసిన బిల్లుకు గవర్నర్ ఆమోదం పొంది రాష్ట్రపతికి పంపినందుకు కాంగ్రెస్ నేతలు ధన్యవాదాలు తెలిపారు. ఇంకా గవర్నర్‌ను కలిసిన వారిలో ప్రభుత్వ విప్ బీర్ల ఆయిలయ్య, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, మేయర్ విజయలక్ష్మి తదితరలు ఉన్నారు. స్థానిక సంస్థలు, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మార్చి 18 శాసనసభలో ప్రవేశపెట్టిన రెండు బిల్లులు ఆమోదం పొందాయి. ఆ మరుసటి రోజు మంగళవారం వాటిని శాసన మండలిలో ప్రవేశపెట్టి ఆమోదంపొందిన అనంతరం వాటిని ప్రభుత్వం గవర్నర్‌కు పంపారు. ఆయన వాటిని పరిశీలించి.. రాష్ట్రపతికి పంపారు. తొలుత.. 'తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ (విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు) బిల్లు-2025', 'తెలంగాణ బీసీ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు బిల్లు-2025'ను మంత్రి పొన్నం ప్రభాకర్ సభలో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీలకు ఉన్న రిజర్వేషన్లు 29 శాతం. వాటిని 42 శాతానికి పెంచుతూ ఆమోదించిన బిల్లు చట్ట రూపం దాల్చాలంటే.. పార్లమెంటు-లో 2/3 మెజారిటీతో వాటికి ఆమోదం పొందాల్సి ఉంది. ఇందుకు కారణం.. సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన పలు తీర్పులే. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలందరికీ అమలు చేసే రిజర్వేషన్లన్నీ కలిపి 50 శాతాన్ని మించకూడదని గతంలో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. ఒకవేళ.. రిజర్వేషన్లను పెంచితే వాటిని రాజ్యాంగంలోని షెడ్యూల్ 9లో చేర్చాల్సి ఉంటు-ంది. అందుకే.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 31 (సి) ప్రకారం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపుతున్నట్టు- బిల్లుల్లో పేర్కొంది. న్యాయ సలహా తీసుకుని రాష్ట్రపతి వాటిపై ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటు-ంది. అవి చట్టపరంగా నిలబడాలంటే మాత్రం.. బిల్లులను పార్లమెంటు- ఉభయ సభలు ఆమోదించాలి. అప్పుడు మాత్రమే అవి రాజ్యాంగంలోని షెడ్యూల్-9లో చేరి, వాటికి రాజ్యాంగ రక్షణ లభిస్తుంది.

## బయ్యారంలో ఈదుగాలులకు నేలకొరిగిన చెట్లు

### మామిడి పంట నేలరాలడంతో రైతన్నల ఆవేదన

ఖమ్మం : ఈదురు గాలులతో కూడిన వర్షం బయ్యారంలో శుక్రవారం తెల్లవారుజామున బీభత్సాన్ని సృష్టించింది. రెండు గంటల పాటు ఈదురు గాలులు, రాళ్లతో కురిసిన వర్షం ప్రజలను అతలాకుతలం చేసింది. గాలుల కారణంగా మండలంలోని కొత్తపేట, బయ్యారం, బాలాజీ పేట, వెంకట్రాంపురం, జగ్గు తండా, బంజర తండా, నామలపాడు, నర్సాతండా ఉప్పలపాడు, మిర్యాల పెంట కంబాలపల్లి, కాచనపల్లివంటి గ్రామాల్లో పెద్ద పెద్ద చెట్లు నేలకొరిగాయి. పలు గ్రామాల్లో ఇండ్లపై కప్పులు , రేకులు గాలికి కొట్టుకుపోయాయి. ఇల్లందు- మహబూబాబాద్ జాతీయ రహదారి బయ్యారం శివారులో చెట్టు- రహదారిపై పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొత్తపేట, ఉప్పలపాడు, బయ్యారం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతోనే నష్టపోయామని రైతులు వాపోయారు. ధాన్యం భద్రపరచుకునేందుకు పట్టాలు కప్పినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన చెందారు. విపరీతమైన గాలి కారణంగా మామిడికాయలు రాలిపోవడంతో కౌలు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.రంగాపురం ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉన్న 150 ఏళ్ల మర్రి వృక్షం వేర్లతో సహా కూలిపోగా, బయ్యారంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న పురాతన మర్రిచెట్టు- కొమ్మలు విరిగిపడ్డాయి. పలుచోట్ల స్తంభాలు, వైర్లు విరిగిపోవడంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. విద్యుత్ పునరుద్ధరణకు ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతులు ప్రారంభించారు. వర్షం కారణంగా జరిగిన నష్టాన్ని తహసిల్దార్ విజయ, సీఐ రవికుమార్, ఎస్ఐ తిరుపతి పర్యవేక్షించారు.

## ఓయూ పరిధిలో పరీక్షల తేదీలు ఖరారు

హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్మెంట్ (ఎండీహెచ్ఎం) నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్ లాగ్, ఇంప్రూవ్మెంట్ పరీక్షలను ఈనెల 14వ తేదీ నుంచి, బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ లో బ్యాక్లాగ్ పరీక్షలను ఈనెల 15వ తేదీ నుంచి, దూరవిద్య ద్వారా అందించే ఎంసీఏ, పీజీడీసీఏ, అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సుల మెయిన్, బ్యాక్ లాగ్ పరీక్షలను ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీన పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

## మోసం కేసులో అఘోరి శ్రీనివాస్‌కు 14రోజుల రిమాండ్

షాద్‌నగర్ : సినీ నిర్మాత వద్ద డబ్బులు తీసుకొని మోసగించారనే ఫిర్యాదుపై అఘోరీ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసిన మోకిల పోలీసులు శుక్రవారం కేసు విచారణలో భాగంగా మరోమారు షాద్‌నగర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి రవి ముందు ప్రవేశపెట్టారు. చేవేళ్ల కోర్టులో ప్రవేశపెట్టవెల్సి ఉండగా అక్కడి కోర్టు ఇంచార్జ్ న్యాయమూర్తిగా ఉన్న రవి.. షాద్‌నగర్ న్యాయమూర్తిగా బాధ్యతలు తీసుకోవడంతో మోకిల పోలీసులు షాద్‌నగర్ కోర్టులోని న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టారు. పోలీసులు నమోదు చేసిన కేసు వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి రవి అఘోరీ శ్రీనివాస్‌కు మరో 14 రోజుల పాటు- రిమాండ్ విధించారు.

# సంపాదకీయం

## అమరావతి అద్భుత నగరం కావాలి!

అమరావతి సాకారం కాబోతున్నది. ప్రధాని మోడీ పునర్నిర్మాణ పనుల్లో పాల్గొనడం...ఏడాది కాలంగా చంద్రాబు అమరావతి పునర్నిర్మాణానికి అహర్నిశలు కష్టపడడంతో ఆంధ్రప్రదేశ్ కీలక మైలురాయిని చేరుకుంది. నిజానికి జగన్ తన ఐదేళ్ల పదవీకాలంలో అమరావతిని నిర్మించివుంటే చరిత్ర గుర్తించేది. ఇప్పుడు అమరావతి చరిత్రలో జగన్ చోటులేకుండా చేసుకున్నారు. అంతేగాకుండా మూడు రాజధానులు అంటూ ఐదేళ్లూ కాలం వెళ్లదీసారు. చంద్రబాబు విజన్‌కు జగన్ ఆలోచనకు ఎంతో వ్యత్యాసం ఉంది. చంద్రబాబును కాదనుకుని ఒక్క ఛాన్స్ అని అభ్యర్థించిన జగన్‌కు పట్టం కట్టడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ఓ పదేళ్లు వెనక్కి పోవడమే గాకుండా అప్పులకుప్పగా మారింది. అప్పులు చేసిన జగన్ ఆంధ్రప్రదేశ్‌ను అంధకారంలో ముంచారు. యువకుడైన జగన్‌కు నిజంగానే మంచి ఆలోచనలు ఉండివుంటే ఎపి భవిష్యత్ మరోలా ఉండేది. విజన్ ఉండాలి. పట్టుదల ఉండాలి. ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా పనులు చేయగలగాలి. బటన్ నొక్కి అప్పులు చేసిన జగన్ విజన్ లేని నేతగానే నిలిచిపోతాడు. ప్రజలు వ్యక్తిగత ప్రయోజనాలతో పాటు సమిష్టి ప్రయోజనాలు కూడా ఆశిస్తారు. విద్య,వైద్యం, నీరు,రోడ్లు వంటి సౌకర్యాలపై ప్రభుత్వాలు ఎప్పుడూ ప్రయత్నాలు సాగుతుండాలి. అందుకే ఇవేవీ లేకపోవడం వల్లనే జగన్ ఐదేళ్ల పాలనలో అనేక అనర్థాలు జరిగాయి. ప్రజలపై అప్పుల భారం పడింది. అందుకే మళ్లీ అమరావతిని రాజధానిగా పునర్నిర్మిస్తామని తెలుగుదేశం కూటమి హామీ ఇచ్చింది. అధికారంలోకి రావడంతో అది సాకారం కాబోతున్నది. గత పదేళ్లుగా రాజధాని అన్నది లేకుండా పోయింది. అమరావతిని దెబ్బతీసిన జగన్ చరిత్రలో నిలిచిపోతారు. రాజధాని లేకుండా చేశారు. జగన్ ఐదేళ్ల పాలనా కాలంలో ఎపి రాజధాని ఏది అని అడిగితే చెప్పే పరిస్థితి లేకుండా పోయింది. మూడు రాజధానులా అంటే అదీ లేదు. తలలేని మొండెంలా ఆంధ్రప్రదేశ్ గత ఐదేళ్లుగా కొనసాగింది. జగన్ అధికారంలోకి వస్తే ఇలాంటి దుర్గతి వస్తుందని ఎవరుకూడా ఊహించి ఉండలేదు. అభివృద్ధి వికేంద్రీకణ వేరు..రాజధాని వేరు అన్న స్పృహలో లేకుండా జగన్ పాలన సాగించారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన పలువురు రైతులు, మహిళలు కోర్టులు చుట్టూ తిరగడంతోనే సరిపోయింది. కేసులతో వారిని కోర్టులకే పరిమితం చేస్తే ఇక ఉద్యమంలో కనిపించరన్న ఎత్తుగడతో జగన్ ఎపిని అందకారంలోకి నెట్టారు.రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా అన్న చందంగా కేసులకు కొదవ లేకుండా పోయింది. జగన్ తన ఐదేళ్ల పాలనాకాలంలో కనీసం రైతులతో మాట్లాడ కుండా, వారి అభిప్రాయాలు తెలుసుకోకుండా తీసుకున్న నిర్ణయం కారణంగా ఎపి తీవ్రంగా నష్టపోయింది. మొత్తంగా అస్తవ్యస్థ పాలన సాగించారు. హైదరాబాద్ హైటెక్ సిటీ నిర్మాణ సమయంలో చంద్రబాబు నిర్ణయంతో ఇప్పుడు హైదరాబాద్ ఎలా అభివృద్దిలో పెనవేసుకు పోయిందో కళ్లకు కనిపిస్తోంది. రేపటి అమరావతిలోనూ ఇదే కనిపిస్తుంది. విభజనకు గురైన 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనివార్యంగా ఇప్పుడు కొత్త రాజధానికి శ్రీకారం చుడుతోంది. ఓ ఐదేళ్ల తరవాత అమరావతితో రూపురేఖలు మారుతాయి. భారత్‌లో ఓ అద్భుత నగరం ఆవిష్కృతం అవుతుందనడంలో సందేహం అవసరం లేదు. ఉమ్మడి ఎపిలో హైదరాబాద్ అనేది తెలుగు వారికి ఒక విద్యా, వ్యాపార, నివాస, ఉపాధి వనరుగా మారిపోయింది. విశాఖపట్నం, విజయవాడ ఆ స్థాయి నగరాలు కావు కనుకనే చంద్రబాబు కొత్త రాజధానికి శ్రీకారం చుడుతున్నారు. చంద్రబాబును తిట్టి పోసుకుంటున్న వారే రేపు స్తుతిస్తారు. విశాలమైన సముద్ర తీరంతో పాటు, పలు విమానాశ్రయాలు, ఓడరేవులు ఉన్న ఎపి ఇక అమరావతితో మరింతగా అలరారడం ఖాయం. హైదరాబాద్ లాంటి విస్తృత అవకాశాలు గల ఒక నగరం ఆంధ్రకు లేని లోటును అమరావతి తీర్చనుందనడంలో సందేహం లేదు. అంతేకాదు అంతర్జాతీయనగరంగా హైదరాబాద్÷–కు పోటీగా విస్తరిస్తుందనడంలోనూ సందేహం అవసరం లేదు. నిజానికి జగన్ అధికారంలోకి రాకుండా ఉండివుంటే ఈపాటికి అమరావతి సాక్షాత్కరించేది. అమరావతి అంటే... లక్షలాదిగా నివసించే ప్రజలు, ప్రపంచస్థాయి పెద్ద పెద్ద వ్యాపార, వాణిజ్య భవనాలు, పబ్లిక్ పార్క్‌లు, వినోద కేంద్రాలు, ఐకానిక్ నిర్మాణాలు, సువిశాలమైన రహదారులు, నైట్ లైఫ్ వినోద కార్యకలాపాలు అందించే సఫారీ టూర్ల వెసులుబాట్లు, టూరిస్ట్ ఆకర్షణలు. ఇవేగాక అంతర్గత రవాణా సదుపాయాలువంటివన్నీ అందుబాటులోకి వస్తాయి. అనేక సదుపాయాల సముదాయంగా అమరావతి పేరిట ఒక మహానగరం నిర్మించాలన్న చంద్రబాబు నాయుడు సంకల్పం అభినందనీయం. ప్రపంచంలో అనేక నగరాలను తిరిగి, అధ్యయనం చేసిన అనుభం చంద్రబాబుది. ఆయన తన రాజకీయ జీవితం కన్నా తన పేరు చిరస్థాయిగా నిలవాలని ఆకాంక్షించే వ్యక్తి. చంద్రబాబు దార్శనికుడు కావడం వల్ల ప్రపంచ స్థాయి నగరంగా 'అమరావతి'కి బలమైన పునాదులు వేస్తున్నారు. తన దార్శనికతతోనే అమరావతిని ఓ అద్భుత వాణిజ్య నగరంగా తీర్చిదిద్దే పనిలో ప్రధానిని ఆహ్వానించి పునాది వేయించడం,పునరావిష్కృతం చేయడం చరిత్రలో నిలిచే మహోజ్వల ఘట్టం. ఇది పూర్తిగా సాకారం కావడానికి కనీసం ఓ దశాబ్ద కాలం పట్టవచ్చు. అప్పటి వరకు చంద్రబాబును ప్రలజు ఆదరిస్తే ఎపిని అగ్రభాగాన నిలబెట్టే ప్రయత్నం చేస్తారు. చంద్రబాబు నాయుడు దార్శనికతకు సజీవ సాక్ష్యంగా చరిత్రలో అమరావతి నగరం నిలిచిపోతుంది. కృష్ణా పరివాహక ప్రాంతంకావడం నీటికొరత లేకుండా అమరావతి అలరారుతందనడంలో సందేహం లేదు. అమరావతి భారతదేశంలో అద్భుత నగరంగా నిలిచిపోతే తెలుగువారందరికీ గర్వకారణమే.

## తారెత్తిస్తున్న ఎండలు
# బయటకు రావడానికే జంకు



నిజామాబాద్,మే2(ఆర్ఎన్ఎ): జిల్లాలో రాష్ట్రంలోనే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దాదాపు 42డిగ్రీలకుఎ చేరువలో నమోదు అవుతున్నాయి. దీంతో ప్రజలు బయటకురావడానికే జంకుతున్నారు. వేడి, ఉక్కపోత ఉండటంతో బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఎండవేడిమితో అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పని నిమిత్తం ఎండలో బయట వెళ్లినప్పుడు తప్పనిసరిగా రక్షణ కవచాలు ధరించాలని, కళ్లకు రక్షణగా కళ్లద్దాలు, నెత్తిన టోపీ, వేడిగాల్పుల నుంచి చెవులు, ముక్కుకు రక్షణగా రుమాలు కట్టుకోవాలని చెబుతున్నారు. వడదెబ్బ తగలకుండా ఎక్కువ నీరును విడతల వారీగా తాగాలని, పుచ్చకాయలు, కొబ్బరినీళ్లు, పండ్లరసాలు ఎక్కువగా తీసుకోవాలని పేర్కొంటున్నారు. ఓఆర్ఎస్ పొట్లాలు దగ్గర ఉంచుకుంటే ఉత్తమం. వృద్ధులు, గర్భిణులు, బాలలు ఎండలో వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దీంతో చాలామంది తమ పనులు వాయిదా వేసుకుంటున్నారు. ఎండ లేని సమయంలో అంటే ఉదయం 9 లోపు, సాయంత్రం 6 తర్వాత తమ పనులు చేసుకోవడానికి ప్రణాళిక రూపొందించుకుంటున్నారు. ఎప్రిల్‌లోనే మండుతున్న ఎండలు మే నాటికి ఎలా ఉంటాయోనన్న భయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. వచ్చే వారంలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మేరకు నమోదయ్యే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లినా ఎండ వేడి నుంచి తట్టుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. మే నెలలో వడగాల్పులు ఎక్కువగా వీచే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. తీవ్రమైన ఎండలతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారి ఎడారిని తలపింపజేస్తున్నాయి. కోల్‌బెల్ట్ ఏరియాలు ఎండలు మండుతున్నాయి. రామగుండం, పెద్దపల్లి, గోదావరిఖని తదితర ప్రాంతాల్లో ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం ఎనిమిది దాటితేనే ఎండలు భగ్గుమంటున్నాయి.. నాలుగు రోజులుగా భానుడు తీవ్రరూపం దాల్చుతున్నాడు.. పది దాటితే బయటికి వెళ్లాలంటేనే జనాలు జంకుతున్నారు. దీంతో ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మధ్యాహ్నం వేళ ప్రధాన రోడ్లన్నీ నిర్మాణుష్యంగా మారుతున్నాయి. మున్ముందు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. గత మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను దాటుతున్నాయి. రోజంతా భానుడు ప్రతాపం చూపిస్తుండడంతో సాయంత్రం 6 గంటల వరకు వేడి గాలులు వీస్తున్నాయి. సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ముఖ్యంగా వాతావరణం ఒక్కసారిగా వేడెక్కుతుండడంతో నగరంలోని ప్రధాన రహదారులన్నీ మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారుతున్నాయి. అనునిత్యం రద్దీగా ఉండే టవర్‌సర్కిల్‌తో పాటు, ఇతర ప్రాంతాలు వెలవెలబోతున్నాయి.

## సామాజిక సంస్కర్త భగవద్ రామానుజులు

### రామానుజుల జయంతి సందర్భంగా

తిరుమల : భగవద్ రామానుజాచార్యులు వెయ్యేళ్ల క్రితమే సమానత్వాన్ని బోధించి గొప్ప సంఘసంస్కర్తగా నిలిచారు. అప్పటికాలమాన పరిస్థితులకు అనుగుణంగా వైష్ణవ ఆలయాల్లో పూజా విధా నాలను ఏకీకృతం చేసిన ఘనత రామానుజులవారికే దక్కింది. భారతీయ సనాతనధర్మంలో అద్వైతాన్ని శ్రీ ఆదిశంకరా చార్యులు, ద్వైతాన్ని శ్రీ మధ్వాచార్యులు, విశిష్టాద్వైతాన్ని శ్రీ రామానుజా చార్యులు బోధించి ఆధ్యాత్మిక బీజాలను నాటారు. భగవద్ రామానుజాచార్యులు సాక్షాత్తు ఆదిశేషుని అంశంగా భావిస్తారు. రామానుజాచార్యులు శాస్త్రాన్ని, సంప్రదాయాన్ని పటిష్టంగా అమలుచేసి ఆలయాలను అభివృద్ధి చేశారు. తిరుమల శ్రీవారి ఆలయమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రత్యేకించి దళితులకు చాపకూడు అమలుచేసి వారిని అంటరానితనం నుంచి దూరం చేశారు. వారికి కూడా నారాయణ మంత్రోపదేశం చేశారు. శ్రీభాష్యకారుడై, విశిష్టాద్వైత సిద్దాంతాన్ని స్థిరముగ నిలిపిన ధీశాలి రామానుజులవారు. కలియుగంలో వేంకటేశుడే గతి అని చాటిన గురువు ఆయన. కొండను ఆదిశేషుడని భావించి మోకాలుతోటే కొండనెక్కిన భక్తి పరుడు. కేవలం మనకే కాక శంఖ చక్రా క్రియాది కార్యాలను స్వామికి చేసి ఆచార్యుడంటే ఇతనే అని అనిపించుకున్న వారు ఆయన. స్వామికి ఊర్ధ్వపుండ్రమును ధరింపజేసి లోకానికి ఆయన శోభను ప్రకాశింప జేసాడు. వేంకటేశ్వరుడిని లోకానికి ప్రకటింపజేసి అక్కడ ఆలయ నిర్వహణను భగవత్ రామానుజులవారు చక్కపరిచారు. కొండపై పూలు స్వామికి తప్ప ఇతరులకు అర్హతలేదు అని నియమం ఏర్పాటు చేసారు. నీలకంతుడిచే పూజింపబడ్డ నారసింహ మూర్తికి ఆరాధనాలోపం జరగకూడదని శ్రీనివాసుని ధివ్య విమానమునకు అభిముఖంగా నారసింహ మూర్తిని ప్రతిష్ఠించారు. దేవాలయం చుట్టు తిన్నని మాడ వీధులను నిర్మించి ఉత్సవములను కొండపై జరిగేట్టు చేసారు. అక్కడ నిత్యారాధనకు అర్చకులని ఏర్పాటు చేసారు. కొండపై మృతకళేబరములకు దహన సంస్కారం జరపరాదు అని నియమం ఏర్పరిచారు. మాడ వీధుల యందు పాదరక్షలు ధరింపరాదని నియమం ఏర్పరిచారు. రామానుజులవారు తిరుమల నంబి వద్ద రోజు రామాయణం నేర్చుచుండగా కొండ క్రింద లక్ష్మణహనుమత్సుగ్రీవాంగద సహితముగా శీరామచంద్ర మూర్తి విగ్రహముగా స్వామి దర్శనమిచ్చాడు. ఆమూర్తికి సీతను జతచేసి ఆరాధన, కళ్యాణము నిత్యంగా జరిగేట్టు నియమం ఏర్పరిచారు. వరాహమూర్తికి ఉత్సవ మూర్తిని ఏర్పరిచి విశేషోత్సవములు జరిగేట్టు నియమం ఏర్పరిచారు. శ్రీనివాసుడికి ఇష్టమైన దివ్య ప్రబంధ గానములని తోమాల సేవగా ఏర్పరిచారు. ఆలయానికి ఎదుట జీయరుకు నివాసం ఏర్పరిచి తానారాధించిన శీరామచంద్ర మూర్తి విగ్రహముగా స్వామి దర్శనమిచ్చాడు. ఆమూర్తికి సీతను జతచేసి ఆరాధన, కళ్యాణము నిత్యంగా జరిగేట్టు నియమం ఏర్పరిచారు. వరాహ మూర్తికి ఉత్సవ మూర్తిని ఏర్పరిచి విశేషోత్సవములు జరిగెట్టు నియమం ఏర్పరిచారు. శ్రీనివాసుడికి ఇష్టమైన దివ్యప్రబంధ గానములని తోమాల సేవగా ఏర్పరిచారు. తిరుమలలో ఆచార విశేష వ్యవస్థల ధర్మ పరిరక్షణకు తగు వ్యక్తులను ధర్మరక్షకులుగా నియమించారు.

## కాశ్మీర్‌లో విస్తృత గాలింపు చర్యలు

### ముస్తాక్ ఇంట్లో విరివిగా సోదాలు

శ్రీనగర్ : పహల్గాం దాడి తర్వాత కశ్మీర్‌లో భద్రతా దళాలు గాలింపు చర్యలను వేగవంతం చేశాయి. ఇప్పటికే తప్పించుకున్న నలుగురు ముష్కరుల కోసం గాలింపు చేపట్టిన బలగాలు, వారి మూలాలను ఆరా తీస్తున్నాయి. తాజాగా ఐసీ 814 విమానాన్ని హైజాక్ చేసిన అల్ ఉమర్ ముజాహిద్దీన్ చీఫ్ ముష్తాక్ అహ్మద్ జర్గర్‌ను ఉగ్రవాదులు విడిపించిన నేపథ్యంలో అతని ఇంట్లోను భద్రతా దళాలు సోదాలు చేశాయి. ప్రస్తుతం అతడు పాకిస్థాన్‌లో ఉంటున్నాడు. కీలక ఆధారాల కోసం సోదాలు చేపట్టారు. గత వారం 60 ఇళ్లపై ఎన్ఐఏ బృందాలు దాడులు నిర్వహించాయి. ఈసందర్భంగా మొత్తం ఇప్పటివరకు 1900 మందిని ప్రశ్నించాయి. పహల్గాం దాడికి సంబంధించి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసేందుకు ఎన్ఐఏ అత్యాధునిక విధానాలు వినియోగిస్తోంది. శాటిలైట్ ఇమేజ్‌లు, డ్రోన్ దృశ్యాలు, బాధితులు, గుర్రపు స్వారీ ఆపరేటర్ల నుంచి సమాచారం సేకరిస్తోంది. దీంతోపాటు– దాడి జరిగిన ప్రదేశాన్ని హైరిజల్యూషన్ 3డీ మోడల్‌ను కూడా తయారుచేస్తున్నట్లు– తెలుస్తోంది. ఈ మోడల్ దర్యాప్తును కోర్టులో విచారణకు ఉపయోగించనుంది. ఘటనా స్థలం నుంచి ఇప్పటివరకు 40 ఖాళీ తూటాలను దర్యాప్తు బృందాలు స్వాధీనం చేసుకొన్నాయి. అంతేకాదు.. మొబైల్ టవర్స్ నుంచి పాత డేటాను మొత్తం దర్యాప్తు బృందాలు వెలికితీస్తున్నాయి. బైసరన్ లోయలో పర్యాటకులను హత్య చేయాలన్న పథకాన్ని ప్రాథమికంగా లష్కరే తోయిబా రూపొందించి ఒదని జాతీయ దర్యాప్తు సంస్థ ప్రాథమికంగా నిర్ధరణకు వచ్చింది. దీనికి ఐఎస్ఐ ఆపరేటివ్‌లు సాయం చేయగా.. దీనికి పాక్‌లోని లష్కరే ప్రధాన కార్యాలయంలో తుదిరూపు వచ్చింది. ఈ మొత్తం దాడికి లష్కరే ఉగ్రవాది హాషీమ్ మూసా, అలీభాయ్‌లు కేంద్రంగా నిలిచినట్లు అంచనా వేసింది. వీరిద్దరూ పాక్ జాతీయులే. ఈ ఉగ్రవాదులకు 2024లో జరిగిన గగనగర్ ఉగ్రదాడితో సంబంధం ఉందని దర్యాప్తు బృందాలు బలంగా విశ్వసిస్తున్నాయి. అయితే వీరు చీనాబ్ లోయ వైపు నుంచి వచ్చి ఉండనందున, అటువైపు వెళ్లి ఉండకపోవచ్చని భావిస్తున్నాయి. ఇకపోతే ?వరుసగా 8వ రోజు కూడా పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. అంతర్జాతీయ సరిహద్దుల వెంట కాల్పులు జరిపింది. వీటిని భారత్ బలంగా తిప్పికొట్టింది. దీంతోపాటు సరిహద్దుల వెంట ఉన్న బంకర్లను శుభ్రం చేసి.. స్థానికులు ఆశ్రయం పొందేందుకు వీలుగా సిద్ధం చేస్తున్నారు.

## పాక్ గగనతలం మూసివేత


### ఎయిరిండియాకు భారీ నష్టాలు

న్యూఢిల్లీ : పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత పాకిస్థాన్–భారత్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్న క్రమంలో పాక్ గగనతలం మూసివేతతతో ఎయిరిండియాకు భారీగా నష్టాలు వస్తున్నాయి. పాకిస్థాన్‌పై భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంది. సింధు జలాలను నిలిపివేసింది. అనంతరం పాకిస్థాన్ వీసాలను రద్దు చేసింది. అంతేకాకుండా అటారీ సరిహద్దు మూసివేసింది. దీనికి బుదులగా పాకిస్థాన్ తన గగనతలాన్ని మూసివేసింది. తమ వైపు విమానాలు రాకుండా అడ్డుకుంది. అయితే దీని కారణంగా ఎయిరిండియా భారీ నష్టాలను ఎదుర్కొంది. పాక్ గగనతలం ఏడాది పాటు మూసివేతతో ఎయిరిండియా సంస్థకు రూ.5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లనుందని జాతీయవార్తా సంస్థ వెల్లడించింది. ఎయిరిండియా సహా ఇండిగో, స్పైస్‌జెట్ వంటి విమానయాన సంస్థలు తాజాగా సూచనలు, సలహాలను పౌర వైమానిక శాఖకు తెలియజేశాయి. ఈ నేపథ్యంలో వీటిని పరిశీలించి తగిన పరిష్కారం వెతికే పనిలో ఆ శాఖ నిమగ్నమైంది. ఏడాది పాటు పాక్ గగనతలం మూసివేస్తే సుమారు 600 మిలియన్ డాలర్లు అంటే రూ.5 వేల కోట్ల నష్టం వాటిల్లుతుందని ఎయిరిండియా పేర్కొంది. ఈ నేపథ్యంలో వైమానిక సంస్థ పలు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిపెట్టాయి. ప్రస్తుతం దేశంలో ఎయిరిండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, స్పైస్‌జెట్, ఆకాశా ఎయిర్ అంతర్జాతీయ సర్వీసులను నడుపుతున్నాయి. వైమానిక సంస్థలకు వారానికి రూ.77 కోట్ల అదనపు భారం పడొచ్చని అంచనా వేస్తున్నారు. ఇక భారత్ కూడా గత బుధవారం నుంచి పాకిస్థాన్ విమానాలకు మే 23వ తేదీ వరకు గగనతలం మూసివేసింది. ప్రస్తుతం రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి.

## అష్టాదశ యోగంతో.. ఈ మూడు రాశుల వారికి అదృష్టం..!

జ్ఞానదాత అయిన బుధుడు, న్యాయ కారకుడైన శశి రెండూ 18 డిగ్రీల కోణంలో ఉండనున్నాయి. మే ఒకటి నుంచి ఈ గ్రహాల ఈ స్థానం అష్టాదశ యోగాన్ని ఏర్పరచనున్నది. ఇది అన్ని రాశీచక్రాలను ప్రభావితంచేయనున్నది. జ్యోతిష్యశాస్త్రంలో.. బుధుడు వాక్కు, కమ్యూని కేషన్, తెలివితేటలు, వ్యాపారానికి.. శని కర్మ ఆధారంగా శుభ, అశుభ ఫలితాలను ప్రసాదిస్తుంటారు. ఈ పరిస్థితుల్లో ఏదైనా ఇతర గ్రహాలతో సంచారానికి గురైనప్పుడు.. గ్రహాల సంయోగంతో పలు రాశులకు ప్రయోజనాలు కలుగనున్నాయి. వృషభం.. వృషభ రాశి వారికి అష్టాదశ యోగం కొత్త ఉద్యోగ అవకాశాలను రానున్నాయి. ఈ యోగ ప్రభావం కారణంగా కొత్త ఇల్లు కొనాలనే మీ కల నేరవేరనున్నది. వ్యాపారవేత్తలకు ఆకస్మిక లాభం జరిగే ఛాన్స్ ఉంది. కొత్త వ్యాపార ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. ఈ సమయంలో మీ జీవిత భాగస్వామితో సంబంధం సాధారణంగానే ఉంటుంది. వ్యాపారంలో డబ్బు కొరతను ఎదుర్కొనే వారు లాభపడే అవకాశం ఉంది. పెట్టుబడులు పెట్టే వారికి లాభాలుంటాయి. మిథున రాశి... అష్టాదశ యోగం మిథున రాశి వారికి ప్రత్యేకంగా ఉంటుంది. ఎందుకంటే ఆరోగ్య సంబంధిత సమస్యలు తొలగిపోతాయి. కొత్త వాహనం కొనాలనే మీ కల నెరవేరుతుంది. మీ పనిలో సమస్యలు శని ప్రభావంతో పరిష్కరమవుతాయి. కొత్త ప్రయత్నాలలో కొన్ని ఫలిస్తాయి. శత్రువుల బాధలు తగ్గిపోతాయి. చాలా కాలం తర్వాత పాత స్నేహితులను కలుస్తారు. వివాహిత జీవితంలో శుభవార్తలు వింటారు.

మకరం.. అష్టాదశ యోగంతో ఉద్యోగంలో మార్పులు కోరుకునే వారు.. కోరుకున్న స్థానం పొందే అవకాశం ఉంది. ఆర్థికంగా లాభాలు పొందే అవకాశం ఉంది. ఏదైనా కారణంతో ప్రణాళికలు నిలిచిపోతే.. బుధ గ్రహం ప్రభావంతో ఇప్పుడు పూర్తయ్యే అవకాశం ఉంది. వ్యాపారంలో కావాల్సిన లాభంతో ఆర్థిక పరిస్థితిని మెరుగవుతుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఈ సమయంలో ఏ నిర్ణయం తీసుకున్నా ప్రభావం ఉంటుంది.



ఆధ్యాత్మికం

## మీ బుజ్జాయి కళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే.. రోజుకొక్కసారి ఇలా చేయండి



మన శరీరంలోని ముఖ్యమైన అవయవాలలో కన్ను ఒకటి. చూపు లేని లోకం అంధకారం అని పెద్దలు అందుకే అంటారు. కాబట్టి కంటి సంరక్షణ చాలా ముఖ్యం. ముఖ్యంగా నేటి డిజిటల్ యుగంలో పిల్లలు చిన్నప్పటి నుంచే ఫోన్ స్ట్రీన్‌కు అలవాటు పడుతున్నారు. దీంతో పిల్లల కళ్ళు బాల్యం దశలోనే ప్రమాదంలో పడుతున్నాయి. కాబట్టి చిన్న వయసు నుంచే పిల్లల కళ్లకు తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే వయసు పెరిగే కొద్దీ సమస్యలు మరింత తీవ్రతరం అవుతాయి. మీ కంటిపాప చూపును జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. ఇందుకోసం ఆయుర్వేదాన్ని ఆశ్రయించవచ్చు. మంచి కంటి చూపుకు, కంటి సంరక్షణకు ఆయుర్వేద నివారణలు ఎంతో ఉపయోగపడతాయి. తర్పన్ అనేది ఒక రకమైన ఆయుర్వేద చికిత్స. ఇది కళ్ళను తేమగా ఉంచడానికి, దృష్టిని మెరుగుపరచడానికి సహాయపడుతుంది.ఇది కంటిదురదను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. దీనిని ఎలా వినియోగించాలంటే.. నెయ్యిని కళ్లపై నెమ్మదిగా రాసి, ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కళ్లను కడగాలి. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల కళ్లకు చాలా మంచిది. కళ్లలోకి చేరే రకరకాల దుమ్ము, కాలుష్య కారకాలను తొలగించి కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. అయితే అధిక వేడి, చల్లటి నెయ్యిన కళ్లకు ఎప్పుడూ పూయకూడదు. అలాగే కళ్లపై ప్రత్యక్ష సూర్యకాంతి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల కళ్లలోకి యువి కిరణాలు నేరుగా పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సూర్యుడి నుండి కళ్ళను రక్షించడం కూడా అవసరమే. నేటి యుగంలో పిల్లల ముందు టీవీ, ల్యాప్‌టాప్, మొబైల్ స్క్రీన్‌లు కనిపిస్తున్నాయి. వాటిని నివారించలేం. అయితే పిల్లలను స్క్రీన్‌కు దూరం ఉంచడం మీ చేతుల్లో పనే. ఇది మీ పాపాయి కళ్లను కొంత వరకు కాపాడుతుంది. ఆయుర్వేదం ప్రకారం సోంపు గింజలు తినడం కళ్ళకు ఎంతో మేలు జరుగుతుంది. సోంపు గింజలు నోటి దుర్వాసనను తొలగించడంలో కూడా ఉపయోగపడతాయి. కాబట్టి రోజూ భోజనం తిన్న తర్వాత సోపు తింటే కళ్లకు మేలు చేస్తుంది. అలాగే త్రిఫల, ఉసిరి కళ్లకు చాలా మేలు చేస్తుంది. త్రిఫల పొడి, ఉసిరి పొడి కలిపి మీ చిన్నారికి ఆహారంలో ఇవ్వవచ్చు. దానితో పాటు కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి కూడా అలవాటు చేయాలి. విటమిన్ ఎ అధికంగా ఉండే ఆహారాన్ని పిల్లలకు తినిపిస్తే కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

## గుండెల్లో మంట ఎక్కువైందా..? అయితే, ఈ హెూం రెమెడీస్‌ని పాటించండి.!

గుండెల్లో మంట సమస్య జీర్ణవ్యవస్థకు సంబంధించినది. ఇది తప్పుడు ఆహారపు అలవాట్ల వల్ల మరింత తీవ్రమవుతుంది. దీనిని హార్ట్ బర్న్ లేదా యాసిడ్ రిఫ్లక్స్ అని కూడా పిలుస్తారు. దీని కోసం అనేక రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అయితే మీరు ఇంట్లో కొన్ని సహజ పద్ధతుల ద్వారా హార్ట్ బర్న్ సమస్యను వదిలించుకోవచ్చు. ఎలాంటి సైడ్ఎఫెక్ట్స్ లేని హెూం రెమిడీస్తో మీరు గుండెల్లో మంట, అసౌకర్యాన్ని వదిలించుకోవచ్చు. అదేలాగో ఇక్కడ తెలుసుకుందాం. ఆపిల్ సైడర్ వెనిగర్– యాపిల్ సైడర్ వెనిగర్ హార్ట్ బర్న్ నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. యాపిల్ సైడర్ వెనిగర్ రెండు టీస్పూన్లు ఒక గ్లాసు నీళ్లలో కలుపుకుని తాగితే ఎసిడిటీ తొలగిపోయి బరువు కూడా అదుపులో ఉంటుంది. లవంగం గుండెల్లో మంట విషయంలో లవంగాలు కూడా చాలా ప్రయోజనకరంగా పనిచేస్తాయి. మీరు కూడా ఆహారం జీర్ణం కాలేదనే సమస్యతో ఇబ్బంది పడుతున్నట్టయితే, రెండు లవంగాలను నోట్లో వేసుకుని చప్పరించవచ్చు. లవంగాల వినియోగం ప్రయోజనకరంగా ఉంటుంది. అంతేకాకుండా నోటి దుర్వాసనను దూరం చేయడంలో కూడా ఇది చాలా మంచిది. సెలెరీ ఆకుల వినియోగం– మీరు గుండెల్లో మంటను వదిలించుకోవడానికి సెలెరీని(కొత్తిమీర వంటి ఆకుకూర) కూడా ఉపయోగించవచ్చు. దీన్ని ఒక గ్లాసు నీళ్లలో రాత్రంతా నానబెట్టి, ఉదయాన్నే తాగండి లేదా కషాయం చేసి కూడా తాగవచ్చు. ఈ రెండు పద్ధతులు మీ జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. యాసిడ్ రిఫ్లక్స్ సమస్యను తొలగిస్తాయి. కలబంద రసంఅజీర్ణం,గ్యాస్, అసిడిటీ నుండి ఉపశమనం అందించడంలో కూడా కలబంద రసం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. దీని కోసం మీరు దాని గుజ్జు నుండి రసం తయారు చేసితాగొచ్చు. ఇది మీజీవక్రియ రేటునుకూడా మెరుగుపరుస్తుంది. మజ్జిగ తాగాలిమజ్జిగ తీసుకోవడంవల్ల గుండెల్లో మంట నుండి ఉపశమనం పొందవచ్చు. ఇందులో ఉండే అసిడిక్ ఎలిమెంట్స్ అజీర్ణం, గ్యాస్, ఎసిడిటీ నుండి ఉపశమనం కలిగిస్తాయి. వేసవిలో దీనిని తీసుకోవడం ద్వారా మీ పొట్టను చల్లగా ఉంచుకోవచ్చు.

## పోషకాల్లో తిరుగులేని పొద్దుతిరుగుడు.. తింటే అద్భుతమైన శక్తి

పొద్దుతిరుగుడు విత్తనాలలో విటమిన్ సి, విటమిన్ ఇ, విటమిన్ బి6, ఫైబర్, ఐరన్, జింక్, కాపర్, ఫాస్పరస్ మరియు కాల్షియం వంటి అనేక ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వీటిని తీసుకోవడం ద్వారా మీరు మీ ఎముకలను బలోపేతం చేయడమే కాకుండా మీ జీర్ణవ్యవస్థను కూడా మెరుగుపరుచుకోవచ్చు. అలాగే, అవి డయాబెటిక్ రోగులకు ఔషధం లాంటివి. ఎందుకంటే వీటి సహాయంతో రక్తంలో చక్కెర స్థాయిని నిర్వహించడంలో సహాయపడతాయి. పొద్దుతిరుగుడు పువ్వుకు ఎంత అందం ఉంటుందో, దాని గింజల్లో అంత ఆరోగ్యం దాగివుందని నిపుణులు అంటున్నారు. పొద్దుతిరుగుడు విత్తనాలు ఆరోగ్యానికి వరం లాంటివి. ప్రతిరోజూ వాటిని తినడం వల్ల ఈ అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయి. నేటి అనారోగ్యకరమైన జీవనశైలిలో, ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం చాలా ముఖ్యం. మీ ఆహారంలో పొద్దుతిరుగుడు విత్తనాలను చేర్చుకోవడం ద్వారా కొలెస్ట్రాల్ నుండి రక్తపోటు వరకు నియంత్రించవచ్చు. పొద్దుతిరుగుడులో డైటరీ ఫైబర్, ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్స్ కూడా ఉంటాయి. ఇవి అనేక వ్యాధులలో గొప్ప ప్రయోజనాలను అందిస్తాయి. పొద్దుతిరుగుడు విత్తనాలలో అద్భుతమైన ఆరోగ్య నిధి దాగి ఉంది. శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడానికి ఆహారంలో కొన్ని గింజలను చేర్చుకోవడం చాలా మేలు చేస్తుంది. పొద్దుతిరుగుడు విత్తనాలను ఉపయోగించడం వల్ల అనేక ఆరోగ్య సమస్యల నుండి మిమ్మల్ని రక్షించడంలో సహాయపడుతుంది. ఫైబర్ అధికంగా ఉండే పొద్దుతిరుగుడు విత్తనాలను తీసుకోవడం ద్వారా, మీరు మలబద్ధకం సమస్య నుండి కూడా ఉపశమనం పొందవచ్చు. పొద్దుతిరుగుడు విత్తనాలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి వాటిని మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల కడుపు సంబంధిత సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. మీరు మలబద్ధకంతో బాధపడుతుంటే, ఈ విత్తనాలను తీసుకోవడం ద్వారా మీరు చాలా వరకు ఉపశమనంపొందవచ్చు. పొద్దుతిరుగుడుగింజలు డయాబెటిక్ రోగులకు ఒక ఔషధం లాంటివి., ఎందుకంటే వాటిలో పాలీసాచురేటెడ్ కొవ్వు పుష్కలంగా ఉంటుంది. కార్బోహైడ్రేట్ పరిమాణం తక్కువగా ఉంటుంది. పొద్దుతిరుగుడు విత్తనాలను తినడం వల్ల జీవక్రియ రేటు పెరుగుతుంది. వాటిలో మెగ్నీషియం కూడా పుష్కలంగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో సన్‌ఫ్లవర్ సీడ్స్ రెగ్యులర్ వినియోగం బరువు తగ్గడానికి, స్థూలకాయాన్ని అదుపులోకి తీసుకురావడానికి సహాయపడుతుంది. ఎముకల ఆరోగ్యాన్ని పెంపొందించడంలో కూడా ఈ విత్తనాలు చాలా మేలు చేస్తాయి. మీరు కూడా కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఎందుకంటే ఇందులో కాల్షియం, మెగ్నీషియం, జింక్ మరియు ఇనుము మంచి మొత్తంలో ఉంటాయి. పొట్టనుశుభ్రం చేయడంలో పొద్దుతిరుగుడు గింజలకు మరొకటి పోటీ లేదు. వీటిని తీసుకోవడం ద్వారామీరుమీజీర్ణవ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా,శరీరంలోని టాక్సిన్స్‌నుకూడా బయటకు పంపవచ్చు . ప్రతిరోజూ 2 టేబుల్ స్పూన్ల పొద్దుతిరుగుడు విత్తనాలు మీ ఆరోగ్యానికి వరం కంటే తక్కువ కాదు.

# ఎండలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ◆ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి, ప్రతినిధి మే 02 ):** ఎండలు, వడగాలులతో జరిగే ప్రమాదాలు పట్ల ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నాయని, అకాల వర్షాలు వల్ల భూమి నుండి వేడి వస్తుందని, ఎండ తీవ్రత కూడా అధికంగా ఉంటున్నందున ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు ఆరోగ్య సంరక్షణ చర్యలు పాటించాలని సూచించారు. ఎండబారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, ఎండ అధికంగా ఉన్న సమయాల్లో బయటకు వెళ్లకుండా ఉండాలని తెలిపారు. అత్యవసర పరిస్థితి అయితే తప్ప ప్రజలు బయటికి రాకూడదని, ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల మధ్య ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని ప్రజలు ఇళ్లు నుంచి బయటకు రావొద్దని సూచించారు. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్న నేపథ్యంలో వడ దెబ్బలు, ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని స్పష్టం చేశారు. వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. చిన్నారులు, వయోవృద్ధులతో ప్రయాణం శ్రేయస్కరం కాదని ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇంటి నుండి బయటికి వస్తే తలకు ఎండ తగలకుండా గొడుగు, కండువా,టోపితో కవరు చేయాలని సూచించారు. మంచినీళ్లు అధికంగా తీసుకోవాలని తీసుకోవాలని, వదులుగా ఉన్న కాటన్ దుస్తువులను ధరించాలని తెలిపారు. ఎండ అధికంగా ఉన్న సమయాల్లో దూర ప్రయాణాలు చేయకూడదని తెలిపారు. వడదెబ్బకు గురికాకుండా తరచుగా ఓ.ఆర్.ఎస్ ద్రావణం, మజ్జిగ, నిమ్మరసం తీసుకోవాలని తద్వారా వడదెబ్బ నుండి ఉపశమనం ఉంటుందని అన్నారు. ఎండలు వల్ల చర్మంపై ఎర్రటి దద్దుర్లు, పొడిబారడం లాంటి మార్పులను ప్రజలు గమనించాలని తెలిపారు. వేడి వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుందని, అలసట, నోరు ఎండి పోవడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయక తక్షణమే సమీప ప్రభుత్వ ఆసుపత్రులల్లో వైద్య సేవలు పొందాలని తెలిపారు. అత్యవసర వైద్య సేవలకు 108 కు ఫోన్ చేయాలని అన్నారు. నిల్వ ఉన్న ఆహారం, వేపుళ్లు, ఆరు బయట ఆహార పదార్థాలుకు దూరంగా ఉండటం మంచిదని సూచించారు. ఉపాధి హామీ పథకం పనులు కూలీలు ఉదయం 6 నుండి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుండి 6 గంటలు వరకు పనులు చేపించాలని, పనులు జరుతున్న ప్రదేశాల్లో రక్షణ, జాగ్రత్తలు పాటించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని అధికారులను ఆదేశం

### • భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**జయశంకర్ భూపాలపల్లి, ప్రతినిధి మే 02 :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా క్యాంప్ కార్యాలయం నుండి స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్, గృహ నిర్మాణ శాఖ, మండల ప్రత్యేక అధికారులు, ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల విచారణ ప్రత్యేక అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హులైన కుటుంబాలకు న్యాయం జరగేలా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా మరియు సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా నిజంగా అవసరమైన ఇండ్లు లేని పేద కుటుంబాలకు ఇండ్లు ఇవ్వాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. గ్రామ, వార్డు స్థాయిలో అర్హులైన దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించి, వారిని ఎంపిక చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకూడదని, సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ చేయడం జరుగుతుందని, ఏదేని అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు తక్షణమే నిర్మాణం చేపట్టేలా అవగాహన కల్పించాలని అన్నారు. విడతల వారిగా నిధులు మంజూరు చేయడం జరుగుతుందని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, ఇందిరమ్మ విచారణ ప్రత్యేక అధికారు లు తదితరులు పాల్గొన్నారు,

# అకాల వర్షం కారణంగా తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం

### - భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ







**జయశంకర్ భూపాలపల్లి, ప్రతినిధి మే 02 :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్ పూర్ మండల కేంద్రంలోని ఎర్ర చెరువు సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులతో కలిసి పరిశీలించారు. తడిసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్కువ మొత్తంలో హమాలీలను ఏర్పాటు చేసి తడిసిన ధాన్యం మొలకెత్తక ముందే మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ, సహకార శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి అకాల వర్షం వల్ల నష్టపోయిన రైతుల పంటల వివరాలను నమోదు నివేదిక అందించాలని పేర్కొన్నారు. తడిసిన ధాన్యం వివరాలు పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి అందించి నష్టపరిహారం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, డీఎం రాములు, సహకార శాఖ అధికారి వాలియా నాయక్ తహసీల్దార్ ప్రహ్లాద రాథోడ్, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కొబ్బరినీళ్లు తాగే అలవాటుందా..? ఈ సమస్యలున్న వారు అస్సలు తాగకూడదంట..



ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఈ తరుణంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం.. ముఖ్యంగా ఎండాకాలంలో చాలామంది డీహైడ్రేషన్ సమస్యతో బాధపడుతుంటారు. వాస్తవానికి.. శరీరంలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఒకవేళ నీటిశాతం తగ్గితే.. అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. బాడీ డీహైడ్రేషన్‌కు గురైనప్పుడు కొబ్బరి నీరు అమృతంలా పనిచేస్తుంది.. వాస్తవానికి కొబ్బరి నీరు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఎందుకంటే ఇందులో విటమిన్ సి, విటమిన్ ఇ, ఐరన్, కాల్షియం, కాపర్, ఫాస్పరస్, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సాయపడతాయి.. కొబ్బరినీళ్లు ఎప్పుడు తాగినా తాగినా మంచిదే కానీ.. కొందరికి మాత్రం సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయని పేర్కొంటున్నారు వైద్య నిపుణులు.. కొన్ని సమస్యలున్న వారు కొబ్బరినీటికి దూరంగా ఉండాలి.. ఏ వ్యాధితో బాధపడేవారు కొబ్బరినీళ్లు తాగకూడదో ఇప్పుడు తెలుసుకోండి. కిడ్నీ సంబంధిత వ్యాధులు ఉన్నవారు: కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడేవారు కొబ్బరినీళ్లు తాగకూడదు. ఇందులో పొటాషియం ఎక్కువగా ఉండటం వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. మధుమేహ రోగులు: మధుమేహ వ్యాధిగ్రస్తులు కొబ్బరినీళ్లు తాగకూడదు. ఎందుకంటే దానిలో గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా ఎక్కువ. అందుకే.. కొబ్బరినీళ్లు తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి వేగంగా పెరుగుతుంది. అలర్జీ: అలర్జీ బాధితులు కొబ్బరినీళ్లు తాగకూడదు. కొబ్బరి నీరు తాగితే చర్మంపై దురద, మంట, చర్మం ఎర్రబడడం వంటి అనేక సమస్యలను ఎదుర్కొవలసి ఉంటుంది. అధిక రక్తపోటు: అధిక రక్తపోటుతో బాధపడేవారు కూడా సాధ్యమైనంతమేరకు కొబ్బరినీటికి దూరంగా ఉండాలి.. అయితే, వైద్యుల సలహా మేరకు మాత్రం కొబ్బరి నీళ్లు తాగవచ్చు.

# మే 5 నుంచి 20 వరకు జిల్లాకు ఒక మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహణ

- మే నెల చివరి వరకు ప్రతి దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి
- భూ సేకరణ జరిగిన భూముల వివరాలు అప్ డేట్ చేయాలి
- నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణకు పటిష్ట కార్యాచరణ అమలు
- అర్హులకు ఇందిరమ్మ ఇండ్ల పథకం కేటాయించాలి
- భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సుల పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన
- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**పెద్దపల్లి ప్రతినిధి మే 2, :** భూ భారతి చట్టం రూల్స్ ప్రకారం ప్రజల నుండి వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ లతో కలిసి భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులు, నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి :** మే 5 నుంచి మే 20 వరకు పైలట్ ప్రాజెక్టు జిల్లాలు మినహాయించి మిగిలిన జిల్లా లలో ఒక మండలాన్ని పైలట్ గా తీసుకొని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యల పై ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని మంత్రి సూచించారు. జూన్ 2 వరకు పైలట్ ప్రాజెక్ట్ క్రింద వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన 4 మండలాల్లో రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పై ప్రజల నుంచి 12 వేల 759 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. భవిష్యత్తులో జరిగే రాష్ట్రవ్యాప్త రెవెన్యూ సదస్సులు సుమారు 15 లక్షల దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు .గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరిస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని అన్నారు. భూ భారతి చట్టంలో దరఖాస్తు చేసుకునే సమయంలో సరిగ్గా దరఖాస్తు నమోదు అయ్యేలా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని అన్నారు.ప్రభుత్వ భూములలో పొజిషన్ ఉన్న రైతుల దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించాలని, భూమి లేని నిరుపేదలు పోజిషన్ లో ఉంటే వారికి పట్టాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రితో చర్చించి సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు.పట్టాలు ఉండి పొజిషన్ లో లేని దరఖాస్తులను కూడా పరిశీలించాలని అన్నారు. హై కోర్టు నుంచి అనుమతి రాగానే సాధా బైనామా దరఖాస్తులు పరిష్కారం చేయాలని, దీనికి అవసరమైన కార్యాచరణ పూర్తి చేయాలని మంత్రి సూచించారు. భూ సర్వే కు సంబంధించిన సమస్యలు, ఆర్.ఎస్.ఆర్ ఎక్సస్ సమస్యలు పరిష్కరించాలని, భూ సేకరణ కింద ప్రభుత్వం సేకరించిన భూముల రికార్డులు అప్ డేట్ చేయాలని మంత్రి కలెక్టర్ లను ఆదేశించారు. మే నెల చివరి వరకు రెవెన్యూ సదస్సులు వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా పరిష్కారం చూపాలని మంత్రి పేర్కొన్నారు.గతంలో పంపిణీ చేసిన అసైన్డ్ భూముల పట్టాలు ఎవరైనా విక్రయిస్తే ముందు ఆ పట్టాలు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన వారు భూమి లేని నిరుపేద లైతే ప్రభుత్వం చర్చించి ఎంత భూమి క్రమబద్ధీకరించాలి అనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అటవీ భూముల వివాదాల పరిష్కారానికి కూడా కృషి చేయాలని అన్నారు.నీట్ పరీక్ష కేంద్రాలను ముందుగా జిల్లా కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి ఏర్పాట్లు పర్యవేక్షించాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు త్రాగు నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో చిన్న మెడికల్ క్యాంపు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని అన్నారు. సీసీ కెమెరాలు, అవసరమైన మేర పోలీస్ భద్రత కల్పించాలని అన్నారు.ప్రశ్న పత్రాలు స్టోర్ చేసే స్ట్రాంగ్ రూం వద్ద సిసిటివి ఉండాలని, పోలీస్ బందోబస్తుతో పరీక్ష కేంద్రాలకు ప్రశ్నా పత్రాలను తరలించాలని అన్నారు. పరీక్ష కేంద్రాల గేటు మధ్యాహ్నం 1.30 గంటలకు మూసి వేయాలని, ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా చెక్ చేసిన తర్వాత మాత్రమే పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించాలని, బయో మెట్రిక్ అటెండెన్స్ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.కేంద్ర ప్రభుత్వం నుంచి అర్బన్ పీఎం ఆవాస్ యోజన కింద లక్షా 13 వేల ఇండ్లు మంజూరయ్యాయని, ప్రతి నియోజకవర్గ పరిధిలోని పట్టణ ప్రాంతాలలో కనీసం 500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా చూడాలని మంత్రి అన్నారు. పి.ఎం.ఎల్.ఏ పోర్టల్ లో లబ్ధిదారుల ధ్రువీకరణ ఆధార్ నెంబర్ లతో పూర్తి చేయాలని, దీని ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి మనకు మొదటి విడత కింద 700 కోట్ల పైగా నిధులు వస్తాయని అన్నారు.600 చదరపు ఫీట్లు కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మిస్తే మనకు ప్రభుత్వం నిధులు రావని, లబ్ధిదారులకు వివరించి 600 ఫీట్ల లోపు కట్టేలా చూడాలని అన్నారు.పైలెట్ గ్రామాలలో మనం మంజూరు చేసిన 51 వేల ఇందిరమ్మ ఇండ్లలో ఇప్పటివరకు 10 వేల ఇంటి నిర్మాణాలు మాత్రమే ప్రారంభమయ్యాయని, 2019 ఇండ్లు బేస్మెంట్ పూర్తి చేసుకుంటే ఇటీవలే లక్ష రూపాయలు విడుదల చేశామని, ఇంటి నిర్మాణాలలో పురోగతి రావాల్సిందేనని, కలెక్టర్లు హౌసింగ్ శాఖపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. హౌసింగ్ కోసం ప్రత్యేకంగా ప్రతి మండలానికి అసిస్టెంట్ ఇంజనీర్లను ప్రభుత్వం కేటాయిస్తుందని అన్నారు. ప్రతిరోజు ఇంచార్జి మంత్రులతో సమన్వయం చేస్తూ అర్హుల జాబితా ప్రకటించి ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలని, మే 10వ తారీఖు లోపు పూర్తి స్థాయిలో ఇండ్లు గ్రౌండ్ చేయాలని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద వార్త పత్రికల్లో వచ్చే వ్యతిరేక వార్తలకు ఎప్పటికప్పుడు రిజెండర్ జారీ చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని, ప్రజలకు చెల్లింపులు సకాలంలో అందుతుందని అన్నారు.

**ప్రధాన కార్యదర్శి కే రామ కృష్ణారావు :** భూ భారతి చట్టం పైలెట్ ప్రాజెక్టు కింద వచ్చిన దరఖాస్తులను చట్టం ప్రకారం పరిష్కరించాలని సూచించారు. అధికారులు అందుబాటులో ఉన్న సమయాన్ని దృష్టిలో ఉంచుకొని దరఖాస్తుల స్క్రూటిని మార్గం సుగమం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి భూ భారతి సమస్యల పరిష్కారం చేపట్టాలని అన్నారు.మే 4న జరిగే నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అన్నారు. రాష్ట్రంలోనే 24 జిల్లాల పరిధిలో 190 పరీక్షా కేంద్రాలలో నీట్ ప్రవేశ పరీక్ష జరుగుతుందని , 72 వేల 507 అభ్యర్థులు పరీక్షలు హాజరయ్యే అవకాశం ఉందని అన్నారు. గతంలో జరిగిన ఎటువంటి పొరపాట్లు మరో సారి పున:రావృతం కాకుండా జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని సిఎస్ కలెక్టర్లకు సూచించారు.నీట్ ప్రవేశ పరీక్షకు జిల్లా స్థాయిలో చేస్తున్న ఏర్పాట్ల గురించి అభ్యర్థులకు తెలిసే విధంగా పత్రికల, మీడియా ద్వారా ప్రచారం కల్పించాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు ముందుగానే చేరుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు.పేదలకు ప్రభుత్వం అందించే శాశ్వత ఆస్తి ఇందిరమ్మ ఇండ్లని, ఇది ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్ఠాత్మమైన కార్యక్రమం అని, అర్హుల జాబితా ఎంపిక చేయడం చాలా కీలకం అవుతుందని, అనర్హులకు పథకం అందితే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని అధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సి.ఎస్ పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లో నిర్మించే ఇందిరమ్మ ఇండ్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా మనకు సహాయం అందే విధంగా మార్గదర్శకాలను పాటించాలని సిఎస్ అధికారులకు తెలిపారు.

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష:** పెద్దపల్లి జిల్లాలో ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ సంబంధించి ధర్మారం మండలంలో 650 ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక ఎంపిక చేసి ఇంచార్జ్ మంత్రి కి ప్రతిపాదనలు పంపుతామని అన్నారు. పెద్దపల్లి, రామగుండం, మంథని అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో స్థానిక ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ 2,3 రోజులలో లబ్దిదారుల తుది ధృవీకరణ పూర్తి చేస్తామని అన్నారు. అర్హుల జాబితాను ఇంచార్జి మంత్రి ద్వారా ఆమోదింప జేసుకొని లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ చర్యలు చేపడతామని అన్నారు. ఈ వీడియో సమావేశంలో ఆర్డీఓలు బి.గంగయ్య, ప్రాజెక్టు డైరెక్టర్ హౌసింగ్ రాజేశ్వర్, తహసిల్దార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు,రెవెన్యూ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట మున్సిపాలిటీకి మూడు కోట్ల నిధుల ప్రొసీడింగ్ పత్రం అందజేత..

**- ఆస్తి పన్ను, 5%రిబేట్‌లలో మొదటి స్థానంలో నిలిచినందుకు కమిషనర్ మొహమ్మద్ అయాజ్‌ను అభినందించిన మున్సిపల్ సెక్రెటరీ..**





**జమ్మికుంట మే 2 :** జమ్మికుంట మున్సిపాలిటీ తెలంగాణ రాష్ట్రంలో మొదటి స్థానం సాధించినందుకు గాను మున్సిపల్ సెక్రటరీ టి. కే. శ్రీదేవి ఐఏఎస్, మూడు కోట్ల నిధుల ప్రొసీడింగ్ అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ సెక్రటరీ శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆస్తి పన్ను వసూళ్లలో పని చేసి, మొదటి స్థానం సాధించినందుకు గాను, జమ్మికుంట మున్సిపాలిటీకి అరుదైన గౌరవం, పట్టణ అభివృద్ధికై మూడు కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ కు అందజేసినట్లు తెలిపారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా మార్చి నెలకు ముందుగానే పన్ను వసూళ్లు పూర్తి చేయాలని కమిషనర్ అయాజ్ ను, సిబ్బందిని ఆదేశించారు. పన్ను వసూళ్లలో కష్టపడి పని చేసిన మున్సిపల్ సిబ్బందిని మున్సిపల్ సెక్రటరీ శ్రీదేవి అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ మూడు కోట్ల నిధులు పట్టణంలోని జంక్షన్ లతో మున్సిపాలిటి ఆదాయం సమకూర్చే వాటికి, అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, ఆర్.ఐ. భాస్కర్, ఆర్.ఓ వాణి, మున్సిపల్ అధికారులు మహేష్, బిల్ కలెక్టర్ మొగిలయ్య, పాషా, కుమార్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఆదర్శ దంపతుల స్ఫూర్తిదాయకమైన నిర్ణయం

**- మరణానంతరం నేత్ర, అవయవదానంకు అంగీకారం**

**- కూతురు పుట్టిన రోజున ప్రకటించిన తల్లిదండ్రులు**

**- దంపతులను అభినందించిన సదాశయ ఫౌండేషన్**

**కోల్ సిటీ, మే 02, :** గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన సింగరేణి కాంట్రాక్టర్ కట్ల లక్ష్మీనారాయణ, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆయన భార్య కట్ల స్వరూప దంపతులు శుక్రవారం స్ఫూర్తిదాయకమైన నిర్ణయాన్ని తీసుకున్నారు. వారి కూతురు శ్రీమేధ పుట్టినరోజు సందర్భంగా దంపతులు ఇద్దరూ తమ మరణానంతరం నేత్రాలు, అవయవాలను దానాలను చేస్తామని అంగీకారాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా వారి నివాసంలో ఏర్పాటు చేసిన పుట్టిన రోజు వేడుకల్లో, గోదావరిఖని ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పందిళ్ళ శ్యామ్ సుందర్, సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీ హెచ్ లింగమూర్తి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి వాసుకు దంపతులు వారి అంగీకార పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పందిళ్ళ శ్యామ్ సుందర్ మాట్లాడుతూ దంపతులు తీసుకున్న నిర్ణయం అందరికీ స్ఫూర్తిగా నిలుస్తుంద కొనియాడారు. మరణానంతరం నేత్రాలు , అవయవాలు దానం చేసి పలువురికి పునర్జన్మ కల్పించాలని సంకల్పించడం అభినందనీయమన్నారు. అనంతరం దంపతులకు అభినందన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సదాశయ ప్రతినిధులు తాడబోయిన రాములు, సరోజన, మగువ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షురాలు శశికళ, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు నాగుల శంకర్, సుందర్, దబ్బటి శంకర్, కుటుంబ సభ్యులు సమ్మక్క, చంద్రశేఖర్, స్రవంతి, సాహితీ, ప్రవీణ్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా వైద్యాధికారిపై దాడికి పాల్పడ్డ వైద్యులపై చర్యలు తీసుకోవాలి

**- ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య**




**పెద్దపల్లి ప్రతినిధి మే 2, :** జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి విధులకు ఆటంకం కలిగించి భయభ్రాంతులకు గురిచేసిన గోదావరిఖని మమత హాస్పిటల్ యజమాన్యం, వైద్యులు, సిబ్బందిపై కేసులు నమోదు చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత నెల 26న జిల్లా వైద్యాధికారి డా. జి. అన్న ప్రసన్న కుమారి విధి నిర్వహణలో బాగంగా గోదావరిఖని మమత హాస్పిటల్ తనిఖీ చేయాగా అందులో అనుమతిలేని అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ ను గుర్తించారని తెలిపారు. చట్ట ప్రకారం ప్రభుత్వ అనుమతి లేకుండా స్కానింగ్ మిషన్ కలిగి ఉండడం నేరమని తన విధి ప్రకారం చర్యలు తీసుకొనుచుండగా వైద్యులు నాగిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి అడ్డుపడ్డారని అన్నారు. డిఎంహెచ్ఓ డాక్టర్ అన్న ప్రసన్న కుమారిని నానా విధాలుగా బెదిరించిన డాక్టర్లపై తక్షణమే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకుడు మహాంకాళి స్వామి, అతని అనుచరులు, హాస్పిటల్ యజమాన్యం, రిసెప్షనిస్ట్ ఆనంద్ ద్వారా అధికారినిపై పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ, పెద్దపల్లి అంబేద్కర్ సంఘం జిల్లా కన్వీనర్ సంకంపల్లి లక్ష్మయ్య, కట్కూరి సందీప్, కొంకటి లింగమూర్తి, పెద్దపల్లి, సుల్తానాబాద్ మండలాల కన్వీనర్లు బుసెల్లి నారాయణ, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.


## బలహీనవర్గాల బలం రాహుల్ గాంధీ

**- కాంగ్రెస్ ఓబిసి సెల్ జిల్లా అధ్యక్షులు మహేష్**




**పెద్దపల్లి ప్రతినిది,. మే 2, :** బలహీన వర్గాల బలం అధినేత రాహుల్ గాంధీ అని కాంగ్రెస్ అనుబంధ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్ అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మహేష్ మాట్లాడుతూ భారత్ జోడో యాత్ర ద్వారా దేశం మొత్తం తిరిగిన రాహుల్ గాంధీ దేశంలో ఉన్న బలహీనవర్గాలకు వారెంతో వారికంత వాటా ఉండాలని, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ ఉన్నప్పుడే బలహీనవర్గాలు బాగుపడతాయని ఆలోచన చేశారని తెలిపారు. తెలంగాణలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి కుల గణన చేసి చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా కూడా కులగణన చేసినప్పుడే బలహీనవర్గాలు బాగుపడతాయని ఓబీసీ సెల్ పక్షాన అనేక పోరాటాలను నిర్వహించాలని దిశ నిర్దేశం చేసి పార్లమెంటు వేదికగా కేంద్రాన్ని నిలదేశారని గుర్తు చేశారు. కేంద్రం జనగణన తోపాటు కులగణన నిర్ణయం తీసుకోవడంలో రాహుల్ గాంధీ ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. రాష్ట్రంలో కులగణన చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు విజయ రమణారావు, రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ లకు ధన్యవాదాలు తెలిపారు. ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఓబీసీ సెల్ పెద్దపల్లి మండల అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ భూతగడ్డ సంపత్, ఓబీసీ సెల్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు బొడ్డుపల్లి తిరుపతి, నాయకులు ఊరేటి మహేష్, సిరి శ్రీనివాస్ దరువుల రవి, తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యం తాళలేక వృద్ధుడి బలవన్మరణం...!



**మానకొండూర్, మే 2,:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం పోచంపల్లిలో పోలం పోచాలు (76)అనే వృద్ధుడు అనారోగ్యం తాళలేక శుక్రవారం ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.వివరాల్లోకి వెళితే..... పోలం పోచాలుకు ఇద్దరు కుమారులు ఉండగా పోలం రవి(56) లారీ డ్రైవర్‌గా పని చేస్తూ,పోలం గోపాల్ గతంలో గ్రామ సర్పంచ్‌గా చేసి అన్నదమ్ములిద్దరూ తమ కుటుంబాలతో కరీంనగర్ లో ఉంటున్నారు. బార్య మల్లమ్మతో కలిసి పోచాలు గ్రామంలోనే ఉంటూ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. కాగా పోచాలు గత కొంత కాలంగా పిట్స్ వ్యాధితో బాధపడుతూ ఎన్ని మందులు వాడినా వ్యాది నయం కాకపోవడంతో మనస్థాపానికి గురై శుక్రవారం ఉదయం ఇంటి ఆవరణలోని బాత్రూం వద్ద ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు పోలం రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ బి.సంజీవ్ తెలిపారు.

## సారు... మందుబాబుల ఆగడాలను అడ్డుకోండి



**తిమ్మాపూర్, మే 2,):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో రాత్రి వేళల్లో మద్యం సేవించి సీసాలు పగులగొడుతూ చిందర వందర చేస్తున్న మందుబాబుల ఆగడాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు శుక్రవారం ఎల్ఎండి ఎస్ఐ తాండ్ర వివేక్ కు పిర్యాదు చేశారు.10ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పాఠశాలలో రోజు చీకటైందంటే మందుబాబులు పాఠశాలను అడ్డాగా చేసుకొని జల్సా మత్తులో అక్కడ ఉన్నటువంటి మహనీయుల విగ్రహాలను కూడా ధ్వంసం చేస్తున్నారని పిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు నిఘా పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరా చారి ఎస్ఐ ని కోరారు. బీజేవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బండి సాగర్, వేల్పుల ఓదయ్య, మావురపు చందు, బొడ్డు శ్రీనివాస్కొంటు శృజన్ తదితరులు పిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

# విద్యార్థుల కెరియర్‌కి గండం

- పిల్లల భవిష్యత్తుకు అడ్డుగా ప్రభుత్వమే
- పెద్దంపేట మంగళపల్లె గ్రామస్తులకు సర్టిఫికెట్లు నిరాకరణ
- కలెక్టర్ ఆదేశాలు అని చెబుతున్న రెవెన్యూ అధికారులు
- సింగరేణి భూవివాదం నేపథ్యంగా సర్టిఫికెట్లు నిలిపివేత
- బీజేపీ మాజీ ఎంపిటిసి పోరం అధ్యక్షులు మొలుమూరి శ్రీనివాస్




**రామగిరి మే 02 :**-సింగరేణి పరిధిలోని పెద్దంపేట మంగళపల్లె గ్రామ ప్రజలు తీవ్ర మనోవేదనతో రోజులు గడుపుతున్నారని రామగిరి మండల రెవెన్యూ శాఖ అధికారులు కులం, ఆదాయం, నివాసం, ఓబీసీ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దరఖాస్తులను తిరస్కరిస్తూ, వెంటనే ప్రశ్నిస్తే కలెక్టర్ ఆదేశామని చెబుతున్నారనీ ఆయా గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని బీజేపీ మాజీ ఎంపిటిసి పోరం అధ్యక్షులు మొలుమూరి శ్రీనివాస్ అన్నారు. దీంతో విద్యార్థుల ఉన్నత విద్యకు అవసరమైన సర్టిఫికెట్లు లేక విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెద్దంపేట గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని ఎంబిబిఎస్ పూర్తిచేసి పీజీ నీట్ దరఖాస్తు చేయాలనుకుంటోంది. మరో యువకుడు గేట్ ఉత్తీర్ణుడై ఐఐటీ, ఎన్ఐటీ ఎంటెక్ కోసం సన్నద్ధమవుతున్నాడు. కానీ అవసరమైన ఆధార సర్టిఫికెట్లు లేక ఎటు వెళ్ళాలో తెలియని స్థితిలో వారు మనోవేదనకు గురవుతున్నారు. ఇది మా భవిష్యత్తుకు సంబంధించిన విషయంలో ప్రభుత్వమే అడ్డుగా నిలవడం బాధాకరం," వారుఅంటూ వాపోతున్నారు. గ్రామస్థులు దరఖాస్తు చేసుకున్నప్పటికీ, అధికారులు మీ గ్రామానికి సర్టిఫికెట్లు ఇవ్వొద్దన్న కలెక్టర్ ఆర్డర్ ఉందని చెప్పడంతో వారు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. అంతేగాక, సింగరేణి కంపెనీ ఇంకా నష్టపరిహారాలు ఇవ్వకముందే మీరు భూములు ఖాళీ చేయాలి అంటూ రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.ఈ నేపథ్యంలో బీజేపీ మాజీ ఎంపిటిసి మొలుమూరి శ్రీనివాస్ స్పందిస్తూ, మంత్రి శ్రీధర్‌బాబు నియోజకవర్గంలోనే ప్రజలకు న్యాయం జరగకపోతే మరెక్కడ జరుగుతుంది? ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలి," అని బీజేపీ మాజీ ఎంపిటిసి పోరం అధ్యక్షులు మొలుమూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయంలో నాయక్ జరిగే న్యాయం జరిగే వరకు పోరాడతామని, అవసరమైతే కేంద్ర మంత్ర కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని బీజేపీ మాజీ ఎంపిటిసి పోరం అధ్యక్షులు మొలుమూరి శ్రీనివాస్ ఈ సందర్భంగా తెలిపారు.

## ఖనిలో ప్రజలను పీడిస్తున్న ప్రైవేటు ఆసుపత్రులపై వారు చేస్తున్న దోపిడీపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి



**కోల్ సిటీ మే 02** గోదావరిఖనిలో మెడికల్ మాఫియా రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్నది. కోల్ బెల్ట్ ప్రాంతంలో ప్రధానంగా సింగరేణి గని కార్మికుల శ్రమను దోచుకోవడమే ప్రధాన ధ్యేయంగా ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు పనిచేస్తున్నాయి. గోదావరిఖనిలో ఉండే ఏ ఒక్క ఆసుపత్రి కూడా ప్రజాసేవ లక్ష్యంగా పనిచేయడం లేదనేది పచ్చి వాస్తవం. అనేక సంఘటనలు గోదావరిఖనిలో చోటుచేసు కుంటున్నాయి వైద్యం వికటించి చనిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. గోదావరిఖని కి స్లిప్పర్లతో వచ్చిన డాక్టర్లు నేడు గోదావరిఖని ప్రజల సొమ్మును దోచుకుని కోట్లకు రూపాయల ఆస్తులు సంపాదించుకునే స్థాయికి చేరుకున్నారు. రాజకీయ పైరవీలతో కొంతమంది డాక్టర్లు అయితే రాజకీయ అవతారమెత్తి ఒక అడుగు ముందుకేసి కొనసాగుతున్నారు. రాజకీయ అవతారమెత్తిన ఒక ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ అనుమతులు ఒకచోట ఆసుపత్రి నిర్వహణచోట కొనసాగిస్తూ ప్రభుత్వాన్ని సైతం తప్పుదారి పట్టిస్తున్నారు. ఒక్క ఆస్పత్రిలో కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పార్కింగ్ గాని ఫైర్ సేఫ్టీ గాని కనీస సౌకర్యాలు లేకుండా నిర్వహిస్తున్న దాఖలాలు ఉన్నాయి. ఎప్పుడో తనిఖీకి వచ్చిన అధికారులను నయానో భయానో బెదిరించడం వారిని తనిఖీలకు రాకుండా చూడడం వీరి పరిపాటుగా మారినది ప్రజా ప్రతినిధులు సైతం ప్రభుత్వ వైద్యానికి అధిక ప్రాధాన్యత నివ్వాలని కోరుతున్నాం అని అన్నారు. ప్రభుత్వం వైద్యాన్ని ప్రోత్సహించి ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేయాలని కోరుతున్నాం అని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం గోదావరిఖనిలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలపై వారి అక్రమ సంపాదనలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం అని అన్నారు. డీఎంహెచ్ఐపై దాడిని ఖండిస్తున్నాంలి. డీఎంహెచ్ఓ ప్రసన్న పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పలువురు వైద్యులు, పలు రాజకీయ నాయకులు పేర్కొ న్నారు. దళిత వైద్యాధికారిని చంపుతామని బెదిరించడం హేయనీయమైన చర్య. గోదావరిఖని లక్ష్మీ నగర్ స్వతంత్ర చౌక్ లోని శ్రీమమత హాస్పిటల్ లో అనుమతి లేకుండా లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ మిషన్ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడిపిస్తున్నారని కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేయడాని కి వచ్చిన జిల్లా వైద్యాధికారి ప్రసన్న ను హాస్పిటల్ యాజమాన్యం స్కానింగ్ సెంటర్ కు తాళం వేసి ఎవరి అనుమతి తీసుకొని వచ్చి తనిఖీ చేస్తున్నావ్ అంటూ బెదిరిస్తూ సీజ్ చేయకుండా తాళం వేసి నానా హంగామా సృష్టించారన్నారు. ఒక దశలో ఆమెను భయభ్రాంతులకు గురి చేశారని వారన్నారు. స్కానింగ్ సెంటర్ తాళం పగల గొట్టి చట్ట వ్యతిరేకంగా లింగ నిర్ధారణ చేస్తు న్నహాస్పటల్ చీకటి బాగోతాన్ని బయట పెట్టి స్కానింగ్ సెంటర్ సీజ్ చేసి పంచనామా నివేదికను ప్రభుత్వానికి పంపిస్తున్న తరుణంలో ఐఎంఏ కు చెందిన డాక్టర్ మరో ముగ్గురు వైద్యులు, మమత హాస్పిటల్ యాజమాన్యం కలిసి డీఎంహెచ్ఓపై దాడికి పాల్పడ్డారన్నారు. ఆమెను దుర్భాషలాడుతూ పంచనామ రిపోర్టును చించివేసిచంపుతామని బెదిరించడం దుర్మార్గమైన చర్య అని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని లేనిప క్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. డిఎంహెచ్వో ప్రసన్న పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు.

# ప్రభాకర్ పాస్టర్ మృతి తీరనిలోటు



**రామగిరి, మే 02:-** మంథని నియోజకవర్గ పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ వల్లూరి ప్రభాకర్ మృతి క్రైస్తవ సమాజానికి తీరనిలోటని ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్ పేర్కొన్నారు. మంథని పట్టణానికి చెందిన సీయోను ప్రార్థన మందిరంలో గత 15 సంవత్సరాలుగా క్రైస్తవ మనిచర్యలో కొనసాగుతున్నా పాస్టర్ వల్లూరి ప్రభాకర్ గురువారం ఆకస్మికంగా మృతి చెందాదని ఆయన తెలిపారు. ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా మంథని ఫీల్డ్ చైర్మన్ గా, సువార్త సహవాస సంఘాల కోశాధికారి గా, తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు గా వివిధ క్రైస్తవ సంఘాలకు నాయకత్వం వహిస్తూ సేవలు అందిస్తున్నారని ఆయనను కొనియాడారు. శుక్రవారం భువనగిరిలో జరిగిన అంతిమయాత్ర కార్యక్రమంలో మంథని నియోజకవర్గంలో నుండి పాస్టర్ లు, సంఘ పెద్దలు, విశ్వాసులు పెద్ద ఎత్తున హాజరయి అయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియపరిచారు.

# ఇందిరమ్మ ఇండ్లు 600 చదరపు అడుగులకు మించొద్దు

- ప్రతి నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతంలో 500 ఇండ్లు ● ఈనెల 5 నుంచి 20 వతేదీ వరకు 28 మండలాల్లో భూభారతి..
- నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు జిల్లా కలెక్టర్లు.. ● ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి









**శామీర్ పేట, మే 02** : ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇండ్లకు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ. హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. లబ్దిదారుల ఎంపిక ఎంతవరకు పూర్తయితే అంతవరకు ఏరోజుకారోజు ఇన్‌ఛార్జి మంత్రుల నుంచి లబ్దిదారుల జాబితాకు ఆమోదం తీసుకోవాలని అలాగే ప్రతి నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతంలో కనీసం 500 ఇండ్లను కేటాయించి లబ్దిదారులను ఎంపిక చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం నాడు చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణ రావుతో కలిసి భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ లు, ఎస్.పి లతో మంత్రిగారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ ఇంటి నిర్మాణం 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మాణం జరిగేలా కలెక్టర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనర్హులని తేలితే ఇండ్ల నిర్మాణం మధ్యలో ఉన్నాకూడా రద్దు చేస్తామన్నారు. లిస్ట్-1, లిస్ట్-2 , లిస్ట్-3 లతో సంబంధం లేకుండా నిరుపేదలను ఎంపిక చేయాలన్నారు. 5 నుంచి 20వ తేదీవరకు..గత నెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో నిర్వహించిన మాదిరిగానే ఈనెల 5వ తేదీ నుంచి 20వ తేదీవరకు జిల్లాకొక మండలం చొప్పున 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. పైలట్ మండలాల్లో వచ్చిన దరఖాస్తులను ఈనెల 31వ తేదీవరకు పరిష్కరించాలని , పరిష్కారం కాని వాటికి ఎందుకు పరిష్కరించడం లేదనే విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేస్తూ దరఖాస్తును తిరస్కరించాలని కలెక్టర్లకు సూచించారు. 605 మండలాలకు గాను ఇప్పటి వరకు 590 మండలాల్లో అవగాహనా సదస్సులను నిర్వహించడం జరిగిందని ఇందులో 85,527 మంది పౌరులు, 1,62, 577 మంది రైతులు పాల్గొన్నారని తెలిపారు. ప్రభుత్వ భూముల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని, అసైన్డ్ ల్యాండ్‌లకు సంబంధించి పొజిషన్ మీద ఉండి పట్టా లేనివారు, పట్టాఉండి పొజిషన్ మీద లేనివారి వివరాలను సేకరించాలని సూచించారు. నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈనెల 4వ తేదీన జరగనున్న నీట్ పరీక్షకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఏడాది రాష్ట్రం నుండి 72,572 మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరవుతున్నారని ఇందుకోసం 24 జిల్లాల్లో 190 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరుతోపాటు ఓ ఆర్ ఎస్ ప్యాకట్లు, మెడికల్ కిట్ లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన సూచనలను ముందుగానే ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశం లో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, సి.సి. ఎల్. ఎ డైరెక్టర్ మకరంద్, హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి, వి. పి. గౌతమ్ , లా ఆర్డర్ డిఐజి మహేష్ భగవత్ తదితరులు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి జిల్లా కలెక్టరు గౌతం, సైబరాబాదు డిసిపి కోటిరెడ్డి, అదనపు కలెక్టరు రాధికాగుప్తా, లా ఆఫీసర్ చంద్రావతి, ఆర్డిఓలు ఉపేందర్ రెడ్డి, శ్యాంప్రకాష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖనిలో కొన్ని ప్రయివేట్ అస్పత్రుల ఆర్థిక దోపిడీ

- కొన్నిటికి అనుమతులు సరిగ లేకున్నా యేథేచ్ఛాగా కొనసాగుతున్న వైనం
- తనిఖీలకు వచ్చిన అధికారిని చంపేస్తామంటున్నా నిర్వాహకులు, అధికార పార్టీ నేతల బెదిరింపులు
- దళిత వైద్య అధికారిని భయబ్రాంతులకు గురి చేసిన వారిని మందలించకుండా ప్రెస్‌మీట్లు పెట్టి ప్రక్కన కూర్చోబెట్టుకొని ప్రయివేట్ అస్పత్రులకు అండగా ఉంటాం అనడం, జర్నలిస్టులను అవమానించడం దురదృష్టకరం
- ఎమ్మెల్యే ప్రభుత్వ అస్పత్రిని ప్రోత్సాహించాల్సింది పోయి ప్రయివేట్ వైద్యులను అవినీతి పరులను, వలసవాదులను ప్రోత్సహించడం సరికాదు ● కోల్ సిటీని క్రైమ్ సిటీగా మార్చకుండా హెల్త్ సిటీగా మార్చండి: మద్దెల దినేష్



**గోదావరిఖని ప్రతినిధి, మే 02** : గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో పుట్టగొడుగుల్లా పుట్టుకస్తున్న ప్రైవెట్ అస్పత్రుల ఆగడాలు, ఆర్థిక దోపిడీ ఎలాంటి అనుమతులు లేకున్నా అధికార పార్టీ నేతల అండ దండలు ఉంటే సరిపోతుందనే ధీమాతో ఉండడం సిగ్గుచేటని, ఏప్రిల్ 26న పెద్దపల్లి జిల్లా వైద్య అధికారి (డి ఎం, హెచ్ ఓ) మమత అస్పత్రి లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని స్కానింగ్ యంత్రానికి ఎలాంటి అనుమతులు లేవని నమ్మదగిన సమాచారంతో కలెక్టర్ ఆదేశాల మేరకు వచ్చి తనిఖీ చేస్తుంటే అస్పత్రి నిర్వాహకులు ఒకరు, అధికార పార్టీ మాజి ప్రజాప్రతినిధులు అస్పత్రికి చేరుకొని జిల్లా వైద్య అధికారి ఒక మహిళ అని కుడా చూడకుండా వారి పై దౌర్జన్యం చేయడం, చంపేస్తాం అని బెదిరింపులకు పాల్పడటం దుర్మార్గపు చర్య అని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ పేర్కొన్నారు. అనంతరం అయిన మాట్లాడుతూ గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతం కోల్ సిటీ ని హెల్త్ సిటీగా మార్చాల్సింది పోయి క్రైం సిటీ గా మార్చుతారా అని అధికార పార్టీ నేతలను అయిన ప్రశ్నించారు. ఎక్కడి నుండో ఆంధ్ర వలసవాదులు ఇక్కడికి వచ్చి ప్రాంతం కాలుష్య ప్రాంతాన్ని ఆసరాగా చేసుకొని రోగుల దగ్గర ఇష్టానుసారంగా ఆర్థికంగా దోచుకోవడం అల్వాటుగా మారిందని అయిన విమర్శించారు. ఇక పోతే మొన్న జరిగినటువంటి జిల్లా వైద్య అధికారి పై బెదిరింపులు తనిఖీ కి వచ్చిన మహిళ అధికారిని అడ్డుకోవడం విచారణ చేసి పంచానామ చేస్తే వాటిని అధికారిని చేతుల నుండి బలవంతంగా గుంజుకొని చింపివేయడం జరిగిందంటే వారి ఆగడాలు అధికార అహంకారం, ఒక మాఫియా ల చేయడం ఏంటో అర్థం అవుతుందని అన్నారు. అలాంటి వారిని స్థానిక శాసన సభ్యులు మందలించాల్సింది పోయి ప్రెస్ మీట్ పెట్టి మరి వారిని ప్రక్కన కూర్చోపెట్టుకొని ప్రోత్సహించినట్లు మాట్లాడటం, ప్రయివేట్ అస్పత్రుల నిర్వాహకులను ఎవరిని ఏమనద్దు అధికారులు రావద్దు అని చెప్పకనే చెప్పినట్లు ఉందన్నారు. ఎమ్మెల్యే కి ఆంధ్ర వలస వాదులైన వైద్యుల మీద ఎందుకు అంత ప్రేమ అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ప్రభుత్వ అస్పత్రిలో కనీస సౌకర్యలు లేక పేద మధ్యతరగతి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని కనీసం డయాగ్నటిక్ సెంటర్ ను ఏర్పాటు చేయలేని పరిస్థితిలో మీరు మీ ప్రభుత్వం ఉందని, ప్రమాదాలకు నిలయమైన పారిశ్రామిక ప్రాంతం కనీసం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఫిజియోథెరపీ కూడా ఏర్పాటు చేయకపోవడం మీ అభివృద్ధికి ఇదే నిదర్శనం, ఆసుపత్రికి కనీసం సూపరిండెంట్ను నియమించకుండా మీకు అనుకూలంగా ఉండే ప్రిన్సిపల్ ని బదిలీ చేయకుండా వారి ఇద్దరినీ ఎక్కడికి బదిలీ చేయకుండా మీకు అనుకూలంగా ఉన్నారని మీ వాళ్ళకి అందులో ఉద్యోగాలు పెట్టించుకుంటూ ఇతర నిరుద్యోగులను పట్టించుకువడం మర్చిపోయారు, ప్రయివేట్ అస్పత్రులను కాదు ప్రోత్సహించేది కాదు ప్రభుత్వ అందులో పారదర్శకంగా నాణ్యతమైన దాన్ని ప్రజలకు అందించండి ఉద్యోగ ఉపాధి అవకాశాలు నోటిఫికేషన్ ద్వారా నిర్వహించండి ఉద్యో ఉద్యోగాలు అంగట్లో సరుకులు లాగా మీకు తెలియకుండా మీ కింది వారే అమ్ముకోవడం గమనించండి కోల్సిటీని క్రైమ్ సిటీగా కాకుండా హెల్త్ సిటీగా మార్చాలని ఎమ్మెల్యే కి తెలియజేస్తున్నాం అని అన్నారు. ఈ ప్రాంత ప్రజలను జర్నలిస్టులను బెదిరిస్తే ఎవరు బెదురరని చైతన్యం కలిగిన ప్రాంతం మన పారిశ్రామిక ప్రాంతమని మీరు కూడా ఎన్నో సమస్యల మీద పోరాటం చేసి ఎన్నో అవంతరాలు ఎదుర్కొని జర్నలిస్టులు, ప్రజల ద్వారానే సభలకు ఎన్నికయ్యారని వారికి గుర్తు చేశారు. పోరాటాల పురిటి గడ్డ గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతం తోలు వస్తూనే ఉంటాయి పోతూనే ఉంటాయి ప్రజాప్రతినిధులు మారుతూనే ఉంటారు ప్రజలు మాత్రం ప్రజా ప్రతినిధులు చేస్తున్నటువంటి గమనిస్తూనే ఉంటారు, సరైన సమయం చూసి ఓట్ల ద్వారా సమాధానం చేప్తారు కానీ ఎవరికి భయపడరని హెచ్చరించారు. ప్రైవేట్ ఆస్పత్రులను ప్రోత్సహించకుండా ప్రైవేట్ ఆస్పత్రులు అనుమతి లేనివి అధికారులు తనిఖీలు చేసి సీజ్ చేయాలని దినేష్ హెచ్చరించారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల తుది జాబితా రెండు రోజులలో తయారు చేయాలి

- పాలకుర్తి, అంతర్గాం మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల ధృవీకరణ పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**పెద్దపల్లి ప్రతినిధి, మే 02** : ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల తుది జాబితా రెండు రోజులలో తయారు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పాలకుర్తి, అంతర్గాం మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల ధృవీకరణ పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మొదటి విడతల్లో పాలకుర్తి మండలానికి 594 , అంతర్గాం మండలానికి 512 ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం కేటాయించిందని, ఇందిరమ్మ కమిటీల నుంచి సేకరించిన ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాను అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు.రాబోయే రెండు రోజులలో ఇందిరమ్మ కమిటీలు అందించిన జాబితాను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు ప్రకారం అర్హులో కాదో తేల్చాలని, అనర్హులు ఎవరైనా ఉంటే జాబితా నుంచి తప్పనిసరిగా తొలగించాలని, 2 రోజులలో తుది లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని అన్నారు. మండలాల్లో తుది లబ్ధిదారుల జాబితా సిద్ధం చేస్తే జిల్లా ఇంచార్జి మంత్రి ఆమోదం తీసుకొని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, వీటిని త్వరగా గ్రౌండ్ చేసుకుంటే వర్షాకాలం లోపు నిర్మాణ పనులు ప్రారంభించవచ్చని అన్నారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు డైరెక్టర్ హౌసింగ్ రాజేశ్వర్, తాహాసిల్దార్ జ్యోతి, పంచాయతీ సెక్రటరీలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి వర్ధంతి వేడుకలు

**కరీంనగర్ టౌన్, మే 2:** రాజ బహదూర్ వెంకటరామిరెడ్డి 73 వ వర్ధంతి వేడుకలను కరీంనగర్ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నేడు కరీంనగర్ పట్టణంలోని ఎస్ఆర్ఆర్ కళాశాలకు ఎదురుగా ఉన్న వారి విగ్రహం వద్ద వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే ఉచ్చిడి మోహన్ రెడ్డి, మరియు రెడ్డి సంక్షేమ సంఘం బాధ్యులు, రెడ్డి కులస్తులు హాజరై వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి ఆశయాలు కొనసాగిద్దాం. రెడ్డిల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వుచ్చిడి మోహన్ రెడ్డి , కరీంనగర్ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం కార్యదర్శి బండ గోపాల్ రెడ్డిలు మాట్లాడుతూ రాజ బహదూర్ వెంకటరామిరెడ్డి 72వ వర్ధంతిని పురస్కరించుకొని నేడు వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగిందని అదేవిధంగా వారు పేద విద్యార్థుల కోసం విద్యాలయాలను స్థాపించి ఎంతోమందికి విద్యానందించారని వారి ఆశయసాధనలోనే భాగంగా ప్రస్తుతం కరీంనగర్ లో కూడ రాజ బహదూర్ వెంకటరామిరెడ్డి విద్యాసంస్థలు నెలకొల్పి రెడ్డి విద్యార్థులే కాకుండా ఇతర విద్యార్థులకు కూడా విద్యనందిస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా వారు నిజం కాలంలో కొత్వాల్‌గా కొలువు చేసినప్పుడే వారికి రాజా బహదూర్ అనే బిరుదు వచ్చిందని గుర్తు చేశారు. కార్యక్రమం అనంతరం సీతారాంపూర్ లో గల రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి బి.ఎడ్ కళాశాల యందు వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉచ్చిడి మోహన్ రెడ్డి, కరీంనగర్ జిల్లా రెడ్డి సంక్షేమం సంఘం అధ్యక్షులు జగ్గారెడ్డి, ప్రధాన కార్యదర్శి బండ గోపాల్ రెడ్డి, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి, రాజ బహదూర్ వెంకటరామిరెడ్డి బి.ఎడ్ కళాశాల కరస్పాండెంట్ బండ గోపాల్ రెడ్డి, సభ్యులు కేశవరెడ్డి,మహేశ్వర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, రాఘవరెడ్డి, రాధా కిషన్ రెడ్డి లక్ష్మారెడ్డి, రాజ బహదూర్ వెంకటరామిరెడ్డి బి.ఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ రెడ్డి, రెడ్డి కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో శ్రీ ఆదిశంకరాచార్య జయంతోత్సవం



**ధర్మపురి, మే 2, :** జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో శ్రీ జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్య జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయ అనుభంద దేవాలయం అయిన శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో గల శ్రీ ఆదిశంకరాచార్యుల వారికి మరియు శారదాదేవికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అష్టోత్తరం పూజ, మన్యసూక్తం, దుర్గా సూక్తం, పంచోపనిషత్ లతో అభిషేకం, హారతి మంత్రపుష్పం కార్యక్రమములు అత్యంత వైభవంగా నిర్వహించబడినవని ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ అధ్యక్షులు జక్కు రవీందర్, సభ్యులు కొమురవెల్లి పవన్ కుమార్, స్థంభంకాడి గణేష్, గుడ్ల రవీందర్, వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ, స్థానిక వేదపండితులు పనతుల వెంకటరమణ శర్మ, కాసర్ల వంశీ కృష్ణ, సూపరింటెండెంట్ కిరణ్ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు ద్యావల్ల విశ్వనాథ శర్మ, సాయికుమార్ అభిషేకం పురోహితులు బొజ్జ రాజగోపాల్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా చెన్నకేశ్వర స్వామి భక్తోత్సవం



**పెద్దపల్లి ప్రతినిధి, మే 2, :** పెద్దపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశ్వర స్వామి భక్తోత్సవం( కళ్యాణం) అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం చెరుకు మహేందర్ రెడ్డి పద్మజ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించే స్వామి వారి కల్యాణం వేదపండితులు కృష్ణమాచారి, సత్యనారాయణ , ఉపేందర్ ల మంత్రోచ్చారణల మధ్య అత్యంత కన్నుల పండుగగా జరిపించారు. హెూమ పూజ చేసిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మే 6న జాబ్ మేళా నిర్వహణ

**- జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు**

**పెద్దపల్లి ప్రతినిధి, మే 2:** జల్లాలోని నిరుద్యోగ యువకులకు కేఎల్ గ్రూప్ సర్వీసెస్ మేడ్చల్ లో ఉద్యోగాలు కల్పించుటకు మే 6న మంగళవారం రోజున రూమ్ నెంబర్ 225 నూతన కలెక్టర్ భవన సముదాయంలో గల జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై. తిరుపతి రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.కేఎల్ గ్రూప్ సర్వీసెస్ మేడ్చల్ సంస్థలో 50 వేర్ హౌసింగ్ అసోసియేట్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని, పోస్టులకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, వీరి వయస్సు 18-35 లోపు, ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు మే 6 న ఉదయం 11 గంటల సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో రూమ్ నెంబర్ . 225 నూతన కలెక్టర్ భవన సముదాయంలో, పెద్దకాల్వల పెద్దపల్లి మొదటి అంతస్థులో వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 6309518695, 7093172221, 7093172221, 709317222 8985336947,, నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ప్రకటనలో తెలిపారు.

## ఉపాది హామీ కూలీలకు వెంటనే డబ్బులు చెల్లించాలి:
## బిజెపి మండలాద్యక్షుడు సుగుర్తి జగదీశ్వర చారి



**తిమ్మాపూర్, మే 2,:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి శివారు పొగాకులపల్లి నుండి రామక్రిష్ణ కాలనీ వరకు జరుగుతున్న మట్టి రోడ్ ఉపాధి హామీ పనులను శుక్రవారం బిజెపి మండలాద్యక్షుడు సుగుర్తి జగదీశ్వర చారి కార్యకర్తలతో కలిసి పరిశీలించారు.మూడు వారాలుగా చేసిన పనులకు కూలీ డబ్బులు రావడం లేదని కూలీలు తెలపగా వెంటనే సంబందిత అధికారులతో మాట్లాడి కూలీలకు డబ్బులు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జగదీశ్వర చారి డిమాండ్ చేశారు. అనంతరం బీజేపీ కార్యకర్తలు కూలీలకు మజ్జిగ పాకెట్లను పంపిణీ చేసారు.కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, మండల కార్యదర్శి గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గొల్ల గణేష్, గుంటి శ్రీధర్, వేల్పుల ఓదయ్య, మోతే నారాయణ, దుర్గుంటి శేఖర్ రెడ్డి, సిద్ద శ్రీనివాస్, పాములగారి రాజ్ కుమార్, కామెర వెంకటేష్, నాంపెల్లి కొమురయ్య, నిమ్మనగొట్టు అంజయ్య,రామంచ నర్సయ్య, రాజయ్య, ఎలుకజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఆన్ వీల్స్‌ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి

**◆ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**



**ఇల్లంతకుంట, మే 2 ,:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతారంలో శుక్రవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి నిర్వహించిన ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ..... దూర ప్రాంతాల నుండి సమస్యలు నివేదించడం కోసం క్యాంపు కార్యాలయానికి వస్తున్నారని, అలా కాకుండా యాప్ ద్వారా సమస్యలు నివేదిస్తే వాటిని స్వీకరించి అధికారుల బృందంతో ఆ గ్రామానికి వెళ్లి ఆ సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఎమ్మెల్యే ఆన్ వీల్స్ ద్వారా ప్రజలకు వారానికి మూడు రోజులు అందుబాటులో ఉంటూ వారికి మరింత చేరువగా ఉంటానని కాబట్టి ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ఉద్దేశించిన కార్యక్రమంలో అధికారులంతా భాగస్వాములు కావాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించే ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమంలో విధిగా హజరు కావాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం తరఫున సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజల వద్దకే వచ్చి సమస్యలు పరిష్కరించడం గొప్ప విషయమని, దీంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని కలెక్టర్ కోరారు. గ్రామస్తుల కోరిక మేరకు అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిని పూర్తి చేసేందుకు 40లక్షలు, అనంతారంలో సీసీ రోడ్ల నిర్మాణానికి 25 లక్షలు మంజూరు చేస్తున్నట్టు కలెక్టర్ ప్రకటించారు.ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న క్షేత్ర స్థాయి సమస్యలను ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి గ్రామస్తులు తీసుకురాగా,వాటిని తక్షణమే ఎమ్మెల్యే కవ్వంపల్లి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిష్కరించారు. కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంలో మళ్లీ తిరిగి అసైన్ మెంట్ కమిటీల ద్వారా నిరుపేద ప్రజలకు భూమిని పంపిణీ చేసే సౌకర్యం ఉంటుందని,ఇందిరమ్మ ఇండ్లు, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, పెన్షన్, 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగానికి గ్యాస్ సబ్సిడీ, తదితర అంశాలపై ప్రజలు లేవనెత్తిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.కార్యక్రమంలో పంచాయతీ రాజ్ కార్యనిర్వాక ఇంజనీర్ సుదర్శన్ రెడ్డి, తహశీల్దార్ ఫారుక్, ఎంపీడీఓ శశికళ, సీఐ మొగిలి, ఎస్సై కదిరె శ్రీకాంత్ గౌడ్, ఎంపీఓ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి, మిషన్ భగీరథ రాంరెడ్డి మిషన్ భగీరథ గ్రిడ్ చందు, ఏ ఈ ఓ జ్యోతి ఏపీవో చంద్రయ్య, ఏ డి ఎం వాణి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు చంద్రకళ, సూర్యకళ, ఆరోగ్య విస్తరణ అధికారి బి.వి.ఆర్ ప్రసాద్ సిబ్బంది తారాభాయ్ కాంగ్రెస్ మండలాద్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, నాయకులు ఊట్కూరి వెంకటరమణారెడ్డి, గుడిసె ఐలయ్య యాదవ్, పసుల వెంకటి, ఐరెడ్డి మహేందర్ రెడ్డి,ఎలగందుల ప్రసాద్, కేశవరెడ్డి, రజనీకాంత్, సురేందర్ రెడ్డి, రాజేశం, సత్యారెడ్డి, బి లింగం, శ్రీనివాస్, పి వెంకటయ్య, శ్రీనివాస్ పుష్పలత నాగయ్య, చల్ల నారాయణ, ఆకుల సత్యం, ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టెక్నాలజీ లేనప్పుడు గోదావరి నీటిని రెండు పూటలా అందించిన ఘనత బిజెపి నాయకులదే



**ధర్మపురి, ఏప్రిల్ 2, :** ఏ టెక్నాలజీ లేనప్పుడు ధర్మపురి గోదావరి నీటిని రెండు పూటలా అందించిన ఘనత బిజెపి ప్రభుత్వ నాయకులకే దక్కుతుందని ధర్మపురి పట్టణాధ్యక్షుడు గాజు బాస్కర్ అన్నారు. ధర్మపురి బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో పట్టణ సమస్యలపై శుక్రవారం ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గాజుభాస్కర్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో పవిత్ర పుణ్యక్షేత్రం, దక్షిణ కాశిగా పేరుపొందిన ధర్మపురి ప్రజలకు త్రాగు నీటి సమస్యపై పరిష్కారానికి నోచుకోకపోవడం చాలా దురదృష్టకరం అని బాస్కర్ పేర్కొన్నారు. ధర్మపురి నియోజకవర్గ హెడ్ క్వార్టర్, మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రజలకు తలాపున గోదావరి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు త్రాగు నీటికై శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచన చేయని నాయకులెందరో చెప్పనక్కర్లేదని బాస్కర్ ఆవేదన వ్యక్తంచేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇలాగే మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేసి త్రాగునీరు విషయంలో పట్టణ ప్రజలకు సరైన న్యాయం చేయలేదని ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం బోర్లు వేసుకుంటూ పై పై పనులు మాత్రమే చేస్తుందని శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచన చేయడం లేదని ఈ సందర్భంగా బాస్కర్ ప్రశ్నించారు. గతంలో బిజెపి ధర్మపురి పట్టణంలో సర్పంచ్ గా రాధా కిషన్ ఏ టెక్నాలజీ లేనప్పుడు గోదావరి నీటిని ధర్మపురి పట్టణ ప్రజలకు రోజుకు రెండు పూటలా అందించిన విషయం గుర్తు చేశారు. ఇది పట్టణ ప్రజలందరికీ తెలిసిన విషయమే కానీ అప్పటి నుంచి ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా పట్టణ ప్రజలకు రెండు పూటల నీళ్లను అందించే శాశ్వత పరిష్కారం చేయలేక పోయిందని బిజెపి పట్టణాధ్యక్షుడు గాజు బాస్కర్ నాయకులకు, ప్రభుత్వాలకు ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలాగే ధర్మపురి మున్సిపాలిటీ టి.యు.ఎఫ్.ఐ.డి.సి నిధుల కింద 15 కోట్ల రూపాయల నిధులను కేవలం 7, 11 ,12 ,13, 14, 3, 4 వార్డుల్లో మాత్రమే అభివృద్ధి పేరుతో శిలాఫలకాలు పెట్టి ఇప్పటికీ పనులు ప్రారంభించలేదని బిజెపి పట్టణాధ్యక్షుడు బాస్కర్ గుర్తుచేశారు. ఈ వార్డుల్లో ప్రజలు మాత్రమే మీకు ఓట్లు వేశారా..? మిగతా వార్డులోని ప్రజలు ఓట్లు వేయలేదా అని ప్రశ్నించారు. పట్టణంలో ఏ వార్డులో చూసినా సమస్యలు ఉన్నాయని కొన్ని వార్డుల్లో మాత్రమే పనులు ప్రారంభించడం సరికాదని బాస్కర్ అన్నారు. పట్టణంలో 15 వార్డులో చాలా సమస్యలు ఉన్నాయని ఏ నాయుడు పట్టించుకున్న పాపాన పోలేదని బాస్కర్ ఆవేదన వ్యక్తంచేశారు. పట్టణములో మాతా శిశు ఆస్పిటల్ గత ప్రభుత్వం ప్రారంభించిందని కానీ ఇప్పటి ప్రభుత్వం సంవత్సరం గడుస్తున్నా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం లేదని 850 లక్షల రూపాయలతో నిర్మించిన ఈ మాతా శిశు హాస్పిటల్ ను ప్రజలకు ఎందుకు అందుబాటులోకి తెస్తాలేరని ధర్మపురి ప్రజల పక్షాన ధర్మపురి బిజెపి పట్టణ శాఖ ప్రశ్నిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజలకు ఇబ్బందులు కలగకముందే వెంటనే మాత శిశువు ఆస్పిటల్ ను ప్రారంభించి ప్రజలకు అందుబాటులో తెచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అమృత పథకం కింద రెండు కోట్ల రూపాయలు తాగునీటి సమస్య కోసం కేటాయించడం జరిగిందని సాక్షాత్తు మన ఎంపీ చెప్పడం జరిగింది. ఈ రెండు కోట్ల రూపాయలను తాగునీటికి ఏ విధంగా ఖర్చు చేశారో ఇప్పటికి చెప్పలేదని వాటిని ఏవిధంగా ఖర్చు చేస్తారో ప్రజలకు తెలుపాలని బిజెపి పక్షాన బాస్కర్ డిమాండ్ చేశారు. ధర్మపురి ఆలయ అభివృద్ధికి ఎంపీ నిధులు మంజూరు చేపిస్తా అన్నారు. ఇప్పటికీ మంజూరు చేయలేదని పట్టణాధ్యక్షుడు బాస్కర్ ప్రశ్నించారు.10 రోజుల్లో ధర్మపురి గౌట్ హాస్పిటల్ ఐ.సి.యు రూమ్ రూమ్ ప్రారంభిస్తామని మాట ఇచ్చిన ఎంపీ, ఎమ్మెల్యే ఇప్పటివరకు హాస్పిటల్ ల్లో ఐ.సి.యు ప్రారంభించలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు ఐదు లక్షల రూపాయలు మంజూరు చేస్తానని చెప్పి ఇప్పుడు కేవలం ఇండ్లకు 450 నుంచి 650 లోపు గజాలు ఉన్నవారికి మాత్రమే ఇండ్లు కేటాయిస్తామని చెప్పి ఇప్పుడు ఉన్న వారికి కూడా మంజూరు చేయకపోవడం చాలా బాధాకరం అని పేర్కొన్నారు. టెంపుల్ సిటీ క్రింద దేశంలో ఉన్న ముఖ్య ఆలయాలకు సెంట్రల్ గవర్నమెంట్ తీసుకువచ్చిన ప్రసాద స్కీం ద్వారా మన ధర్మపురి దేవాలయాన్ని డెవలప్మెంట్ చేయాల్సిందిగా భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ సిబ్బందికి మరియు దేవాలయ సిబ్బందికి గత పది నెలల నుంచి జీతాలు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, శుక్రవారం రోజు జీతం లేక మున్సిపల్ కార్మికుడు పులి భూమ రాజు వాటర్ ట్యాంక్ డ్రైవర్ 10 నెలల నుంచి జీతం లేక కుటుంబ పోషణ బారంగా మారి మనస్థాపానికి గురై ఈ రోజు గుండె నొప్పితో మరణించడం జరిగిందని గుర్తుచేశారు. మృతునికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారని మేము వారి కుటుంబం తరపున ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాము చనిపోయిన మున్సిపల్ కార్మికుని యొక్క కుటుంబం నుంచి ఎవరికో ఒకరికి మున్సిపల్ కార్యాలయంలో ఒక ఉద్యోగం కల్పించాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేశారు. దయచేసి స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ఇట్టి విషయంలో జోక్యం చేసుకొని మున్సిపల్ సిబ్బందికి న్యాయం చేయాలని ధర్మపురి భారతీయ జనతా పార్టీ తరపున విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. పైన తెలిపిన సమస్యలు అన్నిటికీ పరిష్కారం చూపి ధర్మపురి పట్టణ, మండల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కల్పించకుండా సమస్యలన్నీ పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు విజ్ఞప్తి చేశారు. మాజీ ముఖ్య మంత్రి బిఆరెస్ కేసీఆర్ వరంగల్ సమావేశంలో బిజెపి గురించి అనుచిత వాక్యాలు చేయడం సరికాదని దానిని భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నక్సలైట్ల కోసం కాగర్ కుబ్బింగ్ ఆపరేషన్ ఏదైతే మొదలుపెట్టిందో దాని ద్వారా నక్సలైట్ల ఏరివేతకు ఒక కంకణం కట్టుకుంది. దానిని కేసీఆర్ ఏదైతే విమర్శిస్తున్నాడో అది చాలా సిగ్గుమాలిన చర్యగా భావిస్తున్నామని వీరి వల్ల ఎంతో మంది జాతీయవాదులు, దేశభక్తులు, ఆర్ఎస్ఎస్, విహెచ్పి, బీజేపీ ఏబీవీపీ, నాయకులు, కార్యకర్తలు, అమాయకులైన ప్రజలు, పోలీసులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాజుభాస్కర్, మాజీ అధ్యక్షులు బెజ్జారపు లవాన్, తిరుమదాస్ సత్యనారాయణ, నరెడ్ల శంకర్, పోతంశెట్టి శేఖర్, రాయల రవికుమార్ సింధు, సంఘీ మాధవ్, మండలజీ సూరజ్, అనందాస్ నవీన్, అప్ప మల్లేష్, బాకీ అనిల్, బాకీ రాజేష్, కాశెట్టి శివసాయి, కాశెట్టి హరీష్, మరియు తదితరులు పాల్గొన్నారు.

## కప్పు కాఫీ.. తాగితే అమేజింగ్ అంతే.! వీళ్లు మాత్రం అస్సలు జోలికి వెళ్లొద్దు..



ప్రపంచవ్యాప్తంగా కాఫీ లవర్స్ చాలామందే ఉంటారని చెప్పడంలో అతిశయోక్తి లేదు. కొంతమందికి కాఫీ తాగనిదే రోజు గడవదు. అంతలా ఎడిక్ట్ అవుతారు. ఉదయాన్నే బెడ్ కాఫీ తాగితేనే గానీ తమ రోజు మొదలుపెట్టరు. అయితే కాఫీ లిమిట్‌గా తాగితే ఫర్వాలేదు. కాని అధిక మోతాదులో తీసుకుంటేనే అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా ఈ వ్యాధులు ఉన్నవారు కాఫీని అస్సలు తాగకూడదు. మీరు మైగ్రేన్ సమస్యతో బాధపడుతుంటే.. అస్సలు కాఫీ తాగొద్దు. కాఫీలో కెఫిన్ శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది మెదడు నరాలపై ప్రభావం చూపిస్తుంది. అలాగే రక్త ప్రసరణ కూడా మందగిస్తుంది. అధిక మొత్తంలో కెఫిన్ శరీరంలోకి చేరితే.. మైగ్రేన్ మరింత ఎక్కువ అయ్యే అవకాశం ఉంటుంది. మీకు హై-బీపీ ఉన్నట్లయితే.. కాఫీ తాగకండి. కాఫీ తాగడం వల్ల రక్తపోటు స్థాయి మరింతగా పెరుగుతుంది. దాని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. అలాగే కాఫీ తాగడం వల్ల ఒత్తిడి పెరుగుతుంది. దీంతో బీపీలో హెచ్చుతగ్గులు ఉండొచ్చు. డయాబెటిక్ పేషెంట్లు కాఫీ తాగడం మానేయాలని చాలామంది ఆరోగ్య నిపుణులు అంటున్నారు. కాఫీ తాగడం వల్ల డయాబెటిక్ రోగులకు అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం ఉంది. రక్తంలో చక్కెర స్థాయి అసమతుల్యంగా ఉన్నవారు కూడా కాఫీ తాగకూడదు. గర్భధారణ సమయంలో కాఫీ తాగడం మంచిది కాదు. కాఫీలో ఉండే కెఫిన్ శాతం మీ శరీరంలోని రక్త ప్రసరణను ప్రభావితం చేస్తుంది. దీని వల్ల కడుపులో పెరుగుతున్న పిండానికి రక్తం సరఫరాలో అసమతుల్యత ఏర్పడుతుంది. ఒకవేళ మీకు ఒత్తిడిని ఎదురుకుంటున్నట్లయితే.. కాఫీ గురించి అస్సలు ఆలోచించొద్దు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, కాఫీని ఎక్కువగా తాగడం వల్ల శరీరంలో కార్టిసోల్ హార్మోన్‌పై అధిక ప్రభావం పడుతుంది. ఇది ఒత్తిడిని మరింత ఎక్కువ చేస్తుంది. కాగా, ఈ వార్త కేవలం పలు అధ్యయనాలు, వైద్య నిపుణుల రీసెర్చ్ ఆర్టికల్స్ ఆధారంగా ప్రచురించింది మాత్రమే. మీరు ఏదైనా డైట్ ఫాలో కావాలన్నా.. డాక్టర్ సలహా కచ్చితంగా తీసుకోండి.

# స్పోర్ట్స్

# ఏడో విజయంతో టాప్ ప్లేస్‌కు ముంబై



ముంబై ఇండియన్స్ కంబ్యాక్ అద్భుతంగా సాగుతోంది. వరుసగా ఆరో విజయంతో ఈ సీజన్ ను షేక్ చేసింది. గురువారం జైపూర్ వేదికగా జరిగిన మ్యాచ్ లో సరిగ్గా 100 పరుగులతో ఆతిథ్య రాజస్థాన్ రాయల్స్ పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్లకు 217 పరుగులు చేసింది. ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ విధ్వంసకర ఫిఫ్టీ (38 బంతుల్లో 61, 7 ఫోర్లు, 3 సిక్సర్లు) సాధించాడు. అనంతరం ఛేదనలో రాయల్స్.. 16.1 ఓవర్లలో 117 పరుగులకు ఆలౌటైంది. పేసర్ జోఫ్రా ఆర్చర్ (27 బంతుల్లో 30, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) చివర్లో బౌండరీలు బాది, టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో ఇంపాక్ట్ ప్లేయర్ కర్ణ్ శర్మ, ట్రెంట్ బౌల్ట్ లకు మూడేసి వికెట్లతో సత్తా చాటారు. ఇక టోర్నీలో 8వ పరాజయంతో రాయల్స్ ఈ సీజన్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. ఏడో విజయంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ముంబై చేరుకుంది. బ్యాటింగ్ కు స్వర్గధామం లాంటి ఈ వికెట్ పై ఓపెనర్లు రెచ్చి పోయారు. రెండో ఓవర్లలోనే రివ్యూతో బతికి పోయిన రోహిత్ శర్మ (36 బంతుల్లో 53, 9 ఫోర్లు) సత్తా చాటాడు. అతనికి రికెల్టన్ తోడవడంతో ముంబై స్కోరు బోర్డు వేగంగా సాగింది. వీరిద్దరూ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఓవర్ కి పది పరుగుల రన్ రేట్ తో రన్స్ సాధించారు. పవర్ ప్లేలో 58 పరుగులు చేసిన ముంబై.. ఆ తర్వాత ఓపెనర్లు మరింతగా రెచ్చిపోవడంతో వేగంగా పరుగులు సాధించింది. ఈ నేపథ్యంలో 29 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న రికెల్టన్.. ఆ తర్వాత కాసేపటికే ఔటయ్యాడు. దీంతో 116 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత 31 బంతుల్లో రోహిత్ ఫిఫ్టీ పూర్తి చేసుకుని, పెవిలియన్ కు చేరాడు. ఆ తర్వాత వచ్చిన సూర్య కుమార్ యాదవ్, కెప్టెన్ హార్దిక్ పాండ్యా చెరో 48 పరుగులను సాధించి, జట్టుకు భారీ స్కోరు అందించారు.వీరద్దరూ అబేధ్యమైన మూడో వికెట్ కు 94 పరుగులు జోడించారు. బౌలర్లలో తీక్షణ, రియాన్ పరాగ్ కు చెరో వికెట్ దక్కింది. గత మ్యాచ్ లో 210 పరగులను అలవోకగా ఛేదించిన రాయల్స్.. ఈ మ్యాచ్ లో మాత్రం తేలిపోయింది. ముఖ్యంగా బ్యాటర్లు వచ్చిన వాళ్లు, వచ్చినట్లు వెనుదిరగడంతో ఘోర పరాజయం పాలైంది. గత మ్యాచ్ లో సెంచరీ హీరో వైభవ్ సూర్యవంశీ డకౌట్ గా వెనుదిరగడంతో వికెట్ల పతనం ప్రారంభమైంది. మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ (13), నితీశ్ రాణా (9), కెప్టెన్ పరాగ్ (16), ధ్రువ్ జురెల్ (11), షిమ్రాన్ హిట్ మెయర్ డకౌట్ గా అయ్యి నిరాశ పర్చారు. ఇంపాక్ట్ ప్లేయర్ గా వచ్చిన శుభమ్ దూబే (15) ఆకట్టుకోలేకపోయాడు. అయితే చివర్లో జోఫ్రా ఆర్చర్ బౌండరీలు బాదడంతో రాయల్స్ వంద పరుగుల మార్కును దాటింది. మిగతా బౌలర్లలో జస్ ప్రీత్ బుమ్రాకు రెండు వికెట్లు దక్కాయి. ఈ విజయంతో వరుసగా ఆరో విజయంతో ముంబై దుమ్ము రేపింది. ఓవరాల్ గా ఈ సీజన్ లో ఏడో విజయంతో టాప్ ప్లేస్ కు చేరుకుంది.



## రివ్యూతో బతికి పోయిన రోహిత్

ముంబై ఇండియన్స్ కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన పని గురించి సోషల్ మీడియాలో రచ్చ జరుగుతోంది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో తను ఆఖరి క్షణంలో రివ్యూ తీసుకుని అందరినీ ఆశ్చర్యానికి గురి చేశాడు. ఆ రివ్యూ ఫలితం తనకు అనుకూలంగా రావడంతో క్రికెట్ ప్రేమికుల మనసుల్లో ఎన్నో ప్రశ్నలకు లేవనెత్తుతోంది. ఆఫ్గానిస్థాన్ బౌలర్ ఫజల్ హఖ్ ఫరూఖీ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్ ఐదో బంతిని రోహిత్ ఆడగా, షాట్ మిస్సయ్యి ఆ బంతి అతని కుడి కాలికి తాకింది. దీనిపై అప్పీల్ చేయగా, అంపైర్ వెంటనే ఔటిచ్చాడు. అయితే ఎల్బీపై రివ్యూ కోసం రోహిత్ చాలా సేపు ఆలోచించి, తాత్సారం చేశాడు. అయితే మరో సెకన్లో టైమర్ ముగుస్తుందనగా, అతను రివ్యూ తీసుకున్నాడు. దీనిని థర్డ్ అంపైర్ పరిశీలించగా, బంతి లెగ్ వికెట్ ఆవతల పిచ్ అయినట్లు తేలింది. దీంతో రోహిత్ బతికి పోయాడు. ఈ మ్యాచ్ లో స్టన్నింగ్ అర్ధ సెంచరీ చేసిన హిట్ మ్యాన్ జట్టు భారీ స్కోరు సాధించేందుకు తన వంతు సాయం చేశాడు. ఇక రోహిత్ రివ్యూపై సోషల్ మీడియాలో మిశ్రమ స్పందన కనిపిస్తోంది. చాలామంది తమకు తోచిన కామెంట్లు చస్తూ, లైకులు, షేర్లతో వీడియోను వైరల్ చేస్తున్నారు. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ముంబైకి బ్యాటర్లు అద్భుతమైన స్టార్ట్ నిచ్చారు. ముఖ్యంగా ఓపెనర్లు ర్యాన్ రికెల్టన్ (38 బంతుల్లో 61, 7 ఫోర్లు, 3 సిక్సర్లు), రోహిత్ (36 బంతుల్లో 53, 9 ఫోర్లు)తో సత్తా చాటారు. వీరిద్దరూ ఆతిథ్య బౌలర్లను చితక్కొట్టారు. దీంతో పవర్ ప్లేలోనే 58 పరుగులు వచ్చాయి. ఆ తర్వాత కూడా వీరిద్దరూ జోరు కొనసాగించడంతో బౌండరీల వర్షం కురిసింది. ముందుగా రికెల్టన్ 29 బంతుల్లో ఫిఫ్టీ బాదాడు. ఆ తర్వాత రోహిత్ 31 బంతుల్లోనే అర్థ సెంచరీ చేసుకున్నాడు. ఫస్ట్ రికెల్టన్ ఔట్ కావడంతో 116 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత కాసేపటికే రోహిత్ కూడా పెవిలియన్ కు చేరాడు. సెట్ అయిన బ్యాటర్లు ఇద్దరు ఒకేసారి ఔట్ కావడంతో ముంబై కాస్త వెనుకడుగు వేసినట్లు అనిపించింది. అయితే నాలుగో నెంబర్లో సర్ప్రయిజ్ గా హార్దిక్ బ్యాటింగ్ దిగి, సత్తా చాటాడు. వీరిద్దరూ మెరుపు బ్యాటింగ్ చేయడంతో ముంబై భారీ స్కోరు చేసింది. వీరిద్దరూ సరిగ్గా చెరో 23 బంతులాడి సరిగ్గా 48 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచారు. ఇందులో సూర్య 4 ఫోర్లు, 3 సిక్సర్లు బాదగా, హార్దిక్ మాత్రం 6 ఫోర్లు, 1 సిక్సర్ బాదాడు. దీంతో ముంబై 215ం పరుగులు మార్కును దాటింది.

## కోహ్లి నన్ను పట్టించుకోలే.. అందుకే ఆర్సీబీని ఉతికారేశా!

### సూర్యకుమార్ యాదవ్

ఐపీఎల్ 2025లో ముంబై ఇండియన్స్ తరఫున సూర్యకుమార్ యాదవ్ మంచిగానే రాణిస్తూ జట్టు విజయాల్లో తనవంతు కీలక పాత్ర పోషిస్తున్నాడు. తాజాగా రాజస్థాన్ రాయల్స్ తో జరిగిన మ్యాచులోనూ అదిరే ప్రదర్శన చేశాడు. 23 బంతుల్లో 4ఐ4, 3ఐ6 సాయంతో 48 నాటౌట్ పరుగులు చేశాడు. అయితే ఈ మ్యాచుకు ముందుకు తాను ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితిని చెప్పుకొచ్చాడు సూర్యకుమార్ యాదవ్. 2020-21 ఆస్ట్రేలియా పరిమిత ఓవర్ల పర్యటనకు తనను ఎంపిక చేయకపోవడం ఎంతగానో బాధించిందని అన్నాడు. అయితే ఈ పరిణామం.. తాను ఐపీఎల్‌లో అత్యంత చిరస్మరణీయ ఇన్నింగ్స్‌లు ఆడేందుకు ప్రేరణగా నిలిచిందని పేర్కొన్నాడు. అబుదాబిలో ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో 43 బంతుల్లో 79 పరుగులు చేసిన సూర్య.. ఆ మ్యాచులో ముంబై ఇండియన్స్‌కు ఐదు వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందించాడు. దీని గురించి సూర్య మాట్లాడుతూ.. "అది ఎమోషనల్ నాక్. ఎందుకంటే మ్యాచ్‌కు కొద్ది రోజుల ముందు ఆస్ట్రేలియా పర్యటనకు జట్టును అనౌన్స్ చేశారు. ఈ టూర్ కోసం ఎన్నో ఏళ్లుగా సిద్ధమయ్యాను. దేశవాళీ సీజన్, ఐపీఎల్ కూడా బానే ఆడాను. కరోనా విరామ సమయంలో ఫిట్‌నెస్, మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాను. కచ్చితంగా టీ20 జట్టులో నాకు చోటు దక్కుతుందని భావించాను. నా చుట్టూ ఉన్న ఆటగాళ్లు, విదేశీ క్రికెటర్లు కూడా నేను ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్తాననే అనుకున్నారు. మానసికంగా నేను కూడా విమానంలో ఉన్నట్లు అనిపించింది. కానీ నేను సెలక్ట్ అవ్వలేదు. అది నన్ను ఎంతగానో బాధించింది. ఎక్కడ తప్పు జరిగిందో నాకు అర్థం కాలేదు." "దీంతో ఎవరితోనూ మాట్లాడలేదు. కొన్ని రోజులు విరామం తీసుకున్నాను. 2-3 రోజుల పాటు అదే ఆలోచించా. ప్రాక్టీస్ కూడా చేయలేదు. ఆ తర్వాత మళ్లీ మైదానంలోకి వెళ్లాను. అప్పుడు మహేల జయవర్ధనె, జహీర్ ఖాన్ కూడా నా పరిస్థితిని గమనించారు. ఆ తర్వాత కీరన్ పోలార్డ్ నా దగ్గరికి వచ్చాడు. ఆర్సీబీ మ్యాచ్‌కు ముందు వచ్చి ఇలా అన్నాడు. 'నాకు తెలిసి ఇదే సరైన వేదిక. భారత్ కెప్టెన్ కోహ్లి కూడా ప్రత్యర్థి జట్టులోనే ఉన్నాడు. నీ స్థానం ఏంటో నిరూపించుకునేందుకు ఇదే సరైన సమయం' అని అన్నాడు." అని సూర్య వివరించాడు.

## సాయి సుదర్శన్‌ను జట్టులోకి తీసుకోవాలి

### భారత మాజీ క్రికెటర్, మాజీ హెడ్ కోచ్ రవి శాస్త్రి

గుజరాత్ టైటన్స్ స్టార్ సాయి సుదర్శన్ ఐపీఎల్ 2025లో బ్యాట్‌తో అద్భుత ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకుంటున్న నేపథ్యంలో, భారత మాజీ క్రికెటర్ మరియు మాజీ హెడ్ కోచ్ రవి శాస్త్రి ఆయనను ఇంగ్లాండ్ పర్యటనకు భారత జట్టులో ఎంపిక చేయాలని సూచించారు. సాయి సుదర్శన్ మొదటినుండి ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో తన సామర్థ్యాన్ని నిరూపించుకుంటూ వస్తున్నాడు. ఇండియా 'ఎ' తరఫున పలు టూర్‌లలో ప్రదర్శన చూపించిన ఈ ఎడమచేతి బ్యాట్స్‌మన్, 2024-25 బార్డర్-గావాస్కర్ సిరీస్ తొలి టెస్ట్‌కి శుభ్‌మన్ గిల్ గాయం కారణంగా ఎంపిక అవుతాడని ఊహించబడినప్పటికీ, ఆ సమయానికి సెలక్టర్లు దేవ్‌దత్ పదిక్కల్‌ను ఎంపిక చేశారు.ప్రస్తుతం 23 ఏళ్ల సాయి, గుజరాత్ టైటన్స్ తరఫున ఐపీఎల్ 2025లో 9 మ్యాచ్‌లలో 456 పరుగులు చేశాడు. అంతేకాకుండా, ఇంగ్లాండ్‌లో సరీ తరఫున కౌంటీ క్రికెట్‌లో కూడా అనుభవం సంపాదించాడు. సరీ తరఫున 5 మ్యాచ్‌ల్లో ఒక సెంచరీ, ఒక హాఫ్ సెంచరీతో మొత్తం 281 పరుగులు చేశాడు. ఈ అనుభవం ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌కు అతన్ని మంచి అభ్యర్థిగా నిలబెడుతోంది.రవి శాస్త్రి ఐసీసీ రివ్యూలో మాట్లాడుతూ, "ఈ యువకుడిని నేను అన్ని ఫార్మాట్లలో చూడగలగాలని ఆశిస్తున్నాను. అతడి టెక్నిక్, ఎడమచేతి ఆటగాడిగా ఇంగ్లాండ్‌లో అతడి అనుభవం ఇవన్నీ చూస్తుంటే అతను నా జాబితాలో అగ్రస్థానంలో ఉంటాడు," అన్నారు.2025-27 వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగంగా జూన్ నుంచి ఆగస్ట్ వరకు జరగనున్న ఇంగ్లాండ్ పర్యటనలో భారత్ ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. రవి శాస్త్రి, భారత జట్టులో ఎడమచేతి పేసర్ అవసరం ఉందని కూడా అభిప్రాయపడ్డారు. కెంట్ తరఫున కౌంటీ క్రికెట్ ఆడిన అర్షదీప్ సింగ్‌ను ఈ నేపథ్యంలో మంచి ఎంపికగా పరిగణించారు."నాకు ఒక ఎడమచేతి పేసర్ అవసరమవుతుంది. ఎవరైనా సరే, మంచి ఫార్మ్‌లో ఉన్న ఎడమచేతి బౌలర్‌ను జట్టులోకి తీసుకురావాలి. అర్షదీప్‌ను 'వైట్ బాల్ స్పెషలిస్ట్' అనే నిర్ణయం నాకిష్టం లేదు," అని శాస్త్రి వ్యాఖ్యానించారు. ఖలీల్ అహ్మద్ కూడా బాగా బౌలింగ్ చేస్తున్నాడని చెప్పారు. ఇంగ్లాండ్‌లో భారత్ చివరిసారి టెస్ట్ సిరీస్‌ను 2007లో ద్రావిడ్ నేతృత్వంలో గెలిచింది. ఇటీవల జరిగిన ఇంగ్లాండ్ పర్యటన 2-2తో ముగిసింది.



## మళ్ళీ క్రికెట్ లో అడుగుపెట్టనున్న కపిల్ దేవ్!!

భారత క్రికెట్‌కు మరోసారి గర్వకారణమైన ఘట్టం ఎదురైంది. ఈసారి కొత్త రూపంలో 1983 ప్రపంచకప్ విజేత కెప్టెన్ కపిల్ దేవ్ తిరిగి క్రికెట్ ప్రపంచంలోకి అడుగుపెట్టనున్నారు. ఆయన రాబోయే %ు%20 ముంబై లీగ్ 2025 సీజన్ కోసం సోబో ముంబై ఫాల్కన్స్ జట్టుకు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. టోర్నమెంట్ ప్రారంభానికి కొన్ని వారాల ముందే ఈ ప్రకటన అధికారికంగా వెలువడింది. ప్రపంచ క్రికెట్‌లో గొప్ప ఆల్‌రౌండర్లలో ఒకరిగా పేరు పొందిన కపిల్ దేవ్, ఇప్పుడు తన అనుభవాన్ని, ప్రభావాన్ని ముంబై క్రికెట్‌కు అందించబోతున్నారు.ఈ సందర్భంగా కపిల్ దేవ్ మాట్లాడుతూ, "సోబో ముంబై ఫాల్కన్స్ తమ తొలి ప్రయాణాన్ని ప్రారంభించినప్పుడు వారితో కలిసి ఉండటం నాకు గౌరవంగా ఉంది" అంటూ భావోద్వేగంగా స్పందించారు. సోబో ముంబై ఫాల్కన్స్ యజమాని అమీత్ హెచ్ గధోక్ కూడా ఈ విషయంపై స్పందిస్తూ, కపిల్ దేవ్ జట్టులో చేరటం వల్ల వారి జట్టుకు గొప్ప ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. "అతని అద్భుతమైన వారసత్వం, అపారమైన అనుభవం జట్టుకు మార్గనిర్దేశక శక్తిగా మారుతాయి" అని పేర్కొన్నారు. 20 ముంబై లీగ్ మూడవ ఎడిషన్ ఈ నెల మే 26 నుంచి ప్రారంభమై జూన్ 8 వరకు ముంబైలోని ప్రఖ్యాత వాంఖడే స్టేడియం లో జరగనుంది. ఈ టోర్నమెంట్‌లో ఎనిమిది జట్లు మొత్తం 20 మ్యాచ్‌లలో తలపడనున్నాయి. ఇప్పటికే రోహిత్ శర్మను ఈ లీగ్‌కు బ్రాండ్ ఫేస్‌గా ఎంపిక చేయగా, సూర్యకుమార్ యాదవ్, అజింక్య రహానే, శార్దూల్ ఠాకూర్, శివం దుబే, పృథ్వీ షా వంటి భారత క్రికెట్ స్టార్ ప్లేయర్లు లీగ్‌ను మరింత రంజకంగా మార్చనున్నారు. ఈ టోర్నమెంట్ మొత్తం జియో హాట్‌స్టార్, స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్షంగా ప్రసారమవుతుంది. దేశవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులందరికీ ఇది ఒక క్రికెట్ పండుగగా మారనుంది.

## గర్ల్ ఫ్రెండ్‌ను పరిచయం చేసిన ధావన్





భారత మాజీ విధ్వంసక ఓపెనర్ శిఖర్ ధావన్ తన ప్రేయసిని లోకానికి పరిచయం చేశాడు. ఐర్లాండ్ కు చెందిన సోఫీ షైన్ తన గర్ల్ ఫ్రెండ్ అని తాజాగా ఒక పోస్టులో ఆమెతో కలిసి ఉన్న ఫోటోను షేర్ చేశాడు. దాని కింద మైలవ్ అని రాశాడు. దీంతో వీరిద్దరి మధ్య ఉన్న ఊహాగానాలకు చెక్ పడింది. గత చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా సోఫీతో కలిసి ధావన్ చమక్కుమన్నాడు. దీంతో ఆమె ఒక్క సారిగా టాక్ ఆఫ్ ద టౌన్ అయింది. ఆమె ఎవరా..? అని చాలామంది సెర్చ్ చేశారు. ఐర్లాండ్ కు చెందిన వ్యక్తి అని అప్పట్లోనే చాలామంది కనిపెట్టేశారు. అయితే దీనిపై ఇప్పటివరకు ధావన్ ఎలాంటి సమాధానం చెప్పలేదు. ఇటీవల జరిగిన ఒక ఇంటర్వ్యూలో కూడా ఇదే విషయంపై ఒక ప్రశ్న ఎదురుకాగా, తెలివిగా ఆన్సర్ చెప్పిన ధావన్ సోఫీ గురించి వెల్లడించలేదు. తన రూంలో ఉన్న అత్యంత అందమైన వ్యక్తి తన గర్ల్ ఫ్రెండేనని చెప్పాడు. అయితే ఆమె పేరును వెల్లడించలేదు. అయితే తాజాగా తన గర్ల్ ఫ్రెండ్ గురించి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ప్రపంచానికి చాటేలా చేశాడు. గత చాంపియన్స్ ట్రోఫీకి ఐసీసీ తరఫున అంబాసిడర్ గా నియామకమైన ధావన్.. దుబాయ్ లో ఉన్న భారత జట్టును కలుసుకునేందుకు వచ్చాడు. అప్పట్లో సోఫీ తళుక్కుమనగా, మిస్టరీ వుమెన్ అని ఆమె గురించి చాలా చర్చ జరిగింది. అప్పటి నుంచి దీనిపై ధావన్ సైలెంట్ గానే ఉన్నాడు. అయితే తాజాగా సోషల్ మీడియాలో పోస్టుతో దీనిపై ధావన్ క్లారిటీ ఇచ్చాడు. దీనిపై అటు సోఫీతోపాటు ఇటు క్రికెటర్ యజ్వేంద్ర చాహల్ కూడా లైకిచ్చాడు. ఇక సోఫీ షైన్ కు ఇన్‌స్టాగ్రామ్‌లో 134%ఖ% ఫాలోవర్లు ఉండగా, లింక్డ్ఇన్ ప్రొఫైల్ ప్రకారం ఆమె 2018 నుండి నార్తర్న్ ట్రస్ట్ కార్పొరేషన్‌లో పని చేస్తోంది. ప్రస్తుతం ప్రొడక్ట్ కన్సల్టేషన్‌లో సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తోంది. ఆమె ఐర్లాండ్‌లోని లిమెరిక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి మార్కెటింగ్ అండ్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీని పూర్తి చేసింది. కాజిల్‌రాయ్ కాలేజీలో కూడా విద్యాభ్యాసం చేసింది. శిఖర్ ధావన్ 2012లో ఆస్ట్రేలియాలో నివసిస్తున్న ఆయేషాను వివాహం జరిగింది. 2023 అక్టోబర్‌లో ఢిల్లీ హైకోర్టు ధావన్- ఆయేషాకు విడాకులు మంజూరు చేసింది. ఈ జంటకు 2024లో కుమారుడు జోరావర్ పుట్టాడు. ధావన్ ఆగస్టు 2024లో అన్ని రకాల ప్రొఫెషనల్ క్రికెట్ నుండి రిటైర్మెంట్ అనౌన్స్ చేశాడు. అతను చివరిసారిగా 2024లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (%ఖూా%)లో బరిలోకి దిగాడు. ఇండియా తరఫున చివరిగా డిసెంబర్ 2022లో బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డేలో ప్రాతినిధ్యం వహించాడు. తాజా పోస్టుతో ధావన్ ఫ్యూచర్ పై అతని అభిమానులు అల్ ది బెస్టు చెబుతున్నారు.

# విశ్వజి



## ఎండాకాలంలో జుట్టుకు ఆయిల్ రాయాలా వద్దా?

### నిపుణులు ఏమంటున్నారో తెలుసా..

ఈ రోజుల్లో చాలామందిని వేధించే సమస్యల్లో జుట్టు రాలడం ఒకటి. దీనికి అనేక కారణాలు ఉండవచ్చు. అయితే జుట్టుకి ఆయిల్ పెడితే వెంట్రుకలు ఊడిపోవు బలంగా ఉంటాయని తరచుగా పెద్దలు,నిపుణులు చెబుతుండటం మనం చూస్తుంటాం. వాస్తవానికి జుట్టుకు నూనె రాయడం వల్ల చాలా ఉపయోగాలే ఉంటాయి. అయితే ఎండాకాలంలో చాలామంది జుట్టుకు ఆయిల్ రాసుకోరు. సమ్మర్ లో చెమట, దుమ్ము, కాలుష్యం వల్ల జుట్టు జిడ్డుగా మారడం, నిర్జీవంగా తయారవడం, చిట్లడం వంటి సమస్యలు సాధారంగా వస్తుంటాయి. దుమ్ము,ధూళి, మట్టి సలుభంగా అంటుకుంటాయి. దీంతో ఆయిల్ రాయాలా వద్దా అనే సందేహం చాలామంది సందేహిస్తుంటారు. సమ్మర్ లో జుట్టుకి ఆయిల్ రాయాలా? వద్దా? వాస్తవానికి ఏ కాలమైనా సరే మీ జుట్టుకు నూనె రాయడం చాలా ముఖ్యం. ముఖ్యంగా వేసవిలో ఇది మరింత అవసరం అని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఎండ తాపానికి మీ జుట్టు బలహీనంగా మారుతుంది. అధిక చెమట,తేమ జుట్టు కుదుళ్లను బలహీనపరుస్తాయి. దీనికి తోడు సూర్య కిరణాల తాకిడి వల్ల జుట్టు పొడిబారి తన సహజత్వాన్ని కోల్పోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆయిల్ రాయడం జుట్టుకి ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది. ఆయిల్ రాయడం వల్ల కలిగే ప్రయోజనాలు బలాన్నిస్తుంది నూనె మీ జుట్టు కుదుళ్లకు పోషణను అందించి..వాటిని బలంగా చేస్తుంది. తద్వారా జుట్టు రాలడం తగ్గుతుంది. మెరుపునిస్తుంది నెత్తికి ఆయిల్ రాయడం వల్ల మీ జుట్టు పొడిబారకుండా ఉంటుంది. ఇది జుట్టుకు సహజమైన మెరుపును అందించి ఆరోగ్యంగా కనిపించేలా చేస్తుంది. మృదుత్వాన్నిస్తుంది ఎండాకాంలో గరుకుగా మారిన జుట్టును ఆయిల్ మృదువుగా చేస్తుంది. దువ్వెనతో సులభంగా దువ్వుకోవడానికి సహాయపడుతుంది. పెరుగుదలను ప్రోత్సహిస్తుంది సరైన నూనెతో మర్దన చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఇది జుట్టు పెరుగుదలకు తోడ్పడుతుంది. హాని నుండి రక్షిస్తుంది ఆయిల్ ఒక పొరలా ఏర్పడి, దుమ్ము, కాలుష్యం, సూర్యకిరణాల యొక్క హానికరమైన ప్రభావాల నుండి మీ జుట్టును కాపాడుతుంది. ఏ ఆయిల్ మంచిది సమ్మర్ లో కొబ్బరి నూనె,ఆలివ్ ఆయిల్,విటమిన్ %జ% తో నిండి ఉండే బాదం నూనె జుట్టును మరింత ఆరోగ్యంగా ఉంచుందని..సమ్మర్ లో ఈ మూడింటిలో ఒకదాన్ని మీ జుట్టు రకాన్ని బట్టి ఎంచుకోవాలని నిపుణులు సూచించారు.

## ఈ కూల్ డ్రింక్స్ తాగితే గుండెకు ముప్పు.. ఇక డాక్టర్స్ కూడా కాపాడలేరు!



వేసవి వచ్చిందంటే చాలు.. గొంతు తడారిపోకుండా, శరీరం చల్లబడాలని చాలా మంది ముందుగా వెతుక్కునేది కూల్ డ్రింక్స్ (శీతల పానీయాలు) కోసమే. క్షణాల్లో ఇవి ఇచ్చే తక్షణ ఉపశమనం మనల్ని ఎంతగానో ఆకట్టుకుంటుంది. పార్టీలైనా, సినిమాలైనా, స్నేహితులతో కబుర్లైనా.. పక్కన ఓ కూల్ డ్రింక్ బాటిల్ ఉండాల్సిందే అన్నంతగా ఇవి మన జీవనశైలిలో భాగమైపోయాయి. కానీ.. ఇవి మన ఆరోగ్యానికి, ముఖ్యంగా మన గుండెకు మంచివేనా? ఈ శీతల పానీయాల వెనుక దాగి ఉన్న ప్రమాదం ఏమిటి? శీతల పానీయాల్లో అసలు సమస్య ఏమిటి? కూల్ డ్రింక్స్ రుచిగా ఉండటానికి ప్రధాన కారణం వాటిలో ఉండే అధిక మొత్తంలో చక్కెర మరియు కార్బోనేషన్. ఒక్క మీడియం సైజ్ కూల్ డ్రింక్ బాటిల్‌లో దాదాపు 7 నుండి 10 టీస్పూన్ల వరకు చక్కెర ఉండవచ్చంటే మీరు నమ్మగలరా? ఇది మనం ఒక రోజులో తీసుకోవాల్సిన చక్కెర పరిమాణం కంటే చాలా రెట్లు ఎక్కువ. ఈ అదనపు చక్కెర , ఖాళీ కేలరీలు . ఇవి కేవలం శక్తినిచ్చేవి, పోషకాలు లేనివి. కనుక ఇది మన శరీరంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపుతాయి. గుండెపై ఎలా ప్రభావం చూపుతాయి? బరువు పెరగడం , ఊబకాయం: కూల్ డ్రింక్స్ ద్వారా శరీరంలో చేరే అదనపు చక్కెర సులభంగా కొవ్వుగా మారుతుంది. ఇది త్వరగా బరువు పెరగడానికి, చివరికి ఊబకాయానికి దారితీస్తుంది. ఊబకాయం అనేది గుండె జబ్బులకు ప్రధాన కారణాలలో ఒకటి. మధుమేహం (డయాబెటిస్) ప్రమాదం: అధిక చక్కెర తీసుకోవడం ఇన్సులిన్ నిరోధకతను పెంచుతుంది, ఇది టైప్ 2 మధుమేహం అభివృద్ధికి దారితీస్తుంది. మధుమేహం రక్తనాళాలను దెబ్బతీస్తుంది, గుండెపోటు, పక్షవాతం (స్ట్రోక్) ప్రమాదాన్ని పెంచుతుంది. అధిక రక్తపోటు , కొలెస్ట్రాల్: కొన్ని అధ్యయనాలు అధికంగా శీతల పానీయాలు తాగేవారిలో రక్తపోటు మరియు చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగే అవకాశం ఉందని సూచిస్తున్నాయి. ఇవి రెండూ గుండె ఆరోగ్యానికి చాలా హానికరమైనవే. రక్తనాళాలపై ప్రభావం: కూల్ డ్రింక్స్‌లోని చక్కెర , ఇతర పదార్థాలు రక్తనాళాలలో వాపును ప్రేరేపించవచ్చని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. ఇది రక్తనాళాలు గట్టిపడటానికి, చివరికి గుండె జబ్బులకు కారణం కావచ్చు. మొత్తంగా చెప్పాలంటే.. కూల్ డ్రింక్స్ నేరుగా ఒక్కసారిగా గుండెను ఆపేయకపోయినా, అవి మన శరీరంలో గుండె జబ్బులకు కారణమయ్యే అనేక ప్రమాద కారకాలను పెంచుతాయి. ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ వంటి సమస్యలకు ఇవి పరోక్షంగా సహకరిస్తాయి. మన గుండెను ఆరోగ్యంగా కాపాడుకోవడానికి, శీతల పానీయాల వినియోగాన్ని తగ్గించడం లేదా పూర్తిగా మానేయడం చాలా ముఖ్యం. వీటికి బదులుగా సాదా నీరు ఎక్కువగా తాగండి. కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, మజ్జిగ వంటివి ఎంచుకోండి. తాజా పండ్ల రసాలు తక్కువ పరిమాణంలో తీసుకోవచ్చు. శీతల పానీయాలు కేవలం 'రిఫ్రెష్‌మెంట్' మాత్రమే కాదు, అవి మన గుండెకు ప్రమాదకరమైన ఖాళీ కేలరీల బాంబులు అని గుర్తించాలి. గుండె ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. ఇప్పుడే తెలివైన నిర్ణయం తీసుకుని, శీతల పానీయాలకు దూరంగా ఉందాం, గుండెకు మేలు చేసే ఆహార అలవాట్లను అలవర్చుకుందాం.

## వీటిని తింటే మీ లివర్ పాడైపోతుంది... జాగ్రత్త!



మానవ శరీరంలో కాలేయం అత్యంత ముఖ్యమైన అవయవం. కాలేయం మన శరీరంలో టాక్సిన్స్ ను బయటకు పంపించడంలో, జీర్ణక్రియకు తోడ్పడటం లో కీలక భూమిక పోషిస్తుంది.అటువంటి కాలేయం ఆరోగ్యంగా ఉంటే మనం కొంతమేర ఆరోగ్యవంతులుగా ఉన్నట్టే. కాలేయానికి కొన్ని ఆహారాలు ప్రమాదకరం. మనకు తెలియకుండానే కొన్ని రకాల ఆహారాలు తినడం వల్ల కాలేయం దెబ్బతింటుంది. ఫ్యాటీ లివర్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. కాలేయం ఆరోగ్యం కోసం ఇవి తినకండి కాలేయం ప్రమాదం బారిన పడకుండా ఉండాలంటే ఏమి తినకూడదో ప్రస్తుతం మనం తెలుసుకుందాం. కాలేయం ప్రమాదం బారిన పడకుండా ఉండాలంటే కృత్రిమ స్వీటెనర్లు తినకూడదు. ఫ్రెంచ్ ఫ్రైస్, ఫ్రైడ్ చికెన్ వంటి నూనెలో వేయించిన పదార్థాలను తినకుండా ఉంటేనే మంచిది. కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే ఫాస్ట్ ఫుడ్స్ జోలికి వెళ్ళకూడదు. అంతే కాదు గ్లైసిమిక్ ఇండెక్స్ ఎక్కువగా ఉన్న పదార్థాలను తినకుండా ఉండాలి. కాలేయంపై ప్రతికూల ప్రభావాలు చూపించే ఆహారాలు ఇవే ఫ్రక్టోజ్ ఎక్కువగా ఉండే ఫుడ్ లు కాలేయం పైన ప్రతికూలమైన ప్రభావాన్ని చూపిస్తాయి. ఇవి కాలేయంలో కొవ్వు పేరుకు పోవడానికి కారణమవుతాయి. ఇక కాలేయం ఆరోగ్యంగా ఉండాలని భావించేవారు రెడ్ మీట్, ప్రాసెస్ చేసిన మీట్ తినకుండా ఉండాలి. స్నాక్స్, సోడాలు, కూల్ డ్రింక్స్, కచప్ వంటి వాటికి దూరంగా ఉండాలి. ఇవి కాలేయంలో కొవ్వు పేరుకు పోవడానికి కారణమవుతాయి. ఇవి తింటే కాలేయం పాడవుతుంది కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే నెయ్యి, వెన్న, అధిక కొవ్వు ఉన్న పాల ఉత్పత్తులు వంటి వాటికి దూరంగా ఉండాలి. వీటి వల్ల కూడా కొవ్వు పెరుగుతుంది. ఇది సిరోసిస్ వ్యాధికి దారితీస్తుంది. లివర్ ఆరోగ్యం కోసం పచ్చి మాంసాన్ని తినకుండా ఉండాలి. తక్కువ వండిన మాంసాన్ని కూడా తినకుండా ఉంటేనే మంచిది. కూరగాయలను పచ్చిగా తినటం కూడా కాలేయం పైన అదనపు భారానికి కారణమవుతుంది. కీలకమైన వీటిని మర్చిపోయి ఉంటారు ఆల్కాహాల్ కన్నా ఈ ఆహారాలే కాలేయానికి డేంజర్ కూరగాయలను, ఆకుకూరలను సరిగా కడగకుండా తినడం కూడా లివర్ ఇన్ఫెక్షన్ కు దారితీస్తుంది. ఇక ఆల్కహాల్ తీసుకోవడం లివర్ ను పాడు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆల్కహాల్ కంటే పైన పేర్కొన్న ఆహారాలు మరింత డేంజర్. లివర్ ఆరోగ్యంగా ఉండాలని భావించే వారు వీటిని తినడం మానేయండి.

# మార్కెట్

## రికార్డు స్థాయిలో ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు..

### మొత్తం ఎన్ని లక్షల కోట్లు వచ్చాయంటే..?

జీఎస్టీ వసూళ్లు ఏప్రిల్ నెలలో రికార్డు స్థాయిలో వసూలయ్యాయి. రూ.2.37లక్షల కోట్లు జీఎస్టీ రూపంలో వసూలైనట్లు కేంద్రం గురువారం వెల్లడించింది. గత మార్చి నెలలో జీఎస్టీ వసూళ్లు 1.96లక్షల కోట్లు వసూలైన విషయం తెలిసిందే. గతేడాది ఏప్రిల్ నెలలో వసూళ్లు రూ.2.10 లక్షల కోట్లుగా ఉన్నది. ఇప్పటి వరకు ఇదే అత్యధికం కాగా.. తాజాగా ఆ రికార్డు బద్దలైంది. 2017 జులై ఒకటి నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత అత్యధిక వసూళ్లు నమోదైన నెలగా ఏప్రిల్-2025 రికార్డులకెక్కింది. ఇక గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే జీఎస్టీ వసూళ్లు 12.6 శాతం మేర పెరగడం విశేషం. ఏప్రిల్ నెలలో మొత్తం వసూళ్లలో దేశీయ లావాదేవీల ద్వారా రూ.1.9 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయని కేంద్రం విడుదల చేసిన గణాంకాలు తెలిపాయి. గతేడాదితో పోలిస్తే మొత్తం 10.7శాతం పెరిగింది. దిగుమతైన వస్తువులపై వేసే జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయం 20.8 శాతం పెరిగి రూ.46,913 కోట్లకు చేరింది. రూ.27,341 కోట్ల రిఫండ్లు జారీ అనంతరం నికర జీఎస్టీ వసూళ్లు 9.1 శాతం వృద్ధితో రూ.2.09 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అయితే, రిఫండ్స్ 48.3శాతం ఎక్కువగా ఉండడంతో నికర ఆదాయం 9.1శాతం తగ్గింది. త్రైమాసిక వసూళ్లలో 10.4 శాతం వృద్ధి నమోదవగా.. 2025 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో నమోదైన 8.3 శాతం వృద్ధి కంటే చాలా ఎక్కువ. ఏప్రిల్ నెలలో వసూళ్లు రూ.1.8 లక్షల కోట్ల మార్క్ దాటడం ఇది వరుసగా నాలుగోసారి.

## పాక్ ఆంక్షలు.. ఎయిర్ ఇండియాకు రూ.వేల కోట్ల నష్టం..!




పెహల్‌గామ్ ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాక్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో.. భారత్‌కు చెందిన ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా (%సాఅతీ ×అఇఖు%)కు భారీ నష్టం వాటిల్లనుంది. ఏడాదికి ఏకంగా 600 మిలియన్ డాలర్లు (రూ.5 వేల కోట్లు) నష్టం వాటిల్లుతుందని అంచనా. ఈ మేరకు జాతీయ మీడియాలో వరుస కథనాలు వెలువడుతున్నాయి. గత నెల 22న పెహల్‌గామ్‌లోని మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరాన్ వ్యాలీలో ఉగ్రవాదులు నరమేధం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ దాడిలో 26 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడితో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. దాయాది దేశంపై భారత్ పలు ఆంక్షలు విధించింది. అందుకు ప్రతిగా పాక్ సైతం ప్రతీకార చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో భారత విమానయాన సంస్థలకు తమ గగనతలాన్ని మూసివేసింది. ఈ నిర్ణయంతో భారత్‌కు చెందిన విమానయాన సంస్థలపై పెను భారం పడనుంది. పాక్ చర్యతో భారత్‌లోని ప్రముఖ ఏవియేషన్ దిగ్గజం ఎయిరిండియాకు వేలకోట్ల నష్టం వాటిల్లింది. పాక్ గగనతలంపై భారత విమానాల రాకపోకలపై నిషేధం కారణంగా విమానాలు వేరే మార్గాల గుండా ప్రయాణిస్తున్నాయి. ఫలితంగా ప్రయాణ సమయం పెరిగింది. ముఖ్యంగా ఇంధనం ఖర్చు భారంగా మారింది. ఏడాది పాటూ ఇదే పరిస్థితి కొనసాగితే తమ సంస్థకు 591 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఎయిర్ ఇండియా అంచనా వేసింది. ఈ నష్టం నుంచి బయటపడేందుకు ప్రభుత్వం రాయితీ ఇవ్వాలని కోరుతూ విమానయాన శాఖకు ఎయిరిండియా యాజమాన్యం లేఖ రాసినట్లు సమాచారం. ఎయిర్ ఇండియా సహా, ఇండిగో, స్పైస్‌జెట్ వంటి విమానయాన సంస్థలు కూడా సూచనలు, సలహాలను పౌర వైమానిక శాఖకు తెలియజేశాయి. వీటిని పరిశీలించి తగిన పరిష్కారం వెతికే పనిలో ఆ శాఖ తలమునకలవుతోంది.

## మేడ్చల్‌లో లోహియా బిస్కెట్ ప్లాంట్ ప్రారంభం..



హైదరాబాద్ : రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సమీపంలో మేడ్చల్ వద్ద వరల్డ్ క్లాస్ బిస్కెట్ తయారీ యూనిట్‌ను లోహియా గ్రూప్ ప్రారంభించింది. ఏడు ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో ప్రస్తుతం నెలకు 1000 టన్నుల బిస్కెట్లు తయారుకానుండగా, వచ్చే నాలుగేండ్లలో ఈ సామర్థ్యాన్ని 5 వేల టన్నులకు పెంచుకోనున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించబడిన ఈ కేంద్రం, ప్రముఖ అంతర్జాతీయ సంస్థల ప్రమాణాలకు అనుగుణమైన రీతిలో బెంచ్‌మార్క్ చేయబడింది. ఏడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొత్త హై-స్పీడ్ ఆటోమేటెడ్ సౌకర్యంతో నెలకు 1,000 టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది. మాడ్యులర్ సామర్థ్యాలతో నెలకు 5000 టన్నులకు విస్తరించేందుకు అనుమతిస్తుంది. వచ్చే నాలుగేండ్లలో ఈ సామర్థ్యాన్ని 5 వేల టన్నులకు పెంచుకోనున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. వచ్చే నాలుగేండ్లలో రూ.300 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు ప్రకటించింది. ఈ పెట్టుబడి ద్వారా 6,000 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా లోహియా కన్ఫెక్షనరీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మనీషా లోహియా లహోటి మాట్లాడుతూ.. నాణ్యతతో కూడిన బిస్కెట్లను తయారు చేస్తున్నట్లు తెలిపారు. క్రంచ్, క్రిస్పీనెస్‌గా ఉంటాయన్నారు. ఎంతో రుచిగా ఉంటాయని, అన్ని వయసుల వారు ఎంతో ఇష్టంగా తినే విధంగా తయారు చేస్తున్నామన్నారు.

# మన నమో మిస్సైల్‌తో పాక్ మటాష్

## వంద పాకిస్థాన్‌లు వచ్చినా ఏమీ చేయలేవు

### అమరావతి సభలో లోకేశ్ ఉద్వేగపూరిత ప్రసంగం



అమరావతి,మే2(ఆర్ఎన్ఎ): ఏపీ రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. పదేళ్ల క్రితం 2015 అక్టోబరు 22న అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగానే అమరావతి పునర్నిర్మాణం మొదలైంది. ఈ కార్యక్రమంలో మంత్రి నారాలోకేష్ మాట్లాడుతూ... పహల్గాం దాడిలో అమరులైన టూరిస్టుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వేదిక మీద నుంచి పాకిస్థానీయులను గట్టిగా హెచ్చరించారు. ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన కుటుంబాలకి దేశం మొత్తం అండగా నిలుస్తుంది. పాకిస్థాన్ గీత దాటింది. అమాయకులను చంపింది. చాలా పెద్ద తప్పు చేసింది. ఒక్క పాకిస్థాన్ కాదు.. 100 పాకిస్తాన్ లో వచ్చినా.. భారతదేశ నేలపై మొలిచిన గడ్డి కూడా పీకలేదు. 100 పాకిస్థాన్ లకు సమాధానం చెప్పే.. ఒక్క మిస్సైల్ మన దగ్గర ఉంది. ఆ మిస్సైలే నమో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అని అన్నారు. సింహం ముందు ఆటలాడకూడదు. ఆడితే ఏమవుతుందో అందరికీ తెలుసు. మన ప్రధాని మోడీ కొట్టే దెబ్బకి ప్రపంచ మ్యాప్ లోనే పాకిస్థాన్ కనుమరుగైపోతుంది. ఈరోజు పాకిస్థాన్ ఆర్మీలో పని చేసే వాళ్ళు కొంత మంది రాజీనామా చేశారు. కొంతమంది సెలవు పెట్టి పోయారు. అది మన మోడీ పవర్ అంటే.. మన ప్రధాని దెబ్బకు పాకిస్థాన్ దిమ్మ తిరగడం ఖాయమని మంత్రి నారాలోకేష్ వ్యాఖ్యానించారు. భారత్ వద్ద మోదీ అనే మిసైల్ ఉందన్నారు. అమరావతి పునఃనిర్మాణ సభలో అమరావతి నమో నమః అని రెండు సార్లు అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు.నమో కొట్టే దెబ్బకు పాకిస్థాన్ దిమ్మ తిరగడం ఖాయం. భారత గడ్డపై గడ్డి మొక్క కూడా పీకలేరు. మోదీకి ఏపీ అంటే ప్రత్యేక అభిమానం. ఏపీ ప్రాజెక్టులకు ఆమోదం చెబుతూ మద్దతు ఇస్తున్నారు. 2014లో రాజధాని కూడా లేకుండానే విడిపోయాం. చంద్రబాబు ఆత్మస్థయిర్యం కోల్పోకుండా రాష్ట్రాన్ని నిలబెట్టారు. చంద్రబాబుపై కోపంతో కొందరు రాజధానిని పక్కనబెట్టారు. అమరావతికి అండగా ఆంధ్రా ప్రజలంతా నిలబడ్డారని అన్నారు. ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా అమరావతి రైతులు తగ్గేదే లే అన్నారు. గత ప్రభుత్వం దొంగకేసులు పెట్టి ఎన్ని కుట్రలు చేసినా జై అమరావతి నినాదాలను మాత్రం ఆపలేకపోయింది. ఆపేదానికి.. పీకేదానికి అమరావతి ఎవరి ఇంట్లోనో పెంచుకున్న మొక్క కాదు.. జనం గుండెల్లో దాచుకున్న ప్రజా రాజధాని. రైతులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. అమరావతి అన్ స్టాపబుల్ అన్నారు.

# మరోమారు ప్రత్యేకత చాటుకున్న ఎంపి కలిశెట్టి

### సైకిల్‌పై అమరావతి ప్రాంగణానికి రాక

అమరావతి : విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఇంద్రకీలాద్రి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం పసుపు రంగు సైకిల్ మీద 'సైకిల్ యాత్రగా' అమరావతి సభా ప్రాంగణానికి బయలుదేరారు. రైతుకు నిదర్శనగా, తెలుగుదేశం పార్టీకి నిదర్శనగా సైకిల్ యాత్ర చేసుకుంటూ ఎంపీ కలిశెట్టి సభా ప్రాంగణానికి బయలుదేరారు. ఒక ఎంపీగా, నగర పౌరుడుగా, రైతుబిడ్డగా, తెలుగుదేశం పార్టీలో ఎంపీగా ఉన్నందుకు గర్విస్తున్నాను అని అన్నారు. రాజధాని అమరావతి ప్రపంచంలోనే కీలకపాత్ర పోషిస్తుందని ఎంపీ కలిశెట్టి చెప్పుకొచ్చారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మీడియాతో మాట్లాడుతూ... 'వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా మూడు ముక్కలాట ఆడింది. మన రాజధాని ఏదో చెప్పుకోలేని పరిస్థితికి తీసుకువచ్చాడు వైఎస్ జగన్. మళ్లీ అమరావతికి పునర్ వైభవం వచ్చింది. రాజధానిలో అభివృద్ధి పనులు శరవేగంగా రూపొందుతున్నాయి. అభివృద్ధి పనుల శంకుస్థాపనకు ప్రధాని మోడీ రావడం శుభపరిణామం. విజయనగరంలో ఇప్పటికే ఎయిర్‌పోర్ట్ నిర్మాణం, పలు నిర్మాణ పనులు శరవేగంగా ప్రారంభమయ్యాయి. ఒక ఎంపీగా, నగర పౌరుడుగా, రైతుబిడ్డగా, తెలుగుదేశం పార్టీలో ఎంపీగా ఉన్నందుకు గర్విస్తున్నాను' అని చెప్పారు.

# ఎసిబి కస్టడీకి మాజీ ఈఎన్‌సి హరిరామ్

### అవకతవకలపై కూపీ లాగనున్న ఎసిబి

హైదరాబాద్ : కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అవకతవకల కేసులో చంచల్ గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఈఎన్‌సి భూక్య హరిరామ్ ను ఏసీబీ అధికారులు ఐదు రోజులకస్టడీకి తీసుకున్నారు. ఈ నెల 6వ తేదీ వరకు హరి రామ్‌ను ఏసీబీ అధికారులు విచారించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో హరి రామ్ కీలకంగా వ్యవహరించారు. ఆయనను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విధుల నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీరింగ్ చీఫ్ ఈఎన్‌సీ హరి రామ్ ఇంట్లో ఏసీబీ సోదాలు ముగిసిన అనంతరం ఆయనను పోలీసులు జడ్జి ముందు ప్రవేశపెట్టారు. విచారణ జరిపిన న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో ఆయనను చంచల్ గూడ జైలుకు తరలించారు. సుమారు రూ. 200 కోట్లకుపైగా అక్రమ ఆస్తులు కలిగి ఉన్నట్లు- ఏసీబీ అధికారులు గుర్తించారు. హరి రామ్ ఇంటితోపాటు- ఏకకాలంలో బంధువుల ఇళ్లల్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏక కాలంలో 14 ప్రదేశాల్లో సోదాలు నిర్వహించారు. గజ్వేల్‌లో భారీగా అక్రమాస్తులను అధికారులు గుర్తించారు. మార్కుర్‌లో 28 ఎకరాల భూమి, కొండాపూర్ షేక్స్‌పేట్, శ్రీనగర్, మాదాపూర్ ప్రాంతాల్లో ఖరీదైన ఫ్లాట్లను ఏసీబీ అధికారులు గుర్తించారు. పటాన్ చెరువులో 20 గుంటల భూమి, ఆరెకరాల మామిడి తోట, ఫామ్ హౌస్‌ను గుర్తించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీ భూక్యా హరిరామ్ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టు అయిన విషయం తెలిసిందే. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల మార్పు వ్యవహారంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని, ఇందులో హరిరామ్ కీలకపాత్ర పోషించారనే ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి. మరోపక్క, కాళేశ్వరం ప్రాజెక్టుపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ నివేదిక ఇటీవల వెలువడింది. ఈ నేపథ్యంలో హరిరామ్ ఇల్లు, జలసౌధ కార్యాలయం, హరిరామ్ బంధువులు, స్నేహితులకు సంబంధించిన ఇళ్లు సహా 14 ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ఈ సోదాల్లో ఏసీబీ అధికారులు కళ్లుచెదిరే ఆస్తులను గుర్తించారు. ఏసీబీ ప్రకటన ప్రకారం.. హరిరామ్‌కు మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న మర్కూక్ మండలంలోనే 28 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అలాగే, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో వాణిజ్య స్థలం ఉంది. అంతేకాక, హైదరాబాద్‌లోని షేక్‌పేట్, కొండాపూర్‌లో విల్లాలు, మాదాపూర్, శ్రీనగర్‌కాలనీ, నార్సింగ్‌లో ఫ్లాట్లు- ఉన్నాయి. పటాన్‌చెరులో 20 గుంటల భూమి, శ్రీనగర్ కాలనీలో రెండు ఇండిపెండెంట్ ఇళ్లు కూడా ఉన్నాయి.

# ప్రధానికి స్వాగతం పలకడం అదృష్టం : నాగబాబు

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో కొత్త అధ్యాయాన్ని లిఖించేందుకు, ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ పనులను పునః ప్రారంభించేందుకు రాష్ట్రానికి విచ్చేసిన గౌరవ భారత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారికి స్వాగతం పలకడం నా జీవితంలో ఒక గొప్ప అనుభూతి అని ఎమ్మెల్సీ, జనసేన నేత నాగబాబు అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ గారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున, రాష్ట్ర ప్రజల తరపున మరొక్కమారు కృతజ్ఞతాపూర్వక స్వాగతం పలకడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. దేశం శ్రేయస్సు కోసం తన వయసును కూడా లెక్క చేయకుండా ఆయన పని చేస్తోన్న తీరు మనందరికీ స్ఫూర్తిదాయకం. అన్నారు. మానసికంగా శారీరకంగా ఒత్తిడికి గురవుతున్నప్పటికీ ప్రజా సంక్షేమం కోసం అంకితభావంతో పని చేస్తోన్న ప్రధాని నరేంద్ర మోడీకి ఎల్లవేళలా సంపూర్ణ ఆరోగ్యం, ఆయుష్షు లభించాలని ఆశిస్తున్నట్లు నాగబాబు వెల్లడించారు.

# వివాహేతర బంధంతో భర్త హత్య

### కేసును ఛేదించిన తెనాలి పోలీసులు

గుంటూరు : వివాహేతర సంబంధాలు పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతున్నాయి.. పరాయి వ్యక్తి మోజులో పడి కట్టుకున్నవారిని సైతం కాటికి పంపిస్తున్నారు.. ఈ మధ్య కాలంలో ఇలాంటి కేసులు మరీ ఎక్కువగా వెలుగుచూస్తున్నాయి.. తాజాగా, గుంటూరు జిల్లాలోనూ వివాహేతర సంబంధం పెట్టుకున్న ఓ వివాహిత ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది .. అయితే, మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసుల విచారణలో సంచలన అంశాలు వెలుగు చూశాయి.. పోలీసులు వెల్లడించిన విషయాల్లోకి వెళ్తే.. గత నెల 26న తెనాలి రూరల్ మండలం మల్లెపాడులో పృథ్వీరాజ్ అనే వ్యక్తి దారుణంగా హత్య చేయబడ్డాడు.. అయితే, ఐదేళ్ల క్రితం వెంకటలక్ష్మితో పృథ్వీరాజ్ కు వివాహం జరిగింది.. వెంకటలక్ష్మికి మొదటి భర్త చనిపోవడంతో పృథ్వీరాజ్ తో రెండోపెళ్లి జరిపించారు. ఉపాధి కోసం బెంగుళూరు వెళ్లారు దంపతులు. అయితే, బెంగుళూరులో పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం వెల్లటూరుకు చెందిన కోటేశ్వరరావుతో వెంకటలక్ష్మికి పరిచయం ఏర్పడింది.. అది కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది.. కొన్నిరోజుల తరవాత బెంగుళూరులో ఉండలేక పృథ్వీరాజ్ తెనాలి వచ్చి ఆటోనడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు.. కొన్నాళ్లపాటు- బెంగుళూరులో కోటేశ్వరరావుతోనే ఉండిపోయింది వెంకటలక్ష్మి. మద్యంతాగి కొడుతుండడంతో తిరిగి భర్త వద్దకు వచ్చింది.. అయితే, తమ బంధానికి అడ్డుగా ఉన్న భర్తను లేపేస్తే.. తమకు అడ్డుఉండదని కోటేశ్వరరావుతో కలిసి ప్లాన్ చేసింది వెంకటలక్ష్మి.. తమ ప్లాన్‌లో భాగంగా కోటేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడుతూ అన్నయ్య అంటూ భర్త పృథ్వీరాజ్‌కు పరిచయం చేసింది వెంకటలక్ష్మి.. అక్రమసంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను హత్య చేయడానికి ప్రణాళికలు వేశారు.. తెనాలి వచ్చి మద్యం తాగుదామంటూ పృథ్వీరాజ్ ను బయటకు తీసుకెళ్లిన కోటేశ్వరరావు.. ఫుల్లుగా మద్యం తాగిన తర్వాత కత్తితో పొడిచి.. రాయితో తలపై కొట్టి హత్య చేశాడు.. మొదట హత్య కేసుగా నమోదు చేసిన పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభించలేదు.. ఇదే సమయంలో.. పృథ్వీరాజ్ తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. కోడలిపైనే అనుమానం ఉందని తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. రంగంలోకి దిగిన పోలీసులు.. సెల్ ఫోన్ డేటా ఆధారంగా నిందితులను అరెస్టు చేశారు.. విచారణ జరపగా.. ఈ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.. భార్య అసలు హంతకురాలని తేల్చారు.

# ప్రపంచ రాజధానుల సరసన అమరావతి

### అత్యతంత అధునాతన నగర నిర్మాణం: నారాయణ

అమరావతి : ఏపీ కలల రాజధాని అమరావతిని తరతరాలు గర్వపడేలా నిర్మిస్తామని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. అమరావతి పునర్నిరమాణ సభలో ఆయన ప్రసంగించారు. పదేళ్ల క్రితం ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని పురుడు పోసుకుంది. పునఃప్రారంభం కూడా ఆయన చేతుల మీదుగా జరగడం మన అదృష్టం అని అన్నారు. ప్రపంచంలోనే అగ్రభాగాన ఉన్న 5 రాజధానుల్లో ఒకటిగా అమరావతిని నిర్మించాలనే లక్ష్యంతో 2014-19లోనే రూ.40వేల కోట్ల విలువైన పనులు ప్రారంభించాం. దాదాపు రూ.9వేల కోట్ల పనులు పూర్తి చేశాం. గత ప్రభుత్వం నిర్వాకంతో గత ఐదేళ్లలో రాజధాని పనులు నిలిచిపోయాయి. అధికారంలోకి వస్తే అమరావతిని పూర్తి చేస్తామని కూటమి తరఫున ఎన్నికల ముందు చెప్పాం. ప్రధాని ఆశీస్సులతో సీఎం చంద్రబాబు సారథ్యంలో మూడేళ్లలో అమరావతి నిర్మాణ పనులు పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకెళు _న్నాం. ఇచ్చిన హామీ నిలబెట్టు-కుంటాం' అని మంత్రి నారాయణ అన్నారు. గతంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన ఒకే ఒక్క పిలుపుతో 29 గ్రామాల్లో 29,373మంది రైతులు కేవలం 58 రోజుల్లోనే ఒక్క సమస్య కూడా లేకుండా 34వేల ఎకరాల భూమిని అమరావతి కోసం త్యాగం చేయడం దేశ చరిత్రలోనే ప్రథమం. అమరావతి రైతుల త్యాగం వెలకట్టలేనిది. అమరావతి కోసం ఎన్నో త్యాగాలు చేసిన రైతులకు నా పాదాభివందనంఅని అన్నారు.

# భూములిచ్చిన రైతులు త్యాగాలు మరువలేనివి

### లాఠీదెబ్బలు..కేసులను ఎదుర్కొని నిలిచారు

### మీరిచ్చింది భూమి కాదు...రాష్ట్రానికి భవిష్యత్

### వారి కష్టనష్టాలను గుర్తు పెట్టుకుని అమరావతి నిర్మాణం

### గుండెల్లో బాధ పెట్టుకుని వచ్చిన ప్రధాని మోడీకి కృతజ్ఞతలు

### అమరావతి పునర్నిర్మాణ సభలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

అమరావతి : రాజధాని నిర్మాణానికి 34000 ఎకరాలు ఇచ్చిన 29 వేల పైచిలుకు రైతులుకు డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ నమస్కారాలు తెలిపారు. అమరావతి రైతులు ఐదు సంవత్సరాలుగా నలిగిపోయారని.. రోడ్ల మీదకు వచ్చి, ముల్లకంచెలపై కూర్చొని, పోలీసులు లాఠీ దెబ్బలు తిని, కేసులు పెట్టించుకున్నారని గుర్తు చేశారు. 2000 రైతుల ప్రాణాలు కోల్పోయాయని చెప్పారు. రైతులు నలిగి బాధపడి, తమ కన్నీళ్లు తుడిచేవారు ఉన్నారా? అని చాలామంది మహిళలు రైతులు ఆ రోజుల్లో తను అడిగిన సన్నివేశాన్ని గుర్తు చేశారు. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి తెలుస్తుందా? అని రైతులు అడిగినట్లు తెలిపారు. మోడీకి ఏదీ ఉండదని.. అమరావతి శాశ్వత రాజధాని అని మోడీ నమ్మారని ఆరోజు చెప్పినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం మరోసారి మోడీ చేతుల మీదుగా రాజధాని నిర్మాణం పున ప్రారంభం జరుగుతుందన్నారు. 5 కోట్ల మంది ప్రజలకు సంబంధించి ఈ రాజధాని ఒక హబ్ లాంటిదని, ఓ ఇల్లు లాంటిదన్నారు. రైతులు పడ్డ బాధలను గుర్తు చేసిన డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ నాటి రోజులను గుర్తు చేశారు. రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు నా శిరస్సు వంచి ధన్యవాదాలు తెలియజేస్తున్నా. గత ఐదేళ్లలో మీరు పడ్డ బాధలు, మీరు తిన్న లాఠీ దెబ్బలు, మీరు అనుభవించిన అవస్థలు అన్ని మా మనసులో ఉన్నాయి. దివ్యాంగులను కూడా లాఠీతో కొట్టడం, నా గుండెల్లో ఇప్పటి వరకు ఇలాగే ఉంది. ఆ బాధను నేను మర్చిపోలేను. దీనికి సజీవ సాక్షి నేడు ఈ అమరావతి రాజధాని పునః ప్రారంభం. ఆరోజు మహిళలు విద్యార్థులు చేసిన పోరాటాల త్యాగానికి జవాబుదారీ తరంగా ఉంటాం. అమరావతి మహిళా రైతుల పాత్ర ప్రత్యేకమైనద డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. అమరావతి రైతులు గత ఐదేళ్లు పోరాడారని.. అమరావతి శాశ్వత రాజధానిగా ఉంటుందని మాటిచ్చాం.. గత ప్రభుత్వం అమరావతి భవిష్యత్‌ను తుడిచి పెట్టేసింది.. అమరావతి రైతులు ధర్మ యుద్ధంలో గెలిచారు.. అమరావతి ప్రపంచస్థాయి రాజధానికి మారుతుంది.. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రధాని మోడీ అమరావతి పునఃనిర్మాణ సభకు వచ్చారు.. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే అధికారంలో ఉండటంతో వేగంగా అభివృద్ధి జరుగుతుంది.. మ్యాచింగ్ గ్రాంట్లు- కూడా ఇవ్వని కారణంగా గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుపడింది.. 20 ఏళ్ల ముందే భవిష్యత్‌ను ఊహించి ప్రణాళికతో ముందుకు వెళ్ల గల నేత చంద్రబాబు. అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ దేశమే తన కుటుంబంగా చేసుకుంటూ దేశాన్ని పాలిస్తున్న నరేంద్రమోడీకి రాష్ట్ర ప్రజల తరపున నమస్కారాలు తెలియచేశారు. ప్రస్తుతం దేశంలో కీలక పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఎంతో బిజీ షెడ్యూల్ మధ్య కూడా ప్రధాని అమరావతికి రావడం చాలా సంతోషకరమని పవన్ అన్నారు. కాశ్మీర్ ఉగ్రవాదుల దాడితో నిబ్బరంగా ఉన్న ప్రధాని మోడీకి ఆ కనకదుర్గమ్మ బలాన్ని ప్రసాదించాలని పవన్ కళ్యాణ్ ప్రార్థించారు. దేశంలో ఉగ్రదాడి అనంతరం క్లిష్ట పరిస్థితుల్లో కూడా.. ప్రధాని మోడీ మన కోసం అమరావతికి వచ్చారని పవన్ గుర్తు చేశారు. ఏపీపై మోదీ నిబద్ధతకు ఇదే నిదర్శనమని పవన్ స్పష్టం చేశారు.అమరావతి రైతులు, రాష్ట్ర ప్రజలు ధర్మ యుద్ధంలో విజయం సాధించారని పవన్ చెప్పారు. అమరావతి పనులు పు:న ప్రారంభమవుతున్న శుభసందర్భంలో రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు పవన్ ధన్యవాదాలు తెలియచేశారు.అమరావతి ప్రపంచస్థాయి రాజధానిగా ఆవిర్భవిస్తుందని పవన్ ఆకాంక్షించారు. రాజధాని రైతులు భూములు మాత్రమే ఇవ్వలేదు.. రాష్ట్రానికి ఒక భవిష్యత్ ఇచ్చారని పవన్ కళ్యాణ్ కొనియాడారు. రాళ్లు, రప్పల్లో మహానగరాన్ని చూసిన వ్యక్తి చంద్రబాబు అని పవన్ చెప్పారు. సైబరాబాద్‌ను చంద్రబాబు ఎలా సృష్టించారో.. అమరావతిని కూడా అలాగే అభివృద్ధి చేస్తారని పవన్ ధీమా వ్యక్తం చేశారు.

# క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుకు తొలి అడుగు

### చంద్రబాబుతో టెక్ దిగ్గజ సంస్థల భేటీ

అమరావతి : అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు తొలి అడుగు పడింది. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో జరిగిన కార్యక్రమంలో టెక్ దిగ్గజాలు ఐబీఎమ్, టీసీఎస్, ఎల్ అండ్ టీలతో దేశంలోనే తొలి -టెక్‌పార్క్‌కు ఏపీ సర్కార్ ఎంవోయూ కుదుర్చుకుంది. 2026 జనవరి 1న తొలి క్వాంటం వ్యాలీ టెక్‌పార్క్ ప్రారంభంకానుంది. క్వాంటం కంప్యూటింగ్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఐబీఎమ్, టీసీఎస్, ఎల్ అండ్ టీలతో ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. క్వాంటం పరిశోధన, ఆవిష్కరణలతో పాటు- ఏపీని ప్రపంచ హబ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సర్కార్ ముందు సాగుతోంది. అమరావతిలో భారతదేశపు మొట్టమొదటి, అత్యాధునిక క్వాంటం వ్యాలీ టెక్ పార్క్ నిర్మాణం కానుంది. దేశంలోనే తొలిసారి ఐబీఎం అతిపెద్ద క్వాంటమ్ కంప్యూటర్ 156 క్యూబిట్ హెరాన్ ప్రాసెసర్ కలిగిన 'క్వాంటం సిస్టం 2'ని అమరావతిలో నెలకొల్పనుంది.

# అమరావతి వేదికపై ఆసక్తికర సన్నివేశం

### పవన్‌కు చాక్లెట్ ఇచ్చి ఆశ్చర్య పరచిన మోడీ

అమరావతి : అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవ వేడుక అమరావతిలో పెద్దెతున్న జరుగుతుంది. ఈ సందర్భంగా ప్రధాని మోడీ హాజరయ్యారు. అమరావతిలో ఏర్పాటు చేసిన సభలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కి ప్రధాని మోడీల మధ్య ఓ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ఏర్పాటు చేసిన సభా వేదికపై ముఖ్య నేతలందరూ కూర్చొని ఉండగా..పవన్ ప్రసంగించారు. అనంతరం ప్రధాని మోడీ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను దగ్గరకు పిలిచారు. దానితో ప్రధాని మోడీ ఎందుకు పిలిచారో తెలియని పవన్ కళ్యాణ్ హడావిడిగా ఆయన దెగ్గరికి వచ్చారు. ఆ తర్వాత ప్రధాని తన వద్ద ఉన్న చాక్లెట్ ను పవన్ కు ఇవ్వడంతో వేదికపై ఉన్న వారితో పాటు, సభ ప్రాంగణంలో ఉన్న వారి మధ్య నవ్వులు విరబూశాయి. మొదట మోడీ చాక్లెట్ ఇచ్చిన తర్వాత.. మొదట ప్రధాని, సీఎం చంద్రబాబు నవ్వారు. ఆ తర్వాత పవన్ కళ్యాణ్ కూడా చేతిలో ఉన్న చాక్లెట్ ను చూసి వారితో కలిసి ఆయన కూడా నవ్వేశారు. ఆ తర్వాత మోడీకి రెండు చేతులతో నమస్కరించి నవ్వుతూ తన కుర్చీలో కూర్చున్నాడు పవన్ కళ్యాణ్. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

# మూడేళ్లలో అమరావతి నిర్మాణం

### మోడీ చేతులమీదుగానే ప్రారంభం

### సిఎం చంద్రబాబు వెల్లడి

అమరావతి : మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి చేసి, తిరిగి ప్రధాని మోడీతోనే ప్రారంభిస్తామని సిఎం చంద్రబాబు చెప్పారు. 5 కోట్ల మంది ఆంధ్రప్రదేశ్ ప్రజలు అమరావతి నా రాజధాని అని చెప్పుకునేలా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రధాని మోడీ, కేంద్ర సహకారంతో అమరావతిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మూడేళ్లలో అమరావతి నిర్మాణ పనులు పూర్తి చేస్తామని.. మళ్లీ అప్పుడు అమరావతి ప్రారంభోత్సవానికి కూడా మోడీనే రావాలని కోరారు. సకల హంగులతో ప్రపంచం మెచ్చే విధంగా అమరావతిని తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రపంచంలోని అన్ని ప్రధాన నగరాలకు అమరావతిని అనుసంధానిస్తామని చెప్పారు. 5 లక్షల మంది విద్యార్థులు అమరావతిలో చదువుకునేలా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. ప్రపంచంలోనే అత్యంత ఆధునిక నగరంగా నిర్మిస్తామని అన్నారు. ఇందుకు కట్టుబడి పనిచేస్తామని అన్నారు. అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమంలో ఆయన ఈ ప్రకటన చేశారు.

# ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన మసీదుల మూత

లక్నో : ఉత్తర్ ప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం అక్రమ మసీదులు, మదర్సాలపై ఉక్కుపాదం మోపుతోంది. ముఖ్యంగా భారత్- నేపాల్ సరిహద్దుల్లోని ఉన్నవాటిపై అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు. జిల్లా పాలనాధికారులు, స్థానిక పోలీసులు, సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ) వంటి కేంద్ర దళాల సమన్వయంతో శుక్రవారం పెద్ద ఎత్తున యాక్షన్ చేపట్టింది. అక్రమ మసీదుల్ని మూసేయడంతో పాటు- ప్రభుత్వ భూముల్లో అనధికారికంగా నిర్మించిన మతపరమైన నిర్మాణాలు కూల్చేశారు. మహారాజ్‌గంజ్ జిల్లాలో, అధికారులు 11 మదర్సాలను సీజ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో నిర్మించిన మసీదులు, మందిరాలతో సహా అనేక భవనాలను కూల్చేశారు. శ్రావస్తిలో గుర్తింపు లేని 41 మదర్సాలను మూసేశారు. రెవెన్యూ కోడ్‌లోని సెక్షన్ 67 ప్రకారం, ఇండో-నేపాల్ సరిహద్దు నుండి 15 కిలోమీటర్ల వ్యాసార్థంలో శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలతో సహా 139 అక్రమ నిర్మాణాలను గుర్తించి తొలగించినట్లు- అధికారులు తెలిపారు. బహ్రైచ్ జిల్లాలో, రుపైదిహ, మోతీపూర్ వంటి సరిహద్దు ప్రాంతాలలో కూడా ఇలాంటి చర్యలు కొనసాగుతున్నాయి.

# గంగా ఎక్స్‌ప్రెస్ హైవేపై యుద్ధ విమానాల ల్యాండింగ్ డ్రిల్

లక్నో : యుద్ధవిమానాలు పగటి వేళలలోనే కాకుండా, రాత్రి వేళల్లోనూ ఇక్కడ దిగేందుకు వీలుగా షాజహాన్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మించారు. ఇంతవరకూ, ఇదేతరహా అత్యవసర ల్యాండింగ్ డ్రిల్స్‌ను లక్నో-ఆగ్రా, పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేలలో నిర్వహించారు. భారత వాయిసేన యుద్ధ విమానాలు అత్యవసర పరిస్థితుల్లో ల్యాండింగ్, టేకాఫ్ తీసుకునేందుకు అవసరమైన డ్రిల్స్ శుక్రవారంనాడిక్కడ ప్రారంభించారు. ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌లో గంగా ఎక్స్‌ప్రెస్‌పై ఉన్న దాదాపు 3.5 కిలోమీటర్ల స్ట్రిప్‌పై ఈ డ్రిల్స్ చేపట్టారు.




## నటనకు గుడ్‌బై చెప్పేస్తానేమో: అజిత్

కోలీవుడ్ స్టార్ హీరో, పద్మ భూషణ్ అజిత్ కుమార్ తెలుగు ప్రేక్షకులకి కూడా చాలా సుపరిచితం. ఆయన నటించిన చాలా సినిమాలు తెలుగులో రిలీజై ప్రేక్షకులని ఎంతగానో అలరించాయి. ఇటీవల అజిత్ సినిమాల కన్నా కూడా మోటార్ రేసింగ్ పై ఎక్కువగా దృష్టి సారించాడు. మోటర్ రేసింగ్‌లో తల ఎన్నిసార్లు గాయపడ్డా కూడా దానిని వీడడం లేదు. అయితే తాజాగా ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్ ఇప్పుడు అభిమానుల్లో ఆందోళన కలిగిస్తుంది. ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ.. నేను ఎప్పుడు నటన నుండి వైదొలుగుతానో తెలియదు. బలవంతంగా వీడాల్సి రావచ్చు. నేను ఏ విషయాన్నైన కూడా తేలికగా తీసుకోకూడదు అనుకుంటు–న్నా. ప్రేక్షకులు నా నటన గురించి ఫిర్యాదు చేస్తారేమో, అప్పుడు వైదొగలగక తప్పదు. ఒకవేళ నన్ను అంతా ఆదరిస్తున్నప్పుడే తప్పుకుంటానేమో. జీవితం చాలా విలువైనది. నేను నా కెరీర్‌లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాను. నా స్నేహితులు క్యాన్సర్‌తో పోరాడుతున్నారు. అలాంటి వారిని చూసినప్పుడు జీవితం విలువ ఏంటో అర్థమవుతుంది. సమయాన్ని వృధా చేయకుండా నా లైఫ్‌లోని ప్రతిక్షణాన్ని ఆస్వాదించాలని అనుకుంటున్నా అని అజిత్ అన్నారు. తాను యాక్సిడెంటల్ స్టార్ అని అన్నాడు. రంగుల ప్రపంచంలో భాగం కావాలని తాను ఎప్పుడూ ఎ÷–లాన్ చేసుకోలేదని అనుకోకుండా నటు–డయ్యానంటూ అజిత్ అన్నారు. నటనపై ఎప్పుడు దృష్టి పెట్టలేదు. యాక్సిడెంటల్ స్టార్‌ని నేను. స్కూల్ చదువుల తర్వాత ఆటోమొబైల్ రంగంలో పని చేసాను??? అని అజిత్ తెలిపారు. 18 ఏళ్లు ఉన్నపుడు రేసింగ్ స్టార్ట్ చేశాను. రేసింగ్ ఖర్చుతో కూడుకున్న పని అవ్వటంతో మా అమ్మానాన్నలు ఆర్థికంగా నాకు అంతగా సపోర్ట్ చేయలేకపోయారు. అయిన నేను వెనక్కి తగ్గలేదు. ఓ రోజు నేను రేస్ ట్రాకులో ఉండగా.. మోడల్ కోఆర్డినేటర్ నా దగ్గరకు వచ్చి మోడలింగ్‌లో ఆసక్తి ఉంటే తనను కలవమని ఓ కార్డ్ ఇచ్చి వెళ్లాడు. రేసింగ్ కోసం డబ్బులు వస్తాయి కాబట్టి ఓకే చెప్పాను. మోడలింగ్‌లో వచ్చిన డబ్బుల్ని రేసింగ్ కోసం వాడేవాడిని. ఓ సారి తెలుగు సినిమా ఆడిషన్‌కు కాల్ రాగా, నాకు తెలుగు రాదు కాబట్టి నేర్చుకున్నా. మా కుటు–ంబానికి సినిమాలతో అస్సలు సంబంధం లేదు కాబట్టి వారు భయపడ్డారు. వారికి నచ్చజెప్పి సినిమాల్లోకి వెళ్లా. వ్యాపారంలో బాగా దెబ్బతినటం వల్ల నేను సినిమాల్లోకి వచ్చాను.. నా యాస కారణంగా కూడా చాలా విమర్శలు కూడా ఎదుర్కొన్నాను. పట్టు–దలతో అన్నిటిపై పట్టు– సాధించాను. సినిమాల విషయంలో ఎంతో నిజాయితీగా ఉన్నాను అంటూ అజిత్ పేర్కొన్నారు.




## పద్మనాభస్వామి ఆలయం చుట్టూ జటాధర

టాలీవుడ్ స్టార్ హీరో సుధీర్ బాబు నటిస్తున్న పాథలాజికల్, నేచురల్ థ్రిల్లర్ మూవీ 'జటాధర'. వెంకట్ కల్యాణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో రైన్ అంజలి, శిల్పా శిరోడ్కర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జీ స్టూడియో సమర్పణలో కె.ఆర్. బన్సాల్, ప్రేరణ అరోరా సంయుక్తంగా మూవీని నిర్మిస్తున్నారు. అనంత పద్మనాభ స్వామి ఆలయం కథాంశంతో మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాతో.. బాలీవుడ్ బ్యూటీ– సోనాక్షి సిన్హా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతుంది. ఈ మూవీలో పవర్ ఫుల్ రోల్‌లో ఆమె కనిపించబోతున్నట్లు ఆమె లుక్ చూస్తే తెలుస్తోంది. అయితే తాజాగా ఈ మూవీకి సంబంధించి తాజాగా ఓ వార్త వైరల్ అవుతుంది.. ఇక ఈ సినిమాలో విలన్‌గా రోహిత్ పాఠక్ నటిస్తు న్నాడు. 'ఖాకీ', 'సీటీ–మార్','సీతా రామం', 'వీర సింహారెడ్డి', 'వాల్తేరు వీరయ్య' వంటి హిట్ సినిమాల్లో తన విలనిజంతో ఆకట్టుకుని తెలుగులో బాగా పాపులర్ అయ్యాడు. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తున్న 'ది రాజా సాబ్' సినిమాలో కూడా ఓ విలన్ గా నటిస్తున్నాడు. తాజా సమాచారం ప్రకారం 'జటాధర' లో రోహిత్ కి భార్య పాత్రలో మహేష్ బాబు మరదలు శిల్పా శిరోద్కర్ కనిపించనుందట. ఈమె రోల్ చాలా పవర్ఫుల్‌గా ఉంటుందని సమాచారం. త్వరలోనే ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా వదిలే అవకాశం ఉంది.





## హిట్ టాక్ దక్కించుకున్న రైడ్-2

ఇటీవలి కాలంలో బాలీవుడ్ చిత్రాలు పెద్దగా సక్సెస్ సాధించింది లేదు. ఖాన్ హీరోల సినిమాలకి కూడా ఆదరణ దక్కడం లేదు. దాంతో బాలీవుడ్ పని ఖతమైనట్టే అని అందరు అనుకుంటున్నారు. కాని ఇప్పుడు సీనియర్ హీరో అజయ్ దేవగణ్.. బాలీవుడ్‌కి ఊపిరి పోసాడు. ఆయన నటించిన రైడ్ 2 చిత్రం మంచి హిట్ టాక్ దక్కించుకోగా, తొలి రోజు బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లే రాబట్టింది. అజయ్ దేవగన్, రితేష్ దేశ్‌ముఖ్ నటించిన రైడ్ 2 చిత్రం మొదటి రోజు 18.25 కోట్ల వసూళ్లు సాధించింది. రైడ్ 2 మూవీ 2018లో వచ్చిన రైడ్‌కి సీక్వెల్ గా రూపొందింది. రైడ్ 2 చిత్రం ఐటీ– రైడ్స్ ప్రధానంగా తెరకెక్కగా, ఇందులో సౌరభ్ శుక్లా విలన్ పాత్ర పోషించారు. అదే సమయంలో, రైడ్ 2లో రితేష్ దేశ్‌ముఖ్ విలన్ పాత్రలో నటించారు. దర్శకుడు రాజ్‌కుమార్ గుప్తా రైడ్ 2 చిత్రాన్ని 48 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించగా, ఈ చిత్రానికి భూషణ్ కుమార్, అభిషేక్ పాఠక్, కృష్ణ కుమార్ నిర్మాతలుగా వ్యవహరించారు. వాణీ కపూర్, రజత్ కపూర్, సౌరభ్ శుక్లా, సుప్రియా పాఠక్, అమిత్ సైల్, యశ్‌పాల్ శర్మ, గోవింద్ నామ్‌దేవ్, బ్రిజేంద్ర కాలా ప్రధాన పాత్రల్లో నటించారు. తొలి రోజు ఈ చిత్రం మంచి వసూళ్లే రాబట్టగా, వారాంతంలో మరిన్ని వసూళ్లు రాబడుతుందని అంటున్నారు. రైడ్ 2 జోరు చూస్తుంటే మొదటి వారాంతంలోనే బ్రేక్ ఈవెన్ అవుతుందనే ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. బాలీవుడ్ సినిమా ఇటీ–వల బాక్సాఫీసు వద్ద స్ట్రగుల్ అవుతున్న నేపథ్యంలో రైడ్ 2 చిత్రం ఊపు తెచ్చేలా కనిపిస్తుంది. రైడ్ 2 సినిమాకు ఏకపక్షంగా హిట్ టాక్ రావడంతో నార్త్ ఇండియాలో ప్రేక్షకుల సానుకూలంగా స్పందించారు. ఓవర్సీస్‌లో ఈ సినిమా 5 కోట్ల మేర వసూళ్లు సాధించవచ్చు అని ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి.




## బాకాసుర రెస్టారెంట్ పోస్టర్ విడుదల

కొన్ని రోజులుగా కమెడియన్ ప్రవీణ్ రెస్టారంట్‌ను ప్రారంభించనున్నారనే వార్త సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. అయితే ఇదంతా ఓ సినిమా కోసమేనని క్లారిటీ వచ్చేసింది. ఆయన ఏ బిజినెస్ ప్రారంభించడం లేదు. అది సినిమా పేరు మాత్రమే. ఈ విషయాన్ని తెలుపుతూ 'బకాసుర రెస్టారెంట్' ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. కమెడియన్ ప్రవీణ్, వైవా హర్ష ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. శుక్రవారం ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. కృష్ణభగవాన్, షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్, ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రం ఎస్‌జే మూవీస్ పతాకంపై రానుంది. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ.. హంగర్ కామెడీ ఎంటర్–టైనర్‌గా ఈ చిత్రం రానుందన్నారు. ప్రవీణ్ కెరీర్‌లోనే గుర్తుండిపోయే చిత్రమవుతుందన్నారు. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు ఈ సినిమా కచ్చితంగా నచ్చుతుందన్నారు.









## స్పిరిట్ కోసం వంగా ముమ్మర యత్నాలు

ప్రభాస్ నటించబోయే సినిమాలలో సందీప్ రెడ్డి వంగాతో చేస్తున్న స్పిరిట్ కోసం అభిమానులు ఎదురు చేస్తున్నారు. ఇప్పటికే దర్శకుడు సందీప్ రెడ్డి వంగ ప్రీ ప్రొడక్షన్ వర్క్‌తో బిజీగా ఉన్నాడు. ప్రస్తుతం కొత్త నటీనటులను ఫైనల్ చేసే పనిలో ఉన్నాడు. మరోవైపు ప్రభాస్ ఫౌజీ. రాజసాబ్ షూటింగ్స్ పూర్తి చేసేలా జెట్ స్పీడ్‌లో ఉన్నాడు. వీలైనంత త్వరగా స్పిరిట్‌ను సెట్స్ పైకి తీసుకెళ్లేలా ప్లాన్ చేస్తున్నాడు వంగా .ఈ సినిమాలో ఫస్ట్ టైం పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నాడు ప్రభాస్. కానీ ఇప్పుడు ఈ సినిమాపై రకరకలా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రభాస్ ముందుగా రాజాసాబ్, ఫౌజీ సినిమాలను ఫినిష్ చేసి ఆ తర్వాత ప్రశాంత్ వర్మ సినిమా స్టార్ట్ చేస్తాడని ఆ వెంటనే నాగ్ అశ్విన్ డైరెక్షన్ లో కల్కి 2 చేసి లైన్ లోనే సలార్ 2 ను కూడా చేసేలా ప్లానింగ్ జరుగుతోందట. ఇవన్నీ ఫినిష్ అయ్యాకే సందీప్ రెడ్డి వంగతో స్పిరిట్ ఉంటుందని టాక్ నడుస్తోంది. అయితే ఇవన్నీ ఫేక్ అని విశ్వసనీయ సమాచారం. సందీప్ రెడ్డి వంగా మరే ఇతర సినిమాలు చెయట్లేదు. ఇటీవల ఆయన కథ చెప్పడానికి రెండుసార్లు చెన్నైకి వెళ్లి విజయ్ సేతుపతితో చర్చించారు.

## రెండు ఓటిటిల్లోకి ఓదెల-2 మూవీ

ఇటీవల విడుదలైన 'ఓదెల 2' మూవీ ఓటిటిలోకి వచ్చేసింది. తమన్నాతో పాటు హెబ్బాపటేల్, వశిష్ట ఎన్ సింహా, మురళీ శర్మ కీలక పాత్రలు పోషించిన ఈ మూవీకి డైరెక్టర్ సంపత్ నంది కథను అందించాడు. ఈ మూవీకి అశోక్ తేజ దర్శకత్వం వహించాడు. ప్రేతాత్మకు, నాగసాధువుకు మధ్య పోరాటం నేపథ్యంలో సంపత్ నంది ఈ కథను రాసుకున్నారు. ఈ నెల 17న రిలీజైన ఈ మూవీ లో ప్రతి ఒక సీన్ డైలాగ్.. భయనకం గానే ఉన్నాయి. ప్రేక్షకులు కూడా బాగా ఎంజాయ్ చేశారు. ముఖ్యంగా తమన్నా ఎంట్రీ ఇచ్చిన తర్వాత కథలో కొంత వైవిధ్యం కనిపిస్తుంది. మునుపెన్నడూ చూడని విధంగా తమన్న తనలోని కొత్త కోణాని చూపించింది. మొదటి భాగంలో కొంత అడల్ట్ కనిపించినప్పటికి.. ఈ రెండో భాగం మాత్రం చాలా డీసెంట్‌గా తీశాడు. కానీ కొంత మంది రొటీన్ స్టోరీలైన్‌తో పాటు ప్రేతాత్మతో నాగసాధువు పోరాటాన్ని పవర్‌ఫుల్‌గా చూపించలేకపోయాడు డైరెక్టర్ అంటూ కామెంట్స్ వినిపించాయి. అయినప్పటికి నాగసాధువుగా తమన్నా యాక్టింగ్‌కు మాత్రం ప్రశంసలు దక్కాయి. ఇక తాజా సమాచారం ప్రకారం ఈ మూవీ క్షి రిలీజ్ కు సిద్ధం అయింది. ఓదెల 2 మూవీ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకున్నది. ఈ నెల 16 నుంచి మూవీ స్ట్రీమింగ్ కానున్నట్లు– సమాచారం. దీని గురించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అయితే అమెజాన్ ప్రైమ్‌తో పాటు– ఆహా ఓటీటీ లోనూ ఓదెల 2 మూవీ స్ట్రీమింగ్ కానుంది. దీని గురించి అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com